॥ ఓం శ్రీపరమాత్మనే నమః ॥

# అథ చతుర్దశోఽ ధ్యాయః - గుణత్రయ విభాగయోగః

## (పదునాల్గవ అధ్యాయము - గుణత్రయ విభాగయోగము)

మూడవ షట్కము ప్రధానంగా జ్ఞానయోగాన్ని బోధిస్తుంది. అందులో కూడా 13, 14, 15 అధ్యాయాలు ప్రత్యేకించి జ్ఞానయోగాన్ని బోధిస్తాయి. ఈ అధ్యాయాలు ఉపనిషత్తుల సారం.

**సర్వోపనిషదో గావో దోగ్ధా గోపాలనందనః** - ధ్యానశ్లోకాలు

కృష్ణపరమాత్మ ఉపనిషత్తుల సారాన్ని ఉపనిషత్తు అనే ఆవునుంచి పిండాడు. ఈ ఉపనిషత్తులు మన ఉన్నత స్వరూపం గురించి బోధిస్తాయి.

ఇంతకుముందు అధ్యాయంలో మన ఉన్నత స్వరూపాన్ని క్షేత్రజ్ఞునిగా చూశాము. ఉపనిషత్తులో ఆత్మగా వ్యవహరించేదాన్నే ముందు అధ్యాయంలో క్షేత్రజ్ఞుడు అన్నాడు కృష్ణపరమాత్మ. ఉపనిషత్తులో ఆత్మజ్ఞానం బోధించటానికి వాడే పద్ధతుల్లో దృగ్దృశ్యవివేకము ఒకటి. దృక్ అంటే చూసే నేను; దృశ్యం అంటే నాకు భిన్నంగా నేను చూసే వస్తువులు.

నేను వస్తువుగా చూసేది ఏదీ నేను కాదు. అలా ఒక్కొక్కదాన్నీ నిషేధించుకుంటూ వస్తే, చివరికి వాటన్నిటినీ సాక్షిగా చూసే నేను మిగులుతాను. దీన్ని నేతి - నేతి పద్ధతి అంటారు. నేతి అంటే న+ఇతి. ఇదికాదు, ఇదికాదు అంటూ సత్యాన్ని అన్వేషించాలి. చూసే జగత్తు నేను కాదు, శరీరం, మనస్సులు కూడా నేను కాదు. ఎందుకంటే వాటిలో జరిగే మార్పులు నాకు తెలుస్తున్నాయి. అలా ఒక్కొక్క వస్తువునూ దృశ్యంగా నిషేధించుకుంటూ వచ్చి, దృక్ ఏదో తెలుసుకోటమే **దృగ్దృశ్య వివేకము**. వీటికి వేరే పేర్లు చూశాము పదమూడవ అధ్యాయంలో. దృక్‌ను క్షేత్రజ్ఞుడు అనీ, దృశ్యాన్ని క్షేత్రం అనీ అన్నాడు కృష్ణపరమాత్మ. ఈ క్షేత్రజ్ఞుడు-క్షేత్రాలను ఆత్మ-అనాత్మ అంటారు ఉపనిషత్తుల్లో.

ఇప్పుడు అదే ఆత్మను ఈ అధ్యాయంలో కృష్ణపరమాత్మ గుణాతీతుడు లేదా నిర్గుణతత్త్వంగా వర్ణించబోతున్నాడు. గుణాలు ఉన్నదేదైనా అనాత్మ కిందికి వస్తుంది. సగుణమైన వాటినన్నిటినీ నిషేధించుకుంటూ వస్తే మిగిలేది గుణాతీత ఆత్మ. అందువల్ల ఈ అధ్యాయం గుణత్రయ, గుణాతీతః విభాగయోగము అయింది. ముందు అధ్యాయంలో ఈ విభజనను క్షేత్రం, క్షేత్రజ్ఞుడుగా చెప్పటంవల్ల అది క్షేత్ర-క్షేత్రజ్ఞ విభాగయోగము అయింది.

సగుణ అంటే గుణాలు ఉన్నది; నిర్గుణ అంటే గుణాలు లేనిది. ఇక్కడ సగుణాన్ని గుణత్రయంగా చూడబోతున్నాము. గుణత్రయం అంటే మూడు గుణాలు. వాటి వివరాలు ముందుముందు చూస్తాము. నిర్గుణతత్త్వాన్ని గుణాతీతః అంటున్నాడు. అంటే గుణాలు లేనిది. గుణత్రయ, గుణాతీత విభాగాలు చేసి; నేను ఈ గుణాతీత ఆత్మను; గుణత్రయ అనాత్మను కాను అని నేర్చుకుంటాము ఈ అధ్యాయంలో. ఇంకో విధంగా

చెప్పాలంటే ఇది ఆత్మానాత్మవివేకం చూపిస్తుంది కాబట్టి, ఈ అధ్యాయం చాలా ముఖ్యమైన అధ్యాయం. ఈ నేపథ్యంతో ఈ అధ్యాయంలోకి అడుగుపెడదాము.

**శ్రీ భగవాన్ ఉవాచ**

శ్లో. 1 **పరం భూయః ప్రవక్ష్యామి జ్ఞానానాం జ్ఞానముత్తమమ్ ।**
**యద్ జ్ఞాత్వా మునయస్సర్వే పరాం సిద్ధిమితో గతాః ॥**
పరమ్, భూయః, ప్రవక్ష్యామి, జ్ఞానానామ్, జ్ఞానమ్, ఉత్తమమ్,
యత్, జ్ఞాత్వా, మునయః, సర్వే, పరామ్, సిద్ధిమ్, ఇతః, గతాః ॥

| | | | |
|---|---|---|---|
| యత్, జ్ఞాత్వా | = దేనిని తెలిసికొనినందువల్ల | ఉత్తమమ్ | = అత్యుత్తమమైనట్టి |
| సర్వే, మునయః | = మునులంతా | పరమ్ | = పరమ |
| ఇతః | = ఈ సంసారమునుంచి ముక్తులై | జ్ఞానమ్ | = జ్ఞానమును |
| పరామ్, సిద్ధిమ్ | = పరమసిద్ధిని | భూయః | = మళ్ళీ |
| గతాః | = పొందారో అటువంటి | ప్రవక్ష్యామి | = నేను చెప్పెదను |
| జ్ఞానానామ్ | = జ్ఞానములన్నింటిలోను | | |

**యత్ జ్ఞాత్వా సర్వే మునయః ఇతః పరామ్ సిద్ధిమ్ గతాః, (తత్)**
**జ్ఞానానామ్ ఉత్తమమ్ పరమ్ జ్ఞానమ్ భూయః (అహం తే) ప్రవక్ష్యామి ॥**

తా: దేనిని తెలిసికొనినందువల్ల మునులంతా ఈ సంసారమునుంచి ముక్తులై పరమసిద్ధిని పొందారో అటువంటి జ్ఞానములన్నింటిలోను అత్యుత్తమమైనట్టి పరమ జ్ఞానమును మళ్ళీ చెప్పెదను.

## 1. ఉపోద్ఘాతం – శ్లోకాలు 1-4

ఈ అధ్యాయంలో కృష్ణపరమాత్మే స్వయంగా ఇంకా బోధ చేస్తానంటాడు. పదమూడవ అధ్యాయంలో అర్జునుడు ప్రశ్నలు అడిగితే వాటికి జవాబులు చెప్పాడు. కాని ఈ అధ్యాయంలో అర్జునుడు ప్రశ్న అడగకపోయినా కృష్ణపరమాత్మ తనంతట తాను ఇంకా చెబుతానన్నాడు. అలా ఎందుకు చేస్తున్నాడు? అర్జునుడు శ్రద్ధగా వింటున్నాడనా, ఆయనకే బోధ చెయ్యటం సరదానా అనే సందేహం కలుగవచ్చు ఎవరికైనా.

దీనికి శంకరాచార్యులవారు జవాబు చెబుతున్నారు. చెప్పే అంశం చాలా సూక్ష్మమైనదీ, అర్థం చేసుకోవటానికి కష్టమైనదీ అయితే, గురువు దాన్ని పదేపదే చెప్పాలి. బోధించే విషయం ఒకవేళ తేలికగా అర్థమయ్యేదయితే, అన్నిసార్లు చెప్పనవసరం లేదు. ఒక స్వామీజీ చాలా గంభీరమైన, లోతైన వాక్యాలు చెప్పి, ఆలోచించండి అని చెప్పి, అరనిముషంపాటు ఆగేవారుట. అంటే వారు ఆలోచించటానికి తగు సమయం ఇచ్చేవారన్నమాట. ఈయన పద్ధతిని గమనించాడొక శిష్యుడు. తను కూడా గురువుగారి అడుగుజాడల్లో నడవాలనుకున్నాడు. ఆ శిష్యుడు కూడా బోధ చెయ్యటం మొదలుపెట్టాడు. 'భగవద్గీతలో 18 అధ్యాయాలు ఉన్నాయి. ఆలోచించండి,' అన్నాడు. అందులో ఆలోచించటానికి ఏముంది?

మంచి గురువుకు ఎక్కడ ఆ విషయాన్ని మళ్ళీ చెప్పాలో, ఎక్కడ శిష్యులకు ఆలోచించుకునే అవకాశం ఇవ్వాలో, ఎక్కడ చెప్పి వదిలేయాలోలాంటి మెళకువలు తెలిసివుండాలి. జగద్గురువు అయిన కృష్ణపరమాత్మకు అటువంటి మెళకువలు వెన్నతో పెట్టిన విద్య అని ప్రత్యేకించి చెప్పాలా? ఆత్మజ్ఞానం దుర్విజ్ఞేయం అంటే అర్థం చేసుకోవటం చాలా కష్టం; అతి సూక్ష్మం అంటే చాలా జటిలమైన బోధ. ఇటువంటి బోధను పదేపదే చేస్తే అది దోషం కింద రాదు. నేర్పించే అంశం తేలికగా ఉంటే, దాన్ని పదేపదే చెపితే, అప్పుడు పునరుక్తిదోషం కలుగుతుంది. కాని చెప్పే అంశం జటిలంగా, క్లిష్టంగా ఉంటే ఈ పునరుక్తిదోషం అంటదు.

అందువల్ల కృష్ణపరమాత్మ చెబుతున్నాడు, 'ఓ అర్జునా! నేను అంతకుముందు అధ్యాయాల్లో చేసిన బోధ చాలా క్లిష్టమైనది; నువ్వు సూక్ష్మగ్రాహివి కాబట్టి నీకు బాగా అర్థమయ్యే ఉంటుంది. కాని నా తృప్తికోసం దాన్ని మళ్ళీ చెబుతాను విను. కాకపోతే, ఇప్పుడు అదే అంశాన్ని ఇంకొక కోణంనుంచి చూద్దాము.' ఒకే కూరను రకరకాలుగా ఎలా వండుతారో, అలా ఒకే అంశాన్ని ఇప్పుడు కృష్ణపరమాత్మ ఇంకొక కోణంలోంచి చెప్పబోతున్నాడు. ఆత్మ-అనాత్మలను ఇంతకుముందు క్షేత్రజ్ఞుడు-క్షేత్రంగా చూశాము; పురుషుడు-ప్రకృతిగా కూడా చూసాము. ఇప్పుడు గుణత్రయం-గుణాతీతంగా చూడబోతున్నాము.

**శ్రీ భగవాన్ ఉవాచ** – శ్రీ కృష్ణపరమాత్మ చెబుతున్నాడు.

**భూయః ప్రవక్ష్యామి** – నేను మళ్ళీ ఇంకొకసారి ఇదే బోధను చేస్తాను. ఏ బోధ? ఆత్మజ్ఞాన బోధను చేస్తాను అంటున్నాడు. అది ఎటువంటి జ్ఞానము?

**పరమ్ ఉత్తమం జ్ఞానమ్** – అది ప్రపంచంలోనే అతి ఉత్తమమైన జ్ఞానం. పరం అంటేనే అత్యుత్తమమైన; ఉత్తమంకంటే కూడా అత్యుత్తమమైన. కృష్ణపరమాత్మ అత్యుత్తమమైన జ్ఞానాన్ని బోధిస్తాను అని చెప్పటానికి అత్యుత్తమమైన, అత్యుత్తమమైన అని రెండుసార్లు ఎందుకు చెప్పాడు అని శంకరాచార్యులవారు తన భాష్యంలో ప్రశ్నవేసి, ఆయనే జవాబు చెబుతున్నారు. ఏమని? రెండుసార్లు వాడటంవల్ల వాటి అర్థాల్లో సూక్ష్మభేదం ఉంది.

అత్యుత్తమమైన పదాల్లో మొదటిపదం విషయవస్తువును సూచిస్తుంది. అది చేసే బోధ ప్రపంచంలోనే అత్యుత్తమ వస్తువు గురించి చేస్తుంది. ఈ జ్ఞానం చాలా గొప్పది. ఎందుకంటే ఇది మామూలు, అశాశ్వతమైన విషయాల గురించి మాట్లాడదు. ఇది చెప్పేది పారమార్థిక సత్యం గురించి. అందువల్ల **విషయదృష్ట్యా ఉత్తమమ్**.

రెండవ అత్యుత్తమ పదం దానివల్ల వచ్చే ఫలాన్ని స్తుతిస్తుంది. ఆత్మజ్ఞానం లేదా బ్రహ్మజ్ఞానం అనే అంశం అత్యుత్తమమైన అంశం. సహజంగానే దానివల్ల వచ్చే ఫలం కూడా అత్యుత్తమంగానే ఉంటుంది. అందువల్ల రెండవసారి చెప్పిన పదం **ఫలదృష్ట్యా ఉత్తమమ్**. తక్కిన లౌకిక విద్యలు ధర్మార్థకామాలనే ఫలాలనే ఇస్తే, పరావిద్య అయిన ఈ విద్య అత్యంత గొప్ప ఫలమైన మోక్షాన్ని కలుగజేస్తుంది. మోక్షం శాశ్వతమైన ఫలం.

**ఉత్తమ విషయత్వాత్ ఉత్తమ ఫలత్వాత్ ఉత్తమం జ్ఞానమ్**

ముండకోపనిషత్తులో అందువల్లనే ఈ జ్ఞానాన్ని పరావిద్య అన్నారు. ఈ విద్యను కృష్ణపరమాత్మ రాజవిద్య అన్నాడు తొమ్మిదవ అధ్యాయంలో. ఇప్పుడు ఇంత ఉత్తమ ఫలాన్నిచ్చే, ఉత్తమ విద్యను నీకు బోధిస్తాను అర్జునా అంటున్నాడు కృష్ణపరమాత్మ.

మోక్షం వస్తుందన్నారు బాగానే ఉంది, కాని మోక్షం అంటే ఏమిటి? ఇది తర్వాత వచ్చే ప్రశ్న. మోక్షం ఒక సాంకేతిక పదం కాబట్టి, కృష్ణపరమాత్మే మోక్షఫలాన్ని వివరించబోతున్నాడు.

**యత్ జ్ఞాత్వా** – ఆ జ్ఞానాన్ని, ఆ గొప్ప జ్ఞానాన్ని పొందటంవల్ల,

**సర్వే మునయః** – ముని అంటే అక్షరాలా చూస్తే సన్న్యాసి. కాని సన్న్యాసి అర్థం వైరాగ్యం. వైరాగ్యం పదం సాధన చతుష్టయ సంపత్తిని సూచిస్తుంది. మునయః అంటే కావాల్సిన అర్హతలు సమృద్ధిగా ఉన్న సాధకులు అని అర్థం. అటువంటి సాధకుణ్ణి అధికారి అంటారు. ఇంతకుముందు అధ్యాయంలో సాధనచతుష్టయ సంపత్తి అంటే ఏమిటో వివరంగా చూశాము. వివేకం, వైరాగ్యం, ముముక్షుత్వం, శమాదిషట్క సంపత్తి – వీటిని కలిపి సాధన చతుష్టయ సంపత్తి అంటారు. అందువల్ల ఇక్కడ ముని అంటే గడ్డాలూ, మీసాలు పెంచుకున్న ముని కాదు; అధికారి. మునయః అంటే అధికారినః. వారు ఏ ఫలం పొందారు?

**పరాం సిద్ధిం గతాః ఇతః** – వారు మోక్షాన్ని పొందారు. అది అత్యున్నత ఫలం. ఆ ఫలం పొందితే జీవనసాఫల్యం అవుతుంది.

**ఇహ చేదవేదీదథ సత్యమస్తి న చేదిహావేదీన్మహతీ వినష్టిః – కేన 2-5**

వేరే ఏ ఫలం పొందినా, జీవితం ధన్యమవదు; ఈ జ్ఞానం పొందితేనే పరమసిద్ధి పొందటం అవుతుంది. అంటే మోక్షం పొందారు వారు. ఎప్పుడు? **ఇతః గతాః** – జీవించి ఉండగానే. జీవించి ఉండగా పొందిన మోక్షాన్ని జీవన్ముక్తి అంటారు. వారు జీవన్ముక్తి పొందటమే కాదు, మరణించాక విదేహముక్తి పొందుతారు. అంటే వారికిక పునర్జన్మ ఉండదు. ఇతః అంటే ఇక్కడ. గతాః – ఈ జ్ఞానం పొందినవారు జీవన్ముక్తీ, విదేహముక్తీ రెండూ పొందారు.

శ్లో. 2 **ఇదం జ్ఞానముపాశ్రిత్య మమ సాధర్మ్యమాగతాః ।**
**సర్గేఽపి నోపజాయంతే ప్రళయే న వ్యథంతి చ ॥**
ఇదమ్, జ్ఞానమ్, ఉపాశ్రిత్య, మమ, సాధర్మ్యమ్, ఆగతాః,
సర్గే, అపి, న, ఉపజాయంతే, ప్రళయే, న, వ్యథంతి, చ ॥

| | | | |
|---|---|---|---|
| ఇదమ్, జ్ఞానమ్ | = ఈ జ్ఞానమును | న, ఉపజాయంతే | = తిరిగి ఉత్పన్నులు కారు |
| ఉపాశ్రిత్య | = ఆశ్రయించి | చ | = ఇంకా |
| మమ, సాధర్మ్యమ్ | = నా స్వరూపమునే | ప్రళయే, అపి | = ప్రళయకాలమందును |
| ఆగతాః | = పొందినవారు | న, వ్యథంతి | = వ్యాకులతనొందరు |
| సర్గే | = సృష్ట్యాదియందు | | |

**(య) ఇదమ్ జ్ఞానమ్ ఉపా(శిత్య మమ సాధర్మ్యమ్ ఆగతాః, (తే)**
**సర్గే అపి న ఉపజాయన్తే, ప్రళయే చ న వ్యథన్తి ॥**

తా: ఈ జ్ఞానమును ఆ(శయించి నా స్వరూపమునే పొందినవారు సృష్ట్యాదియందు తిరిగి ఉత్పన్నులు కారు ఇంకా ప్రళయకాలమందును వ్యాకులతనొందరు.

ఇంకా ఉపోద్ఘాతమే కొనసాగుతున్నది. ఇంతకుముందు శ్లోకంలో చూశాము ఈ జ్ఞానం అత్యుత్తమమైనది కాబట్టి అత్యుత్తమ ఫలాన్ని ఇస్తుందని. అంతేకాదు ఆ ఫలాలను జీవన్ముక్తి, విదేహముక్తి అంటారని కూడా చూశాము. వాటిని ఇక్కడ కృష్ణపరమాత్మ నిర్వచిస్తున్నాడు.

**ఇదం జ్ఞానమ్ ఉపా(శిత్య** – ఈ జ్ఞానం పొందటంవల్ల;

**మమ సాధర్మ్యమాగతాః** – సాధకులు నాలో ఐక్యం అవుతారు. అంటే వారి జీవత్వం పోయి ఈశ్వరస్వరూపాన్ని పొందుతారు. మమ సాధర్మ్యమ్ అంటే ఈశ్వరస్వరూపం.

ఈశ్వరస్వరూపం అంటే ఏమిటి? ఈశ్వరునికి అనేక లక్షణాలు ఉన్నాయి. ఇక్కడ కొన్ని చూద్దాము.

ఎ) **పూర్ణత్వం** – ఆత్మజ్ఞానం పొందిన జ్ఞాని పూర్ణత్వాన్ని అనుభవిస్తాడు.

**ఆత్మన్యేవాత్మనా తుష్టః** – 2.55

భగవంతుడు పూర్ణుడు; జ్ఞాని కూడా పూర్ణత్వాన్ని అనుభవిస్తాడు.

బి) **అభయ స్వరూపం** – భగవంతునికి అభద్రతాభావన ఉండదు; కాని జీవికి చాలా అభద్రతాభావన ఉంటుంది. ఈ జ్ఞానం ఆ భావనను పోగొడుతుంది. తను ఆనందస్వరూపం అని తెలుసుకుంటాడు.

**అదృశ్యే అనాత్మ్యే అనిరుక్తే అనిలయనే అభయం ప్రతిష్ఠాం విందతే**

ఈశ్వరస్వరూపం అంటే అభయస్వరూపం. భగవంతుడు స్వామి, భక్తుడు భృత్యుడు. అందువల్ల అజ్ఞాని దాసుడు అవుతాడు. ఎవరికి దాసుడు అవుతాడు? మనుష్యులకు, పరిసరాలకు, కర్మకు – అన్నింటికీ దాసుడు అవుతాడు. జ్ఞాని ఈశ్వరస్వరూపం పొందుతాడు అంటే అతను కూడా స్వామి అవుతాడు. అతను ఇంక కర్మఫలానికి దాసుడు కాడు.

**ఇహైవ తైర్జితః సర్గో యేషాం సామ్యే స్థితం మనః** – 5.19

జ్ఞాని పరిస్థితులకు బానిస కాదు. అంటే గతం గురించి పశ్చాత్తాపపడడు; భవిష్యత్తు గురించి ఆందోళన చెందడు. ఇలా స్వామిత్వం, పూర్ణత్వం, అభయం, ఆనందస్వరూపం – ఇవన్నీ సాధర్మ్యమ్ అనే ఒక్క పదంలో సూచించబడ్డాయి. సాధర్మ్యమ్ అంటే జీవన్ముక్తి. అంటే జీవించి ఉండగానే భగవంతునికి చెందిన మహిమలను తాను కూడా అనుభవిస్తాడు.

**సర్గే అపి న ఉపజాయంతే** – మరణించాక విదేహముక్తి పొందుతాడని చూశాము. విదేహముక్తి అంటే అతనికి పునర్జన్మ ఉండదు. పునర్జన్మ ఉండదంటే పునరపి జననం, పునరపి మరణం అనే వృత్తంలో పడి కొట్టుమిట్టాడడు. సర్గే అంటే తర్వాత వచ్చే సృష్టి. తర్వాత వచ్చే సృష్టిలో వారు మళ్ళీ పుట్టరు.

**ప్రలయే న వ్యథంతి చ** – ప్రలయే అంటే ప్రళయకాలంలో. న వ్యథంతి అంతే బాధపడరు. అంటే ప్రళయంలో వారు మృత్యుకోరల్లో చిక్కరు. అంటే ఈ రెండూ కలిపి ఒక్కముక్కలో చెప్పాలంటే వారు జనన మరణవృత్తంనుంచి విముక్తి చెందుతారు.

ఈ శ్లోకంలో ఆత్మజ్ఞానం పొందిన వ్యక్తి జీవన్ముక్తి, విదేహముక్తిని పొందుతాడని చెప్పాడు కృష్ణపరమాత్మ.

శ్లో. 3 **మమ యోనిర్మహద్బ్రహ్మ తస్మిన్ గర్భం దధామ్యహమ్ ।**

**సంభవః సర్వభూతానాం తతో భవతి భారత ॥**

మమ, యోనిః, మహత్, బ్రహ్మ, తస్మిన్, గర్భమ్, దధామి, అహమ్,

సంభవః, సర్వభూతానామ్, తతః, భవతి, భారత ॥

| | | | |
|---|---|---|---|
| భారత! | = అర్జునా! | గర్భమ్ | = చేతన సముదాయరూప బీజమును |
| మమ, మహత్, బ్రహ్మ | = మహద్బ్రహ్మరూపమైన నా మూలప్రకృతి | దధామి | = ఉంచెదను |
| యోనిః | = సకల భూతములకును యోని, అనగా జన్మస్థానము | తతః | = ఆ జడచేతన సంయోగమువల్ల |
| అహమ్ | = నేను | సర్వభూతానామ్ | = సకల ప్రాణులయొక్క |
| తస్మిన్ | = దానియందు | సంభవః, భవతి | = ఉత్పత్తి జరుగుతుంది |

**హే భారత! మహత్ బ్రహ్మ మమ యోనిః (అస్తి), తస్మిన్ అహమ్**

**గర్భమ్ దధామి, తతః సర్వ–భూతానామ్ సమ్భవః భవతి ॥**

తా: అర్జునా! మహద్బ్రహ్మరూపమైన నా మూలప్రకృతి సకల భూతములకును యోని, అనగా జన్మస్థానము. నేను దానియందు చేతన సముదాయరూప బీజమును ఉంచెదను. ఆ జడచేతన సంయోగమువల్ల సకల ప్రాణులయొక్క ఉత్పత్తి జరుగుతుంది.

ఇంకా ఉపోద్ఘాతం కొనసాగుతున్నది. మొదటి శ్లోకంలో ఆత్మజ్ఞానం గురించి చెబుతానన్నాడు కృష్ణపరమాత్మ; రెండవ శ్లోకంలో ఆ జ్ఞానం మోక్షాన్ని ప్రసాదిస్తుందని, దాని ఫలాన్ని కూడా చెప్పాడు. ఇప్పుడు 3, 4 శ్లోకాల్లో తను పదమూడవ అధ్యాయంలో చెప్పిన సృష్టిప్రకరణాన్ని టూకీగా మళ్ళీ చెబుతున్నాడు. ఆత్మజ్ఞానం పొందాలంటే సృష్టి గురించిన సరియైన అవగాహన ఉండాలి. అందువల్ల పునాది వేయటంకోసం కృష్ణపరమాత్మ మళ్ళీ సృష్టి గురించి గుర్తు చేస్తున్నాడు.

**ప్రకృతిం పురుషం చైవ విద్ధ్యనాదీ ఉభావపి ।**

**వికారాంశ్చ గుణాంశ్చైవ విద్ధి ప్రకృతిసంభవాన్ ॥** – 13.20

సృష్టికి ముందు రెండే ఉన్నాయి. అవి పురుషుడు, ప్రకృతి. ఈ రెండూ అనాదిగా ఉన్నాయి. అంటే వాటికి ఆది లేదు. ప్రకృతి–పురుషులు జగత్కారణం కానీ, వారి సృష్టికి ఎవరూ కారణం కాదు. ప్రకృతి–పురుషులు రెండూ అనాది అయినా, ఆ రెండింటి మధ్య నాలుగు భేదాలను కూడా అక్కడ చూశాము. వాటిని మళ్ళీ ఒకసారి చూద్దాము.

| **పురుషుడు** | **ప్రకృతి** |
|---|---|
| చేతనతత్త్వం | అచేతనతత్త్వం |
| నిర్గుణతత్త్వం | సగుణతత్త్వం |
| నిర్వికారతత్త్వం | సవికారతత్త్వం |
| సత్యం | మిథ్యా |

**నిర్గుణ నిర్వికార సత్యచేతనతత్త్వం పురుషః**
**సగుణ సవికార మిథ్యా అచేతనతత్త్వం ప్రకృతిః**

ప్రకృతి పురుషుల మేలుకలయికనే ఈశ్వరుడు అంటారు. ఈ ఈశ్వరుణ్ణుంచే సృష్టి వచ్చింది. ఉపనిషత్ పరిభాషలో చెప్పాలంటే –

బ్రహ్మ + మాయ = ఈశ్వరుడు.

కాని ఇక్కడ గీతా పరిభాషలోనే చూద్దాము. కేవలం పురుషుణ్ణుంచి సృష్టి రాలేదు, కేవలం ప్రకృతినుంచీ రాలేదు. వీరి మేలుకలయికనుంచే వచ్చింది. వీరిని తల్లిదండ్రులతో పోల్చవచ్చు. కాని ఈ ఉదాహరణను ఎంతమేరకు తీసుకోవాలో అంతమేరకే తీసుకోవాలి. మనం ముందేమన్నాము? పురుషుడు చేతనం, ప్రకృతి అచేతనం (జడం) అన్నాం. ఇప్పుడు భార్యాభర్తలు, తల్లిదండ్రులు అంటే, 'అయితే భార్య జడమా?' అని అడగకూడదు. తల్లిదండ్రులు ఇద్దరూ కలిస్తేనే సంతతి కలిగినట్టుగా, ప్రకృతి–పురుషుడు కలిసే సృష్టి చేశారు.

**వాగర్థావివసంపృక్తౌ వాగర్థ ప్రతిపత్తయే**
**జగతః పితరౌ వందే పార్వతీపరమేశ్వరౌ** – రఘువంశం 1.1

పార్వతీ పరమేశ్వరులను జగత్తుయొక్క మాతాపితరులు అంటారు. మన పురాణాల్లో భగవంతుని గురించి వర్ణించేటప్పుడు భార్యాభర్తలను విడదీయరాని జంటగా అభివర్ణిస్తారు. పార్వతీపరమేశ్వరులను అర్ధనారీశ్వరులు అంటారు; లక్ష్మీదేవిని విష్ణుమూర్తి వక్షస్థలంలో పెట్టుకుంటే, బ్రహ్మదేవుడు సరస్వతీదేవిని తన నాలికమీదనే పెట్టుకున్నాడు. విష్ణుమూర్తిని అందువల్లనే శ్రీనివాసః అంటారు.

లక్ష్మీదేవి విష్ణుమూర్తి వక్షస్థలంలో ఉంటుంది కాబట్టి పురుషులు లక్ష్మిని (డబ్బును) ముందు జేబులో పెట్టుకోవాలి కాని వెనకజేబులో పెట్టుకోకూడదు. ఇలా భగవంతుని వర్ణించటంలోని ముఖ్య ఉద్దేశ్యం ప్రకృతి, పురుషుడు విడదీయరాని జంట అని చూపించటం.

ఇప్పుడు ప్రకృతి పురుషులు కలిసి సృష్టి చేస్తే, సహజంగానే సృష్టిలో వీరిరువురి లక్షణాలూ ఉంటాయి. ఇదొక ప్రకృతి సూత్రం.

**కారణగుణాః కార్యే అనువర్తన్తే**

కారణంయొక్క గుణాలు, కార్యంలో ఉంటాయి. బంగారంనుంచి ఆభరణాలు వస్తే, ఆభరణాలు కూడా బంగారంగానే ఉంటాయి. బంగారంలో రాగి కలిపితే, ఆభరణాలలో కూడా రాగి ఉంటుంది. తల్లిదండ్రులనుంచి పుట్టిన పిల్లలు తల్లిదండ్రుల లక్షణాలను పుణికిపుచ్చుకుంటారు. కాకపోతే ఆ లక్షణాలలో హెచ్చుతగ్గులు ఉండవచ్చు. ఒక పిల్లవానిలో తల్లి గుణాలు ఎక్కువ ఉంటే, ఇంకొక పిల్లవానిలో తండ్రి గుణాలు ఎక్కువ ఉండవచ్చు. ఏది ఏమైనా కారణంయొక్క గుణాలు కార్యంలోకి వస్తాయి. ఈ విషయం గుర్తుంచుకోవాలి.

అందువల్ల సృష్టిలోని ప్రతి ఒక్కటీ కూడా ప్రకృతి-పురుషుల మేలుకలయిక. అది మనిషిగాని, చెట్టుగాని, చీమగాని, ఏనుగు గాని; మనిషిలో స్త్రీగాని, పురుషుడుగాని, ఎవరైనా, ఏదైనా ప్రకృతి-పురుషుల మేలుకలయిక. పురుషుడు అంటే నిర్గుణ-నిర్వకార-సత్య-చేతన పురుషతత్త్వం అని చూశాము. అలాగే ప్రకృతి అంటే సగుణ-సవికార-మిథ్యా-అచేతన ప్రకృతితత్త్వం అని చూశాము. అందువల్ల మనలో ఈ గుణాలు అన్నీ ఉన్నాయని తెలుసుకోకపోతే మనను మనం సరిగ్గా తీర్చిదిద్దుకోలేము.

నామీద నేను ఆధిక్యత సంపాదించాలంటే ముందు నా గురించిన జ్ఞానం ఉండాలి. ఒక రోగాన్ని అరికట్టాలంటే ఆ రోగం గురించిన పూర్తి జ్ఞానం ఉండాలి. నన్ను నేను అదుపులో పెట్టుకోలేకపోతే, నా చుట్టూ ఉన్నవారిని నేను ఎలా అదుపులో పెట్టగలను. పిల్లవాడు నా మాట వినటం లేదు అనటానికి, నా మాట నేనే వినలేనే! ముందు నా వ్యక్తిత్వాన్ని నేను తీర్చిదిద్దుకుంటే, అప్పుడు ఇంకొకరిని నేను తీర్చిదిద్దగలను. నా వ్యక్తిత్వాన్ని నేను తీర్చిదిద్దుకోవాలంటే నా గురించిన పూర్తి జ్ఞానం నాకుండాలి. నా గురించిన పూర్తి జ్ఞానం ఉండాలంటే నేను ఏ గుణాలతో చెయ్యబడ్డానో నాకు తెలియాలి.

కృష్ణపరమాత్మ నేను ప్రకృతి, పురుషుల మేలుకలయికను అని నిరూపించబోతున్నాడు. నేను ప్రకృతి, పురుషుల మేలుకలయికను అని నిరూపించటానికి, సృష్టికర్త అయిన ఈశ్వరుడు ప్రకృతి, పురుషుల మేలుకలయిక అని చూపిస్తున్నాడు.

బ్రహ్మ + మాయ = ఈశ్వరుడు

ఈ విషయం ఇంతకుముందు కూడా చూశాము. కార్యంలో ఈ రెండు ఉండాలంటే, ముందు కారణంలో ఉన్నాయని చూపాలి. అందువల్ల కృష్ణపరమాత్మ చెబుతున్నాడు, 'ఓ అర్జునా, నేను పురుషతత్త్వాన్ని; నాకు భిన్నంగా లేదు ప్రకృతితత్త్వం.' బ్రహ్మను పురుషునిగా, మాయను ప్రకృతిగా భావించవచ్చు. మాయాశక్తి లేకుండా బ్రహ్మ సృష్టి చెయ్యలేదు.

**శివః శక్త్యా యుక్తో యది భవతి శక్తః ప్రభవితుమ్**

**న చేదేవం దేవో న ఖలు కుశలః స్పందితుమపి। - సౌందర్యలహరి**

ప్రకృతి లేకుండా పురుషుడు సృష్టించలేడు. కొన్ని ఇళ్ళల్లో స్త్రీ లేకుండా, పురుషుడు ఏమీ చెయ్యలేడు. ఈ నేపథ్యంతో ఈ శ్లోకాన్ని చూద్దాము.

**మమ యోనిః** – యోనిః అంటే గర్భం, కాని ఈ సందర్భంలో భార్య లేదా స్త్రీతత్త్వం అని వస్తుంది. ఎటువంటి స్త్రీతత్త్వం?

**మహత్ బ్రహ్మ** – ఇక్కడ బ్రహ్మ అంటే మాయ లేదా ప్రకృతితత్త్వం. అందువల్ల ఈ శ్లోకాన్ని అర్థం చేసుకోవటం కష్టం. ప్రకృతి జగన్మాత. అందువల్ల మహత్ పదం వేశాడు. జగన్మాత అంతటికీ జన్మనివ్వాలంటే ఆమె గర్భం ఎంత పెద్దదిగా ఉండాలి? ఈ మహత్ బ్రహ్మ అయిన మాయ నా భార్య అంటున్నాడు. 'నేను' అంటే ఎవరు? అది మనం కలుపుకోవాలి. నేను అంటే పురుషతత్త్వం లేదా చేతనతత్త్వం. పురుషతత్త్వం ఏంచేస్తుంది?

**తస్మిన్ గర్భం దధామ్యహమ్** – సృష్టి జరిగే సమయం ఆసన్నమయినప్పుడు నేను ఆమెకు గర్భాధానం చేస్తాను అంటున్నాడు కృష్ణపరమాత్మ. గర్భాధానం అంటే చేతనతత్త్వాన్ని ఆమెలో ప్రవేశపెడతాను అంటున్నాడు. అంటే మాయకు సృష్టి చేసే శక్తిని ఇస్తానని అర్థం. ఎలాగైతే పురుషబీజాన్ని పురుషుడు స్త్రీ యోనిలో ప్రవేశపెడతాడో, అలా పురుషుడు, ప్రకృతికి సృష్టిచేసే శక్తిని ఇస్తాడు. అలా ప్రకృతికి శక్తి ప్రసాదించటం గర్భాధానం కిందికి వస్తుంది.

స్త్రీ యోనిలో పురుషబీజం కలిసి, ఒక పిండం రూపుదిద్దుకున్నాక, ఇంక పురుషుని ప్రమేయం ఏమీ ఉండదు. ఆ శిశువు స్త్రీ గర్భంలో పెరుగుతుంది. ఆ శిశువు తల్లిగర్భంలో ఎలా రూపుదిద్దుకుంటుందో, అటు తల్లికీ తెలియదు, ఇటు తండ్రికీ తెలియదు. ప్రకృతి నియమం ప్రకారం ఆ శిశువు పెరుగుతూ వస్తుంది.

అదే విధంగా అచేతన మాయకు శక్తిని ప్రసాదించాక, మాయాశక్తి సృష్టి విషయం చూసుకుంటుంది.

**సంభవః సర్వభూతానామ్** – అన్ని జీవుల సృష్టి జరుగుతుంది. ఎలాగైతే తల్లిగర్భంలో రూపుదిద్దుకున్న శిశువు తొమ్మిది నెలలు నిండాక, అనువైన సమయం చూసుకుని బయట ప్రపంచంలోకి అడుగుపెడుతుందో, అలా పురుషుడు, ప్రకృతికి శక్తిని ఇచ్చాక, ప్రకృతి అనే గర్భంనుంచి సృష్టి అనువైన సమయంలో జరుగుతుంది. ప్రకృతిలో అవ్యక్తదశలో సృష్టి ఉంది అంటాము. ప్రకృతిని మాయ అని కూడా అంటారు. మాయను అనిర్వచనీయం అంటారు. అనిర్వచనీయం అంటే నిర్వచనానికి అందనిది. మాయనుంచి సృష్టి ఎలా వచ్చిందో మనకు తైత్తిరీయోపనిషత్తులో వస్తుంది.

**తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశః సంభూతః। ఆకాశాద్వాయుః। వాయోరగ్నిః। అగ్నేరాపః। అద్భ్యః పృథివీ। పృథివ్యా ఓషధయః। ఓషధీభ్యోఽన్నమ్। అన్నాత్పురుషః।**

ఆత్మనుంచి ఆకాశం, ఆకాశంనుంచి వాయువు, వాయువునుంచి అగ్ని, అగ్నినుంచి నీరు, నీటినుంచి పృథివి, పృథివినుంచి ఓషధులు, ఓషధులనుంచి అన్నం; అన్నంనుంచి మనుష్యులు వచ్చారు. ఇక్కడ సర్వభూతానాం అని ఒక్కముక్కలో చెప్పేశాడు. అన్ని జీవరాశులు; సంభవః సృష్టి జరిగింది.

**తతః భవతి భారత** – ఓ అర్జునా, తతః అంటే ఆ తరువాత, అంతా సహజంగా జరిగింది అంటున్నాడు.

శ్లో. 4 **సర్వయోనిషు కౌంతేయ మూర్తయః సంభవంతి యాః ।**
**తాసాం బ్రహ్మ మహద్యోనిః అహం బీజప్రదః పితా ॥**
సర్వయోనిషు, కౌంతేయ, మూర్తయః, సంభవంతి, యాః,
తాసామ్, బ్రహ్మ, మహత్, యోనిః, అహమ్, బీజప్రదః, పితా ॥

| | | | |
|---|---|---|---|
| కౌంతేయ! | = ఓ అర్జునా! | మహద్బ్రహ్మ | = మూలప్రకృతియే |
| సర్వయోనిషు | = నానా యోనులందు | యోనిః | = జన్మనిచ్చే తల్లి |
| యాః, మూర్తయః | = ఏ ప్రాణులు | అహమ్ | = నేను |
| సంభవంతి | = పుడుతున్నాయో, | బీజప్రదః | = బీజమునిచ్చే |
| తాసామ్ | = వాటన్నింటికి | పితా | = తండ్రిని |

**హే కౌన్తేయ! సర్వ-యోనిషు యాః మూర్తయః సమ్భవన్తి తాసామ్**
**యోనిః మహత్ బ్రహ్మ (అస్తి), అహమ్ బీజ-ప్రదః పితా (చ అస్మి) ॥**

తా: ఓ అర్జునా! నానా యోనులందు ఏ ప్రాణులు పుడుతున్నాయో, వాటన్నింటికి మూలప్రకృతియే జన్మనిచ్చే తల్లి, నేను బీజమునిచ్చే తండ్రిని.

కృష్ణపరమాత్మ తను జగత్తుయొక్క తండ్రిననీ, మాయ తల్లి అనీ వివరిస్తున్నాడు. తల్లిదండ్రులు వారి సంతతికి జన్మనిచ్చినట్లే, ఈ జగత్తుయొక్క మాతాపితలు జగత్తుకు జన్మనిస్తున్నారు. కాని ఈ భూమ్మీద ఉన్న తల్లిదండ్రులకు, జగత్తుయొక్క మాతాపితలకు సూక్ష్మభేదం ఉంది. ఏమిటది? మానవ తల్లిదండ్రులు మనిషికి మాత్రమే జన్మను ఇవ్వగలరు. అలా ఏ జాతికి చెందిన ఆ తల్లిదండ్రులు, ఆ జాతి శిశువుకే జన్మనివ్వగలరు. అంటే మనిషినుంచి మనిషే పుడతాడు; కోతినుంచి కోతే పుడుతుంది. కాని జగత్ మాతా, పితలనుంచి అన్ని జీవరాశులూ పుడతాయి.

**అహం బీజప్రదః పితా** – నేను జగత్తుకు తండ్రిని; నేను జగన్మాతకు చిదాభాసను ప్రసాదిస్తాను. అంటే నేను పురుషబీజాన్ని.

**మహత్ బ్రహ్మ యోనిః** – మహత్ బ్రహ్మ అంటే అనంతమైన మాయ. ముందు శ్లోకంలోలాగానే, ఇక్కడ కూడా బ్రహ్మ అంటే మాయ అనే అర్థం తీసుకోవాలి. మాయ ఈ జగత్తుకు యోని అంటే ఈ జగత్తుకు తల్లి.

నా పురుషబీజాన్ని ఈ మహత్ బ్రహ్మయోనిలో ప్రవేశపెట్టటంవల్ల ఈ మాయ గర్భం దాలుస్తుంది. ఆమె గర్భంనుంచి ఒక జాతి కాదు, సకల జీవరాశులూ వెలువడుతాయి.

**సర్వయోనిషు యాః మూర్తయః సంభవంతి** – అన్ని జీవరాశులకు ఆమె జన్మనిస్తుంది. మనం వ్యావహారికంగా చూస్తే, కోతిజాతినుంచి కోతి; గోమాతనుంచి గోసంతతి; సర్పజాతినుంచి సర్పసంతతి వచ్చాయని చూస్తాము. కాని వీటన్నిటికీ ఆదితల్లి మాయ. మూర్తి అంటే ఇక్కడ శరీరం. ఇక్కడ ఏ తల్లినుంచి ఎటువంటి జాతి పుట్టుకను చూసినా కూడా, నిజానికి వీరందరికీ మూలకారణం జగన్మాత అయిన మాయ మాత్రమే.

**తాసామ్** – ఏ జీవరాశి పుట్టినా కూడా, వారందరికీ

బ్రహ్మ యోనిః – మాయే జగన్మాత. అందువల్ల మనమందరం బ్రహ్మ, మాయల ముద్దుబిడ్డలం; ప్రకృతి, పురుషుల మేలుకలయికలం. చైతన్య జడసమ్మేళనం; నిర్గుణ–సగుణబ్రహ్మల సంయోగం. పురుషుడు, ప్రకృతిల గుణాలను ఇంతకుముందే చూశాము. వాటిని ఇక్కడ గుర్తు తెచ్చుకోవాలి. పురుషుడు అంటే నిర్గుణ–నిర్వికార–సత్య–చేతన పురుషతత్త్వం అని చూశాము. అలాగే ప్రకృతి అంటే సగుణ–సవికార–మిథ్యా–అచేతన ప్రకృతితత్త్వం అని చూశాము. ఈశ్వరుడు అంటే బ్రహ్మ+మాయ అనీ, ఇటువంటి ఈశ్వరుణ్ణుంచి జగత్తు వచ్చిందనీ చూశాము. అంటే ఈశ్వరుడు కారణం; జీవుడు, జగత్తు కార్యం.

జీవి అయిన నాలో కూడా ప్రకృతి, పురుషులయొక్క ఈ రెండు తత్త్వాలూ ఉన్నాయి. అంటే మారే తత్త్వం, మారని తత్త్వం; సగుణత్త్వం, నిర్గుణత్త్వం; అచేతనత్త్వం, చేతనత్త్వం; మాయాతత్త్వం, చైతన్యతత్త్వం ఉన్నాయి. ఇది బాగా అర్థం చేసుకోవాలి. ఈ విషయాన్నే 5–18 శ్లోకాల్లో విశ్లేషించబోతున్నాడు కృష్ణపరమాత్మ.

**2. త్రైగుణ్య విశ్లేషణ – శ్లోకాలు 5–18**

## గుణత్రయవిభాగయోగము – ఒక విహంగ వీక్షణం

భగవంతుడు బ్రహ్మ, మాయల మేలుకలయిక కాబట్టి, మనం కూడా ప్రకృతి, పురుషుల మేలుకలయికలము అవుతాము. మనలోని ప్రకృతి అంశ ఏది? మన స్థూలశరీరం ప్రకృతితత్త్వంతో చేయబడింది. శరీరానికి గుణాలు ఉన్నాయి. అవి లావు, పొడుగు, ఆరోగ్యం మొదలైనవి. అందువల్ల శరీరం సగుణం. ఈ శరీరం సవికారమా, నిర్వికారమా? శరీరం అనేక మార్పులకు (షడ్వికారాలకు) లోనవుతుందని మనకు తెలుసు. అందువల్ల శరీరం ప్రకృతి అంశలోకి వస్తుంది. అలాగే మనస్సు కూడా ప్రకృతి అంశలోకే వస్తుంది. అంటే కార్యకరణసంఘాతమైన ఈ మనశ్శరీరాలు ప్రకృతితత్త్వంతో చేయబడ్డాయి.

ఈ మనశ్శరీరాలు కాక పురుషతత్త్వం కూడా ఉంది. దాన్నే చైతన్యతత్త్వం అంటారు. చైతన్యంయొక్క ఐదు సూత్రాలను మళ్ళీ ఒకసారి గుర్తుచేసుకోవాలి.

ఈ చైతన్యాన్ని వేదాంతపరిభాషలో నిర్గుణబ్రహ్మ అనీ, సాక్షిచైతన్యం అనీ అంటారు. శుద్ధచైతన్యానికి గుణాలు లేవు. అందువల్ల అది నిర్గుణం; మార్పులు లేవు, అందువల్ల అది నిర్వికారం. మారుతున్నవాటిని, మారకుండా సాక్షిగా చూసే చైతన్యం కాబట్టి సాక్షిచైతన్యం.

మనస్సు ఇప్పుడు ప్రశాంతంగా ఉంది; ఆ ప్రశాంతతను ఒకటి సాక్షిగా చూస్తోంది. కాసేపటికే మనస్సు అల్లకల్లోలంగా మారుతుంది. కాని దాన్నీ ఒకటి సాక్షిగా చూస్తోంది. ప్రశాంత మనస్సునూ, అల్లకల్లోలంగా ఉన్న మనస్సునూ కూడా ఒకటి మారకుండా, సాక్షిగా చూస్తోంది. ఈ నిర్వికారమైన, సాక్షీభూతంగా చూసే చైతన్యాన్ని సాక్షిచైతన్యం అంటారు. ఈ సాక్షిచైతన్యం ఉన్నతమైన నేను, నా పరాప్రకృతితత్త్వం అంటుంది వేదాంతం.

ఈ సాక్షి చైతన్యంకాక మనశ్శరీరాలు ఉన్నాయని చూశాము. అవి స్వతహాగా జడం. ఎందుకు? ఎందుకంటే అవి పంచభూతాలనుంచి తయారుచెయ్యబడ్డాయి; ప్రకృతినుంచి తయారుచెయ్యబడ్డాయి. మీ ముందు ఉన్న బల్ల జడమైనా కూడా, అది కాంతి సమక్షంలో ప్రకాశిస్తోంది.

అదేవిధంగా, ఈ మనశ్శరీరాలు జడమైనా కూడా, సర్వవ్యాపకమైన చైతన్యంవల్ల అవి కూడా చైతన్యవంతం అవుతాయి. ఉదాహరణకు అగ్నికి వేడి దాని స్వరూపలక్షణం. కాని నీరు అగ్నివల్ల వేడెక్కితే దాన్ని ఆగంతుక లక్షణం అంటారు. అంటే నీటికి స్వతహాగా వేడి లక్షణం లేదు; అది అగ్నితత్త్వంవల్ల వేడిని అరువు తెచ్చుకుంది. ఇదే సూత్రం మనశ్శరీరాలకు వర్తిస్తుంది. మనశ్శరీరాలు స్వతహాగా జడం. కాని చైతన్యాన్ని అరువు తెచ్చుకోవటంవల్ల చైతన్యం అయ్యాయి.

వేదాంతపరిభాషలో, అంటే తత్త్వబోధ ఆధారంగా చెప్పాలంటే వాటిని బింబచైతన్యం, ప్రతిబింబచైతన్యం అంటారు. బింబచైతన్యాన్ని ఒరిజినల్ కాన్షస్‌నెస్ (ఓ.సి.) అనీ; ప్రతిబింబచైతన్యాన్ని రిఫ్లెక్టెడ్ కాన్షస్‌నెస్ (ఆర్.సి) అనీ అంటారు. మనం నిర్గుణబ్రహ్మ, సాక్షిచైతన్యం అని దేన్నైతే అంటున్నామో అది బింబచైతన్యం. మనస్సు స్వతహాగా జడమైనా కూడా దానికి ప్రతిబింబింపచేసే శక్తి ఉంది అని చూశాము. అది బింబచైతన్యాన్ని ప్రతిబింబింప జేస్తుంది కాబట్టి, మనస్సును ప్రతిబింబమాధ్యమం అంటారు. దాన్ని ఇంగ్లీషులో రిఫ్లెక్టింగ్ మీడియం (ఆర్.ఎమ్.) అంటారు. అలా ప్రతిబింబమాధ్యమంద్వారా ఏర్పడిన ప్రతిబింబాన్ని ప్రతిబింబచైతన్యం అంటారు.

జడమైన అద్దం సూర్యకాంతిని ప్రతిబింబింపజేస్తుంది. దానివల్ల అద్దం కూడా ప్రకాశవంతమవుతుంది. మనం అద్దంలోకి చూస్తే దానిలో రెండు భాగాలు ఉన్నాయి అని గుర్తు పెట్టుకోవాలి. అవి అద్దం భాగం + ప్రతిబింబ సూర్యుడు. అదేవిధంగా, మనస్సు జడమైన అద్దం లాంటిది. అది బింబచైతన్యాన్ని ప్రతిబింబింపజేస్తుంది. మనం మనస్సును తీసుకుంటే దానిలో రెండు భాగాలు ఉన్నాయి. అవి మనస్సు భాగం + ప్రతిబింబ చైతన్యం.

బింబచైతన్యాన్ని చిత్ అనీ, ప్రతిబింబ చైతన్యాన్ని చిదాభాస అనీ అంటారు. బింబచైతన్యం, నిర్గుణబ్రహ్మ, సాక్షిచైతన్యం, చిత్ అన్నీ పర్యాయపదాలు. అలాగే ప్రతిబింబచైతన్యం, చిదాభాస పర్యాయపదాలు.

ఇప్పుడు ఈ మనశ్శరీరాలు ప్రకృతితత్త్వంతో చేయబడ్డాయనీ, అవి జడమనీ చూశాము. కాని మనస్సు ప్రతిబింబింప చేయటంవల్ల ప్రతిబింబచైతన్యం లేదా చిదాభాస ఏర్పడిందని చూశాము. అంటే మనకు చిదాభాస సహితశరీరం, చిదాభాససహిత మనస్సు ఉన్నాయి. ఈ మనశ్శరీరాలను లేదా కార్యకరణసంఘాతాన్ని, ఇంకా చెప్పాలంటే చిదాభాససహిత కార్యకరణసంఘాతాన్ని అహంకారం అంటారు. కార్యకరణసంఘాతాన్ని ప్రకృతి అంటారని మర్చిపోకూడదు.

అహంకారం = ప్రకృతి + చిదాభాస

ఇంకో విధంగా చెప్పాలంటే – శరీరం + చిదాభాస = అహంకారం;
కార్యకరణసంఘాతం + ప్రతిబింబ చైతన్యం = అహంకారం;
జడం + ఆగంతుక చైతన్యం = అహంకారం.

అంతకుముందేమన్నాము? బింబచైతన్యాన్ని సాక్షిచైతన్యం అన్నాము. ఇప్పుడు ఇంకొక కొత్త అంశను నేర్చుకున్నాము. ప్రతిబింబచైతన్యాన్ని అహంకారం అంటున్నాము.

నేను = సాక్షి + అహంకారం

మనం నేర్చుకున్న ఫార్ములా ప్రకారం చెప్పాలంటే

నేను = ఓ.సి. + (ఆర్.ఎమ్. + ఆర్.సి.)

నేను అని నేను అన్నప్పుడల్లా నాలో రెండు అంశలు ఉన్నాయి. అవి సాక్షి అంశ, అహంకార అంశ. సాక్షి అంశనే అంతకుముందు నిర్గుణ, నిర్వికార, సత్యతత్త్వం అని చూశాము.

జ్ఞాని అహం బ్రహ్మ అస్మి అని అంటే అహం ఎవరు? అహం అంటే సాక్షి చైతన్యం. నిర్గుణ నిర్వికార, సత్యచైతన్యం. అదే అహంకార పరంగా మాట్లాడితే నేను అంటే చిదాభాససహిత మనశ్శరీరాలు. సాక్షి గుణాతీతం అయితే అహంకారం సగుణం. కృష్ణపరమాత్మ 'ఓ అర్జునా, నువ్వు సాక్షి, అహంకారాల మేలుకలయికవు,' అని చెప్పబోతున్నాడు.

కృష్ణపరమాత్మ అహంకారాన్ని మన నిమ్నస్థాయిగానూ, సాక్షిని మన ఉన్నతస్థాయిగానూ వర్ణించబోతున్నాడు. మనం అహంకారంతో మమేకం చెందినన్నాళ్ళూ సంసారం తథ్యం. అహంకారం సంసారంలో పడేయకుండా ఉండదు. సంసారాన్ని తప్పించుకోవాలంటే దానికి ఒకటే మార్గం ఉంది. అది మనయొక్క ఈ నిమ్నస్థాయి అయిన ఈ అహంకారంనుంచి మన ఉన్నతస్థాయి అయిన సాక్షికి ఎదగాలి. అంటే నేను అహంకారాన్ని కాదు, నేను సాక్షిని అనే జ్ఞానం పొంది, సాక్షిలో నిలబడగలగాలి.

అహంకారం ఎలా మనను సంసారంలో పడవేస్తుందో వివరించబోతున్నాడు కృష్ణపరమాత్మ. అహంకారం విషంలాంటిది. ఎందుకు? అది సగుణమైనది. సగుణత్వం ఎలా సంసారానికి కారణం? ముందు మనకున్న గుణాలేమిటో, వాటి స్వరూపమేమిటో వర్ణించబోతున్నాడు కృష్ణపరమాత్మ.

మళ్ళీ ఒకసారి వెనక్కి వెళితే మనం ప్రకృతి, పురుషుల మేలుకలయికలమనీ; మనశ్శరీరాలు ప్రకృతి అంశనుంచి వచ్చాయనీ; ప్రకృతి + చిదాభాస = అహంకారం అనీ చూశాము. ఇప్పుడు ప్రకృతికి మూడు గుణాలు ఉన్నాయి. మనశ్శరీరాలు కూడా ప్రకృతినుంచి వచ్చాయి కాబట్టి వాటికి కూడా మూడు గుణాలు ఉంటాయి. ఆ మూడు గుణాలు – సత్త్వరజస్తమోగుణాలు. అందువల్ల అహంకారంలో కూడా ఈ మూడు గుణాలూ ఉంటాయి. అహంకారాన్ని సాత్త్విక అహంకారం అనీ, రాజసిక అహంకారం అనీ, తామసిక అహంకారం అనీ అంటారు. మూడు రకాల గుణాలకూ బంధించే శక్తి ఉంది. అవి సంసారంలో పడవేస్తాయి. అవి బంధించే మార్గం వేరు కాని, గమ్యం ఒక్కటే. అది సంసారం. సాత్త్విక అహంకారం సత్త్వగుణంచేత బంధింపబడితే, రాజసిక అహంకారం రజోగుణంచేత బంధింపబడితే, తామసిక అహంకారం తమోగుణంచేత బంధింపబడుతుంది.

కృష్ణపరమాత్మ ఈ మూడు గుణాల గురించీ విపులంగా చర్చించబోతున్నాడు. సంస్కృతంలో గుణ పదానికి రెండు అర్థాలున్నాయి. గుణం అంటే లక్షణం. రెండవ అర్థం తాడు లేదా బంధం. ఆ విధంగా గుణపదమే, అది ఒక తాడనీ, అది మనను సంసారంలో కట్టిపడవేస్తుందనీ సూచిస్తోంది. మోక్షం పొందాలంటే ఈ మూడు గుణాల బంధంనుంచి మనం ముక్తి పొందాలి.

సృష్టి జరిగేముందు అంటే ప్రళయంలో ప్రకృతిలో ఈ మూడు గుణాలు సమతుల్యతలో ఉంటాయి. సమతుల్యత అంటే ఈ మూడు గుణాలు సమానంగా ఉంటాయి; హెచ్చుతగ్గులు ఉండవు. దీన్ని గుణసామ్యం అంటారు. సృష్టి జరిగినప్పుడు ఈ గుణాలు సృష్టిలో అన్నింటికీ పంచబడతాయి; అప్పుడు అవి సమానంగా ఉండవు. అంటే సృష్టిలో సత్త్వరజస్తమోగుణాలు ఉంటాయి నిజమే కానీ, అన్నింటిలోనూ ఒకే స్థాయిలో ఉండవు. దాన్ని **విషమ అవస్థ** అంటారు. అంటే ఒక్కోదాంట్లో ఒక్కోగుణం ఎక్కువ ఉంటుంది.

శాస్త్రం ప్రకారం, సృష్టిలో వచ్చిన అత్యంత జడవస్తువులో కూడా ఈ మూడు గుణాలూ ఉంటాయి; చెట్లలో ఈ మూడు గుణాలూ ఉంటాయి; జంతువుల్లో ఈ మూడు గుణాలూ ఉంటాయి; మనుష్యుల్లో ఈ మూడు గుణాలూ ఉంటాయి. అంటే అన్నింటిలోనూ మూడు గుణాలూ ఉంటాయి. అయితే ఈ భేదాలు ఎందుకు వచ్చాయి అంటే వాటి గుణాల్లో ఉన్న హెచ్చుతగ్గులవల్ల వచ్చాయి.

ఇటువంటి అహంకారంతో మనం జీవించక తప్పదు. అందువల్ల అహంకారాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. ఇంట్లో కూడా చూడండి; కొంతమంది వ్యక్తులతో మనం సహజీవనం చెయ్యక తప్పదు. వారిని తప్పించుకోలేనప్పుడు, వారిని సరిగ్గా అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తే, వారితో సహజీవనం సాఫీగా సాగుతుంది. వారి గురించిన జ్ఞానం, మనల్ని సమర్థవంతులని చేస్తుంది. అలాగే అహంకారాన్ని గురించిన జ్ఞానం మనం గుణాతీతులుగా ఎదగటానికి తోడ్పడుతుంది.

అందువల్ల కృష్ణపరమాత్మ ఈ సత్త్వ, రజ, తమోగుణాల విశ్లేషణను చేపట్టాడు. అహంకారం ప్రకృతితత్త్వంనుంచి ఏర్పడింది కాబట్టి అది ఈ గుణాలను తప్పించుకోలేదు. మనం చేయగలిగిందల్లా వాటి హెచ్చుతగ్గులను మార్చగలము, అంతే. దానిలోని సత్త్వగుణ అంశాన్ని పెంచుకోగలము లేదా రజోగుణ అంశాన్ని పెంచుకోగలము లేదా తమోగుణ అంశాన్ని పెంచుకోగలము.

మనం గుణాతీతులుగా ఎదగాలంటే, ముందు ఈ గుణాలను వాడకతప్పదు. పోల్‌వాల్టింగ్ ఉదాహరణ మర్చిపోకూడదు. ఒక కర్ర పట్టుకుని, పరుగెత్తుకు వచ్చి, దాన్ని వదిలేసి, అవతలవైపుకు దూకుతాడు క్రీడాకారుడు. ఎలాగూ వదిలేస్తాను కదా అని కర్ర పట్టుకుని పరుగెత్తకపోతే, అంతపైకి ఎగరలేడు. ఆ కర్ర నేను ఇక్కడిదాకా రావటానికి తోడ్పడింది కదా, అలాంటి కర్రను వదిలేస్తే ఎలాగని బాధపడి, కర్రను వదలకపోతే అవతలి వైపుకు దూకలేడు. అంటే కర్రను వాడకపోవటమూ అర్థంలేని పనే; కర్రను వాడాడు కాబట్టి వదలకపోవటమూ అర్థంలేని పనే. కర్రను వాడాలి, అనువైన సమయంలో వదిలేయాలి; ఆవలివైపుకు ఎగిరి దూకాలి. అదే సూత్రం గుణాలకు కూడా వర్తిస్తుంది. గుణాలను వాడాలి; వాటిని వదిలేసి, పైకి ఎదగాలి. అంటే ఉన్న త్రిగుణాలలో ఉత్తమగుణానికి ఎదిగి, తర్వాత గుణాతీతునిగా ఎదగాలి.

కృష్ణపరమాత్మ ఈ గుణాల గురించి 5-18 శ్లోకాల వరకూ చర్చించబోతున్నాడు. గుణాల గురించిన విశ్లేషణ కాబట్టి; ఈ గుణాలు ఎలా మనను బంధిస్తాయో వివరించబోతున్నాడు కాబట్టి ఈ అధ్యాయాన్ని **గుణత్రయవిభాగయోగము** అంటారు.

## గుణత్రయ విశ్లేషణ

కృష్ణపరమాత్మ సత్త్వ, రజ, తమో గుణాలమీద చేసిన విశ్లేషణను మన వీలుకోసం ఐదు అంశాలుగా విభజించవచ్చు. అవి లక్షణమ్, లింగమ్, బంధన ప్రకారః, గతి, ఫలమ్. వాటిని వివరంగా చూద్దాము.

1. **లక్షణమ్** – లక్షణం అంటే నిర్వచనం.

**జ్ఞానప్రధానం** – సత్త్వగుణం జ్ఞానంమీద మక్కువను కలుగజేస్తుంది. ఎంత నేర్చుకున్నా ఇంకా నేర్చుకోవాలనే తపన ఉంటుంది. సర్వజ్ఞుడు అవాలి అనుకుంటాడు అతను. అటువంటి వ్యక్తిలో జ్ఞానేంద్రియాలు, బుద్ధి చాలా హుషారుగా పనిచేస్తాయి. అంటే సత్త్వగుణం ఉన్న వ్యక్తి జ్ఞానప్రధానంగా ఉంటాడు.

**కర్మప్రధానం** – రజోగుణం కర్మమీద మక్కువను కలుగజేస్తుంది. ఇతను సత్త్వగుణం ఉన్న వ్యక్తికి భిన్నంగా ఉంటాడు. జ్ఞానేంద్రియాలు (కన్ను, ముక్కు, చెవి, నోరు, చర్మం) ఇతనిలో అంత హుషారుగా ఉండవు. దానికి భిన్నంగా కర్మేంద్రియాలు బాగా హుషారుగా ఉంటాయి. కర్మేంద్రియాలు అంటే వాక్కు, పాణి, పాదం, పాయు, ఉపస్థ. ఈ రజోగుణం ఉన్న వ్యక్తి ఒక్కక్షణం కుదురుగా కూర్చోలేడు. ఒక గంట క్లాసులో కూర్చోవాల్సి వచ్చినా కాళ్ళూ, చేతులను కదుపుతూనే ఉంటాడు. నోరు అయితే అసలే ఊరుకోదు. మాట్లాడుతూనే ఉంటాడు. అంటే రజోగుణం ఉన్న వ్యక్తి కర్మప్రధానంగా ఉంటాడు.

**తమోప్రధానం** – తమోగుణం ఉన్న వ్యక్తి ఈ ఇద్దరికీ పూర్తి భిన్నంగా ఉంటాడు. అతని జ్ఞానేంద్రియాలూ హుషారుగా ఉండవు, కర్మేంద్రియాలూ హుషారుగా ఉండవు. ఇతను బద్ధకంగా ఉంటాడు. సత్త్వగుణం ప్రధానంగా ఉన్న వ్యక్తి జ్ఞానప్రధానంగా ఉంటే, రజోగుణం ప్రధానంగా ఉన్న వ్యక్తి కర్మప్రధానంగా ఉంటాడని చూశాము. ఈ రెండూ కాని వ్యక్తికి తమోగుణం ప్రధానంగా ఉన్నట్టు అర్థం.

2. **లింగమ్** – ఒక వ్యక్తిలో ఏ గుణం ఎక్కువగా ఉందో తెలుసుకునే మార్గాన్ని లింగం అంటారు.

**జ్ఞానవృద్ధి** – జ్ఞానప్రధానంగా ఉన్న వ్యక్తి ఎక్కువగా అంతర్ముఖుడు అవుతాడు. ఎందుకంటే జ్ఞానాన్ని పొందాలని తపించే మనస్సు ఎంతసేపూ జ్ఞానాన్వేషణలో ఉంటుంది. తను పొందిన జ్ఞానాన్ని విశ్లేషిస్తూ, ఆలోచిస్తూ, తార్కికంగా విచారణ చేస్తూ, వాటినుంచి కొత్త సిద్ధాంతాలను ఏర్పరుస్తూ ఉంటాడు. బుద్ధికి పదును పెడుతూ ఉంటాడు కాబట్టి అటువంటి వ్యక్తి నివృత్తి ప్రధానంగా ఉంటాడు. నివృత్తి అంటే బాహ్యప్రపంచంనుంచి విడిపోయి, అంతర్ముఖుడవటం.

**కర్మవృద్ధి** – రజోగుణం ప్రధానంగా ఉన్న వ్యక్తి ప్రవృత్తి ప్రధానంగా ఉంటాడు. జ్ఞానప్రధానంగా ఉన్న వ్యక్తి అంతర్ముఖుడయితే, ఇతను బహిర్ముఖంగా ఉంటాడు. అంతేకాదు, జ్ఞానం పొందాలనుకునే వ్యక్తి నిశ్శబ్దాన్ని

కోరుకుంటాడు. అతను ప్రశాంతంగా కూర్చుని విశ్లేషణ చెయ్యాలంటే వాతావరణంలో ప్రశాంతత, నిశ్శబ్దం ఉండాలి. కాని అదే నిశ్శబ్దాన్ని కొంచెం కూడా భరించలేడు రాజసికగుణం ఉన్న వ్యక్తి. అతనికి నిశ్శబ్దం చాలా భీకరంగా ఉంటుంది. ఒక్కడూ నిశ్శబ్ద వాతావరణంలో ఉండాల్సివస్తే, టీవీని హోరెత్తిపోయేలా పెట్టటమో లేదా ఎవరికో పనిగట్టుకుని ఫోనుచేసి మాట్లాడటమో చేస్తాడు. అంటే ఏదో ఒక రణగొణధ్వని ఉండాలి. అందువల్లనే కార్యక్రమాలను, ఉల్లాసంగా జరిగాయి అంటారు కాని నిశ్శబ్దంగా జరిగాయి అనరు. అంటే పని, నిశ్శబ్దం చెట్టాపట్టాలు వేసుకుని వెళ్ళలేవు. ఏదైనా కర్మ చెయ్యాలంటే, దానికి సంబంధించిన శబ్దం ఉండి తీరాలి.

**ప్రమాదావృద్ధి** – తమోగుణంలో ఈ రెండూ ఉండవు. నివృత్తీ ఉండదు, ప్రవృత్తీ ఉండదు. జ్ఞానం పొందాలనే తపన ఉండదు, పనిచెయ్యాలనే హుషారు కూడా ఉండదు. నిరాసక్తిగా ఉంటారు.

3. **బంధన ప్రకారః** – బంధనం అంటే బంధకత్వం; ప్రకారః అంటే పద్ధతి. ఏ గుణం ఏ విధంగా బంధిస్తుందో చూద్దాము.

**జ్ఞానసంగం** – సత్త్వగుణ ప్రధాన మనస్సు ప్రశాంతతను కోరుకుంటుంది. ఆలోచించటానికి, విశ్లేషించుకోవటానికి, అధ్యయనం చెయ్యటానికి. ఒక్కముక్కలో చెప్పాలంటే జ్ఞానసముపార్జన చెయ్యటానికి ప్రశాంత వాతావరణం ఉండాలి. అటువంటప్పుడు ఏవైనా శబ్దాలు వినిపించినా, ఎవరైనా అనుకోని అతిథి వచ్చినా అతని మనస్సు కలత చెందుతుంది. అంటే అది దుఃఖమిశ్రితత్వం అవుతుంది. చుట్టూ పరిసరాలు అతనికి అనువుగా ఉన్నంత వరకూ సత్త్వగుణంలో ఉంటాడు.

వేదాంతబోధ నేర్చుకోవటం మొదలయ్యాక, ఏ శిష్యునికైనా వేదాంతంలోనే రమించాలనీ, ఇంకా ఇంకా నేర్చుకోవాలనీ ఉంటుంది. కాని ఇంట్లోని వాతావరణం అందుకు అనుకూలంగా ఉండదు. ఈ శబ్దాలు, ఆ పరిస్థితులు చాలా చిరాకు పుట్టిస్తాయి. ఒకవేళ అదృష్టం బాగుండి ఏ శబ్దాలూ లేకపోయినా, తీరా అధ్యయనం చేద్దామని కూర్చునేసరికి టిక్‌టిక్‌మంటూ గడియారం రొదచేస్తుంది లేదా కికికి అంటూ బల్లి సతాయిస్తుంది. అవి కూడా భరించలేడు అతను. అందువల్ల సత్త్వగుణ సంపన్నుడు కూడా బంధింపపడతాడు. తన చుట్టూ ఉన్న పరిస్థితులను తను మార్చలేడు కాబట్టి బాధపడతాడు.

తనకు అనువైన పరిస్థితులు లేకపోతే బాధపడతాడు. అంటే బంధకత్వం బాధిస్తుంది అతన్ని. అంతేకాదు, అతృప్తికరత్వం కూడా అనుభవిస్తాడు. అదెలా? అతనికి జ్ఞానతృష్ణ చాలా ఉంటుంది. జ్ఞానం పొందకపోతే తను పరిమితి ఉన్న జీవిగా భావిస్తాడు. అందువల్ల ఆ లోటును సరిదిద్దాలి అనుకుంటాడు. రాజసికగుణం ఉన్న వ్యక్తికి ఈ తపన ఉండదు, అందువల్ల ఈ పరిమితి భావన కూడా ఉండదు. సాత్త్వికగుణం ఉన్న వ్యక్తికి ఎంత నేర్చుకున్నా తృప్తితీరదు. ఇంకా ఇంకా నేర్చుకోవాలనే తపన మిగిలిపోతూనే ఉంటుంది. తను **సర్వజ్ఞుడు** అవాలి అనుకుంటాడు, కాని ఆశ్చర్యకరంగానూ, బాధాకరంగానూ తెలిసినదేమిటంటే, తను ఎంత నేర్చుకున్నా, అది పరిపూర్ణ జ్ఞానం కాదని. అందువల్ల పరిమితి భావన పోదు.

నిజానికి ఒక విషయంయొక్క లోతులు కొలిచినకొద్దీ మనకు తెలియనిది ఇంకా ఎంతో మిగిలిపోయిందని తెలుస్తుంది. అందువల్లనే ఏ రంగంలో చూసినా అంతకంతకూ దానిలో శాస్త్రజ్ఞులు పరిశోధనలు చేస్తూనే ఉన్నారు. దానికి అంతూపొంతూ ఉండటం లేదు. ఆ సబ్జెక్టుమీద పూర్తి ఏకాగ్రత చూపటానికి ఒక జీవితకాలం సరిపోదు. ఒక్క వైద్యరంగం తీసుకుంటేనే అందులోనే అనేక నిపుణులు ఉన్నారు. శరీరంలో ఒక్కొక్క భాగాన్ని ఒక్కొక్కరు చూస్తారు. ఛాతీనెప్పికి ఒకరు, గుండెనెప్పికి ఒకరు, చర్మవ్యాధికి ఒకరు, పంటినెప్పికి ఒకరు. చర్మవ్యాధితో డాక్టరు దగ్గరికి వెళితే, ఆ వ్యాధి కొంచెం లోపలికి వెళితే, ఇది నా రంగం కాదు, వేరే వైద్యుని దగ్గరకు వెళ్ళండి అంటాడు.

'నిపుణుడు అంటే చాలా తక్కువ అంశాల గురించి చాలా లోతుగా తెలిసినవాడు,' అన్నారు ఒక మేధావి. అందువల్ల ఎంత నేర్చుకున్నా, ఆ రంగంలో అతను సర్వజ్ఞుడు కాలేడు. అందువల్ల అతన్ని కూడా సంసారం బంధిస్తుంది. ఇటువంటి బంధాన్ని జ్ఞానసంగం అంటారు.

**కర్మసంగం** – రాజసికగుణం ప్రధానంగా ఉన్నవ్యక్తి దీనికి భిన్నంగా ఉంటాడని చూశాము కదా. అతను నిశ్శబ్దాన్ని, ప్రశాంతతను ఒక్కక్షణం కూడా భరించలేడు. ఎవరూ మాట్లాడటానికి లేకపోతే, టీవీ గట్టిగా పెట్టేసి, పొరుగింటి వారి ప్రశాంతతకు భంగం కలిగిస్తాడు. అంటే ఇతను తన ఆనందంకోసం తోటివారిమీద ఆధారపడతాడు; వారు పక్కన లేకపోతే బాధపడతాడు. దీన్ని బంధకత్వం అంటారు. ఈ బంధకత్వంవల్ల జీవితంలో పైకి ఎదగలేడు. ఎక్కడైతే ఒకదానిమీద ఆధారపడటం అవుతుందో, అక్కడే బాధ వెన్నంటి ఉంటుంది.

రాజసికగుణం ఉన్న వ్యక్తి కూడా సంసారంలో బంధింపబడతాడు. కాకపోతే అతని బంధం వేరేగా ఉంటుంది. సాత్త్వికగుణం ఉన్న వ్యక్తిని జ్ఞానతృష్ణ బంధిస్తే, రాజసికగుణం ఉన్న వ్యక్తిని ఇంకా ఇంకా కర్మ చెయ్యాలనే తపన బాధిస్తుంది. ఒక్కక్షణం తీరిగ్గా కూర్చోలేడు. ఏదో చేసేయాలి; ఏదో సాధించేయాలి అనే తపన అతన్ని ఒక్కక్షణం కూడా ఆగనివ్వదు. అందమైన వాటిని ఆగి చూసి ఆస్వాదించే తీరిక ఉండదు.

**ది ఉడ్స్ ఆర్ డార్క్ డీప్ అండ్ లవ్లీ**
**బట్ ఐ హేవ్ ప్రామిసెస్ టు కీప్**
**అండ్ మైల్స్ టు గో బిఫోర్ ఐ స్లీప్**
**అండ్ మైల్స్ టు గో బిఫోర్ ఐ స్లీప్** – రాబర్ట్ ఫ్రాస్ట్

అందమైన అడవిలో వెళుతున్న ఒక వ్యక్తి, ఒక్కక్షణం ఆగి ఆ అందాన్ని ఆస్వాదిస్తాడు. కాని వెంటనే అతని కర్తవ్యం అతని వెన్నుతట్టుతుంది. ఈ అడవి అందంగా, అద్భుతంగా ఉంది నిజమే కాని నేను నెరవేర్చాల్సిన బాధ్యతలు ఎన్నో ఉన్నాయి, నేను ప్రయాణించాల్సిన దూరమెంతో ఉంది అంటాడు. ప్రయాణించాల్సిన దూరం అంటే చెయ్యాల్సిన పనులు ఎన్నో ఉన్నాయి అని అర్థం. అందువల్ల అతను ఒక్కక్షణం కూడా ఖాళీగా కూర్చోడు; ఇతన్ని **వర్క్‌హాలిక్** అంటారు. ఇటువంటి బంధాన్ని కర్మసంగం అంటారు.

**ప్రమాదసంగం** – తామసికగుణం ఉన్న వ్యక్తి నిర్లక్ష్యంగా ఉంటాడు. తనకు కలిగిన మానవజన్మ ఎంత దుర్లభమైనదో తెలుసుకోడు. ఈ నిర్లక్ష్యాన్ని ప్రమాదసంగం అంటారు.

4. **గతిః** – ఈ గుణాలు ఉన్న జీవులు మరణించాక ఏ లోకాలకు వెళతారో చూద్దాము. దీన్ని మరణానంతర ప్రయాణం అంటారు.

**ఊర్ధ్వగతి** – సత్త్వగుణం ప్రధానంగా ఉన్న వ్యక్తి ఊర్ధ్వలోకాలకు వెళతాడు.
**మధ్యమగతి** – రజోగుణం ప్రధానంగా ఉన్న వ్యక్తి భూలోకంలో పుడతాడు.
**అధోగతి** – తామసికగుణం ప్రధానంగా ఉన్న వ్యక్తి అధోలోకాలకు వెళతాడు.

5. **ఫలం** – గతి అంటే మరణించాక అతను వెళ్ళే లోకం. ఫలం అంటే జీవించి ఉండగానే అతను పొందే ఫలితం. సత్త్వగుణం ఉన్న వ్యక్తి పుణ్యం, జ్ఞానం పొందుతాడు; రజోగుణం ఉన్న వ్యక్తి దుఃఖం, లోభంలో పడిపోతాడు; తమోగుణం ఉన్న వ్యక్తి అజ్ఞానం, మోహంలో పడిపోతాడు.

సత్త్వగుణం ప్రధానంగా ఉన్న వ్యక్తి ఇంద్రియాలు చురుకుగా ఉంటాయి కాబట్టి అంతులేని జ్ఞానసంపదను పొందుతాడు; రజోగుణం ప్రధానంగా ఉన్న వ్యక్తికి లోభం ఏర్పడుతుంది. అందువల్ల కర్మవృద్ధి జరిగినా, దుఃఖం కలుగుతుంది. తమోగుణం ప్రధానంగా ఉన్న వ్యక్తి ప్రమాద (అశ్రద్ధ), మోహాల్లో పడతాడు. దేనిమీదా శ్రద్ధ ఉండదు కాబట్టి అజ్ఞానం పోదు.

ఈ విధంగా ఈ మూడుగుణాలు మనిషిని పట్టి బంధించివేస్తాయి. కాని కృష్ణపరమాత్మ, ఏ మనిషియొక్క అహంకారం కూడా ఈ గుణాలను తప్పించుకోలేదు అంటున్నాడు. కాకపోతే, ఒక్కొక్కరిలో ఒక్కొక్క గుణం ఎక్కువగా ఉంటుంది. అది ఏ గుణప్రధానమైనా కూడా, మూడూ మనిషిని సంసారంలో కట్టిపడేస్తాయి. చిన్న భేదం ఏమిటంటే, అది ఎటువంటి సంసారం అనేది అతనికున్న బంధాన్నిబట్టి ఉంటుంది.

సత్త్వగుణం బంగారుసంకెళ్ళతో కట్టివేస్తే, రాజసికగుణం వెండిసంకెళ్ళతో కట్టివేస్తే, తామసికగుణం ఇనపసంకెళ్ళతో కట్టివేస్తుంది. ఏదైనా బంధం బంధమే. కొన్ని ఆచారాల్లో రాజవంశానికి చెందిన వ్యక్తి ఏదైనా నేరం చేస్తే, అతని తల నరకాల్సి వస్తే, అతని తలను బంగారుకత్తితో నరుకుతారు. తల నరకటమంటూ అయ్యాక అది బంగారు కత్తి అయితేనేం, మామూలు కత్తి అయితేనేం? అందువల్ల ఏ గుణంలో ఉన్నా కూడా, వాటికి అతీతంగా ఎదిగి, గుణాతీతునిగా ఎదగాలి. అంటే తన సాక్షి అంశలో నిలబడగలగాలి.

కాని గుణాతీతునిగా ఎదగాలంటే, ఈ మూడు గుణాలనూ వాడి, వాటికి అతీతంగా ఎదగాలి. పోల్‌వాల్టర్ ఉదాహరణ చూశాము ఇంతకుముందు. అతను కర్రను వాడి, సరియైన సమయంలో వదిలివేసినట్టుగా, ఈ గుణాలను వాడి, వాటికి అతీతంగా ఎదగాలి. నిజానికి మనకు ఈ మూడు గుణాలు ఉండాలి. ఎంతసేపూ సత్త్వగుణమో, రజోగుణమో ఉంటే జ్ఞానం వెంట పరుగులు తీయటమో, కర్మల్లో కూరుకుపోవటమో చేస్తాము తప్పితే నిద్రపోము. మనకు నిద్రకూడా చాలా అవసరం. అది తమోగుణంవల్ల వస్తుంది. అందువల్ల తమోగుణం వాడి, విశ్రాంతి తీసుకోవాలి; రజోగుణం వాడి కర్మ చెయ్యాలి; సత్త్వగుణం వాడి జ్ఞానానికి రావాలి.

మనం గీతాబోధకు వెళితే, మనలో తమోగుణం ఎక్కువగా ఉంటే, బోధలో హాయిగా నిద్రపోతాము. రజోగుణం ఎక్కువగా ఉంటే క్షణం కుదురుగా కూర్చోము. ఎవరెవరు వచ్చారు, ఏం చేస్తున్నారు, ఎంతమంది

కునుకు తీస్తున్నారు అని చూస్తాము. అందువల్ల తమోగుణం ఉన్నా వినలేము, రజోగుణం ఉన్నా నేర్చుకోలేము. ఏకాగ్రత ఉన్న మనస్సుతోనే బోధను జీర్ణించుకోగలము. అది సత్త్వగుణంవల్లనే సాధ్యం. సత్త్వగుణం ఉంటే జ్ఞానం పొందుతాము. ఏమిటా జ్ఞానం? మనలో అహంకారం+సాక్షి ఉన్నాయని, మనం తక్కువస్థాయికి చెందిన అహంకారం కాదనీ, మనం ఉన్నతస్థాయికి చెందిన సాక్షి అనీ తెలుసుకుంటాము. అహంకారం మిథ్య అనీ, సాక్షి సత్యం అనీ నేర్చుకుంటాము.

**అహం గుణాతీతసాక్షి అస్మి**

ఈ విధంగా మనం ఈ మూడుగుణాలయొక్క లక్షణం, బంధం, లింగం, గతి, ఫలాల గురించి నేర్చుకుని, వాటి బంధంనుంచి తెలివిగా బయటపడి వాటి ఫలం పొందగలగాలి. ఫలం గుణాతీతునిగా ఎదగటం, అంటే సంసారంనుంచి మోక్షం పొందటం.

ఇక్కడితో త్రైగుణ్య విశ్లేషణ – ఒక విహంగవీక్షణం ముగిసింది. ఈ నేపథ్యంతో శ్లోకాలలోకి అడుగుపెడదాము.

శ్లో. 5 **సత్త్వం రజస్తమ ఇతి గుణాః ప్రకృతిసంభవాః ।**
**నిబధ్నంతి మహాబాహో దేహే దేహినమవ్యయమ్ ॥**
సత్త్వమ్, రజః, తమః, ఇతి, గుణాః, ప్రకృతిసంభవాః,
నిబధ్నంతి, మహాబాహో, దేహే, దేహినమ్, అవ్యయమ్ ॥

| | | | |
|---|---|---|---|
| మహాబాహో! | = ఓ అర్జునా! | గుణాః | = మూడు గుణములు |
| సత్త్వమ్ | = సత్త్వగుణము | అవ్యయమ్ | = వినాశరహితుడైన |
| రజః | = రజోగుణము | దేహినమ్ | = జీవాత్మను |
| తమః, ఇతి | = తమోగుణము, అను | దేహే | = శరీరమునందు |
| ప్రకృతిసంభవాః | = ప్రకృతినుంచి పుట్టిన | నిబధ్నంతి | = బంధించుచున్నవి |

**హే మహా–బాహో! సత్త్వమ్ రజః తమః ఇతి గుణాః ప్రకృతి–సమ్భవాః**
**(సన్తి, తే) దేహే అవ్యయమ్ దేహినమ్ నిబధ్నన్తి ॥**

తా: ఓ అర్జునా! సత్త్వగుణము, రజోగుణము, తమోగుణము అను ప్రకృతినుంచి పుట్టిన మూడు గుణములు వినాశరహితుడైన జీవాత్మను శరీరమునందు బంధించుచున్నవి.

ఈ శ్లోకంలో కృష్ణపరమాత్మ ఈ మూడుగుణాలనూ పరిచయం చేస్తున్నాడు.

**సత్త్వం రజస్తమ ఇతి గుణాః ప్రకృతిసంభవాః** – ప్రకృతిలో ఉన్న మూడు గుణాలు మనిషికి కూడా వచ్చాయి. అవి సత్త్వగుణం, రజోగుణం, తమోగుణం.

**దేహే దేహినమవ్యయమ్** – దేహి అంటే అహంకార ప్రధానజీవి. ఆ మూడు గుణాలు అహంకార ప్రధానజీవిలో భిన్నస్థాయిల్లో ఉన్నాయి.

**నిబధ్నంతి** – అవి భిన్నస్థాయిల్లో మనిషిని బంధిస్తాయి.

శ్లో. 6 **తత్ర సత్త్వం నిర్మలత్వాత్ ప్రకాశకమనామయమ్ ।**
**సుఖసంగేన బధ్నాతి జ్ఞానసంగేన చానఘ ॥**
తత్ర, సత్త్వమ్, నిర్మలత్వాత్, ప్రకాశకమ్, అనామయమ్,
సుఖసంగేన, బధ్నాతి, జ్ఞానసంగేన, చ, అనఘ ॥

| | | | |
|---|---|---|---|
| అనఘ! | = ఓ పాపరహితుడా! | సుఖసంగేన | = సుఖసాంగత్యముతో |
| తత్ర | = ఈ మూడు గుణములందు | చ | = ఇంకా |
| సత్త్వమ్ | = సత్త్వగుణము | జ్ఞానసంగేన | = జ్ఞానాభిమానమువల్ల |
| నిర్మలత్వాత్ | = నిర్మలమగుటవల్ల | బధ్నాతి | = జీవుని బంధించును |
| ప్రకాశకమ్ | = జ్ఞానమును ఇచ్చునది | | |
| అనామయమ్ | = ఇంకా వికారరహితమైనది | | |

**హే అనఘ! తత్ర అనామయమ్ ప్రకాశకమ్ సత్త్వమ్ నిర్మలత్వాత్**
**(ఆత్మానం) సుఖ-సఙ్గేన జ్ఞాన-సఙ్గేన చ బధ్నాతి ॥**

తా: ఓ పాపరహితుడా! ఈ మూడు గుణములందు సత్త్వగుణము నిర్మలమగుటవల్ల జ్ఞానమును ఇచ్చునది, ఇంకా వికారరహితమైనది. కాని అది సుఖసాంగత్యముతో ఇంకా జ్ఞానాభిమానమువల్ల జీవుని బంధించును.

ఎ, బి) **లక్షణమ్, బంధన ప్రకారః – శ్లోకాలు 6–8**

ఇప్పుడు మనం చూసిన ఐదు అంశాలను ఒక్కొక్కటిగా చర్చిస్తాడు కృష్ణపరమాత్మ. ఈ శ్లోకంనుంచి మూడు శ్లోకాల్లో లక్షణం, బంధన ప్రకారః అంశాలను చెప్పబోతున్నాడు. అంటే ఆరవశ్లోకంలో సత్త్వలక్షణం, సత్త్వ బంధన ప్రకారం; ఏడవశ్లోకంలో రజోలక్షణం, రజోబంధన ప్రకారం; ఎనిమిదవ శ్లోకంలో తమోలక్షణం, తమోబంధన ప్రకారం వివరించబోతున్నాడు.

**తత్ర** – ఈ మూడు గుణాలలో. దేనియొక్క మూడు గుణాలు? అహంకారమా, సాక్షా? సాక్షి గుణాతీతం. అందువల్ల అహంకారంయొక్క మూడు గుణాలు.

**సత్త్వం నిర్మలత్వాత్** – సత్త్వం అంటే సత్త్వగుణం ప్రధానంగా ఉన్న వ్యక్తి. నిర్మలత్వాత్ అంటే అతని మనస్సు నిర్మలంగా ఉంటుంది. దాన్ని శుద్ధసత్త్వం లేదా నిర్మలసత్త్వం అంటారు. నిర్మలసత్త్వం అంటే ఏమిటి? సత్త్వగుణం ప్రధానంగా ఉంటే, తక్కిన రెండు గుణాలూ అతన్ని కలుషితం చెయ్యలేవు. రజోగుణం లేదా తమోగుణం కలుషితం చేస్తే దాన్ని మలినసత్త్వం అంటారు.

**ప్రకాశకమ్** – సత్త్వగుణం ప్రధానంగా ఉంటే, తక్కిన రెండు గుణాలు మలినం చెయ్యలేవు కాబట్టి, అది ప్రకాశవంతంగా ఉంటుంది.

తమోగుణం బద్ధకానికి, అజ్ఞానానికి, చీకటికి పెట్టింది పేరు. అటువంటి తమోగుణం ఒకవేళ సత్త్వగుణాన్ని మలినం చేస్తే, మనస్సు అల్లకల్లోలంగా ఉంటుంది. ఎలాగైతే నీటిలో దుమ్మూ, ధూళి చేరితే అది మురికిగా ఉంటుందో, అలాగే తమోగుణం సత్త్వగుణాన్ని ప్రభావితం చేస్తే, మనస్సు నిర్మలంగా ఉండదు. అదే మనస్సును తమోగుణం ప్రభావితం చెయ్యకపోతే స్ఫటికంలా మెరుస్తున్న నీరులా మనస్సు కూడా ప్రకాశవంతంగా ఉంటుంది. ఆలోచనల్లో స్పష్టత ఉంటుంది. అందువల్ల సత్త్వగుణం నిర్మలంగా ఉంది అంటే, దానిమీద తమోగుణం ప్రభావం లేదని అర్థం. అందువల్ల ప్రకాశాత్మకం. అతను స్పష్టంగా ఆలోచించగలడు. అందువల్లనే ఇంగ్లీషులో హి ఈజ్ ఎ బ్రైట్ బాయ్ అంటారు. బ్రైట్ అంటే ఆలోచనలో స్పష్టత ఉంది అని అర్థం.

రజోగుణం ప్రభావం చూపితే, సత్త్వగుణం ఎలా ఉంటుంది? రజోగుణం ప్రధానంగా ఉన్న వ్యక్తి ఒక్కక్షణం కుదురుగా కూర్చోలేడని చూశాము. అతను ఎంతసేపూ పని, పని అంటూ పనిలో కూరుకుపోతాడు. అందువల్ల అతని మనస్సు కూడా ప్రశాంతంగా ఉండదు. అతని మనస్సు ఎంతసేపూ బాహ్యాముఖంగా పరుగులు తీస్తూ, అసహనంగా, ఊగిసలాడుతూ ఉంటుంది.

**అనామయమ్** – ఇటువంటి రజోగుణం ప్రభావం చూపకపోతే, అప్పుడు ఆ సత్త్వగుణం అనామయంగా ఉంటుంది. ప్రకాశాత్మకం అంటే తమోగుణ ప్రభావం లేకపోవటం; అనామయం అంటే రజోగుణ ప్రభావం లేకపోవటం. అనామయం అంటే ఆందోళన లేని, ఒత్తిడి లేని, అసహనంగా లేని మనస్సు.

రజోగుణం కలుషితం చేస్తే, మనస్సు ప్రశాంతంగా ఉండలేదు కాని సత్త్వగుణం ప్రధానంగా ఉంటే, మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. అంటే ప్రశాంతంగా, నిర్మలంగా, స్పష్టంగా ఉంటుంది. అటువంటి ప్రకాశాత్మక మనస్సుకు జ్ఞానం పొందగలిగే శక్తి ఉంటుంది; పొందిన జ్ఞానాన్ని విశ్లేషించే శక్తి ఉంటుంది; పొందిన జ్ఞానాన్ని మననం చేసుకునే శక్తి ఉంటుంది; పొందిన జ్ఞానాన్ని జీర్ణించుకునే శక్తి ఉంటుంది.

**లక్షణమ్ – ప్రకాశాత్మకము –మనస్సు ప్రకాశవంతంగా ఉంటుంది.**

ఇంత అద్భుతంగా పనిచేస్తే, సత్త్వగుణం బంధకత్వాన్ని పెంచుతుందని ఎలా అంటారు? సత్త్వగుణం ఒక వ్యక్తిని ఎలా బంధిస్తుంది?

**సుఖసంగేన బధ్నాతి** – సత్త్వగుణం ప్రధానంగా ఉన్న వ్యక్తి ఏకాంతం కోరుకుంటాడు. అది దొరక్కపోతే బాధపడతాడు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

సత్త్వగుణ ప్రధాన మనస్సు ఎంతసేపూ ప్రశాంతతను కోరుకుంటుంది; ఏకాంతాన్ని కోరుకుంటుంది; శబ్దకాలుష్యంనుంచి దూరంగా ఉండాలని కోరుకుంటుంది. ఏకాంతం కోరుకుంటే తప్పేమిటి? బాహ్యప్రపంచాన్ని మనము ఎన్నడూ అదుపులో పెట్టలేము. మనం ఏకాంతానికి అలవాటుపడిపోతే, ఏమాత్రం ఏకాంతం దొరక్కపోయినా చిరాకుపడిపోతాము. అంటే మనం ఏకాంతంమీద బంధం పెంచుకుంటాము. కాని మన ఇంటి వాతావరణం అందుకు దోహదపడదు. అప్పుడు చాలా చిరాకు వచ్చేస్తుంది. కాసేపు కూడా నన్ను ప్రశాంతంగా ఉండనివ్వరా అని ఇంట్లోవారిమీద చిందులు తొక్కుతాము. అవిరామరంగా మోగే ఫోను, కాలింగ్‌బెల్, టీవీ

రొదలేకాక, ఇరుగుపొరుగులనుంచి వచ్చే శబ్దాలు కూడా ఎక్కువే ఉంటాయి. అలాంటి పరిస్థితుల్లో ఏకాంతం కోరటం అత్యాశే అవుతుంది.

అదే జ్ఞాని విషయం తీసుకుంటే, అతను తనకు ఆనందం కలిగించే ప్రశాంతతకోసమో, ఏకాంతంకోసమో దేనిమీదా ఆధారపడడు. ఆధారపడటం అంటూ అయితే అది బంధకత్వానికి దారితీస్తుంది. సత్త్వగుణం చూపే బంధకత్వం ఉన్నతమైనదే అయినా కూడా ఎప్పటికైనా బంధకత్వం బంధకత్వమే. అందువల్ల సుఖసంగేన అంటే సత్త్వగుణ అహంకారం ఏకాంతం కోరుకుంటుంది; అది బంధకత్వానికి దారితీస్తుంది. మనదేశంలో ఏ మారుమూల ప్రాంతానికి వెళ్ళినా సందడిని తప్పించుకోలేరు. ప్రశాంతతకోసం ఆలయానికి వెళ్ళినా కూడా, ఆలయాల్లో పెద్ద రొదతో ఏవో పాటలు పెట్టేస్తారు. అందువల్ల సుఖసంగం ఒక బంధం.

**జ్ఞానసంగేన చ అనఘ** – సత్త్వగుణం ప్రధానంగా ఉన్న మనస్సుకు జ్ఞానతృష్ణ ఉంటుందని చూశాము. అటువంటి మనస్సు అంతర్ముఖంగా ఉంటుంది. రాజసికగుణం ప్రధానంగా ఉన్న మనస్సుకు కర్మ చెయ్యాలనే తపన ఉంటుంది. అందువల్ల అతని మనస్సు కర్మేంద్రియ ప్రధానంగా ఉంటే, సత్త్వగుణం ఉన్న మనస్సు జ్ఞానేంద్రియ ప్రధానంగా ఉంటుంది. ఇద్దరికీ తపన ఉంటుంది. సత్త్వగుణం ఉన్న వ్యక్తికి ఇంకా ఇంకా జ్ఞానం పొందాలనే తపన ఉంటే, రజోగుణం ఉన్న వ్యక్తికి ఇంకా ఇంకా కర్మ చెయ్యాలనే తపన ఉంటుంది. ఎంత ధనం సంపాదించినా ఎలా తృప్తితీరదో, అలా సత్త్వగుణం ఉన్న వ్యక్తికి ఎంత జ్ఞానం సంపాదించినా తృప్తితీరదు. ఆ విధంగా ఇద్దరూ అతృప్తికరత్వంతో బాధపడతారు. ఒకరిది బాహ్యంగా ఉన్న ఐశ్వర్యం, ఇంకొకరిది అంతర్గత ఐశ్వర్యం.

ఇక్కడ ఒక విషయం గమనించాలి. జ్ఞానం అంటే ఆత్మజ్ఞానం కాదు. అది అపరావిద్య లేదా లౌకికవిద్య. అందువల్ల అతను బుద్ధిపరంగా సంసారబాధను అనుభవిస్తాడు. ఏదో వైజ్ఞానిక సూత్రాలను కనుగొనాలని జీవితమంతా ఆరాటపడతాడు, అది తీరకుండానే తనువు చాలిస్తాడు. ఆ విధంగా జ్ఞానం బంధిస్తుంది.

**అనఘ** – కృష్ణపరమాత్మ అర్జునుణ్ణి అనఘ అని సంబోధిస్తున్నాడు. పరోక్షంగా నీకు శుద్ధ అంతఃకరణ ఉంది అంటున్నాడు. ఎందుకు? అతను జ్ఞానం కోరాడు.

**శిష్యస్తేఽహం శాధి మాం త్వాం ప్రపన్నమ్** – 2.7

ఈ శ్లోకంలో సత్త్వగుణం గురించి చూశాము. మొదటిపాదంలో సత్త్వలక్షణమూ, రెండవపాదంలో బంధన ప్రకారమూ ఇవ్వబడ్డాయి.

| | | |
|---|---|---|
| **లక్షణమ్** | **– ప్రకాశాత్మకము** | **– మనస్సు ప్రకాశవంతంగా ఉంటుంది.** |
| **బంధన ప్రకారః** | **– జ్ఞానసంగము** | **– జ్ఞానతృష్ణ ఉంటుంది.** |

శ్లో. 7 **రజో రాగాత్మకం విద్ధి తృష్ణాసంగసముద్భవమ్ ।**
**తన్నిబధ్నాతి కౌంతేయ కర్మసంగేన దేహినమ్ ॥**
రజః, రాగాత్మకమ్, విద్ధి, తృష్ణాసంగసముద్భవమ్,
తత్, నిబధ్నాతి, కౌంతేయ కర్మసంగేన, దేహినమ్ ॥

| | | | |
|---|---|---|---|
| కౌంతేయ! | = ఓ అర్జునా! | తత్ | = ఆ రజోగుణము |
| రాగాత్మకమ్ | = రాగాత్మకమైన | దేహినమ్ | = జీవాత్మను |
| రజః | = రజోగుణము | కర్మసంగేన | = కర్మలు, వాటి ఫలముల సాంగత్యముతో |
| తృష్ణాసంగ సముద్భవమ్ | = కామము, ఆసక్తులనుంచి పుట్టినదని | నిబధ్నాతి | = బంధించును |
| విద్ధి | = తెలుసుకొనుము | | |

**హే కౌన్తేయ! రాగ–ఆత్మకమ్ రజః తృష్ణా–సఙ్గ–సముద్భవమ్ విద్ధి ।**
**తత్ దేహినమ్ కర్మ–సఙ్గేన నిబధ్నాతి ॥**

తా: ఓ అర్జునా! రాగాత్మకమైన రజోగుణము, కామము, ఆసక్తులనుంచి పుట్టినదని తెలుసుకొనుము. ఆ రజోగుణము జీవాత్మను కర్మలు, వాటి ఫలముల సాంగత్యముతో బంధించును.

ఈ శ్లోకంలో రజోగుణ లక్షణం, రజోగుణ బంధన ప్రకారః చూస్తాము.

**రజో రాగాత్మకం విద్ధి** – రజోగుణంలో భావోద్రేకాలు, అనుబంధాలు ఎక్కువగా ఉంటాయి. రాజసికగుణం ఉన్న వ్యక్తి ఎంతసేపూ బహిర్ముఖంగా ఉంటాడు. అతను తన చుట్టూ ఉన్న పరిసరాలతో, మనుష్యులతో అనుబంధాన్ని పెంచుకుంటాడు. ఇది సత్త్వగుణానికి పూర్తిగా భిన్నంగా ఉంటుంది. సత్త్వగుణం నివృత్తి ప్రధానంగా ఉంటే, రజోగుణం ప్రవృత్తి ప్రధానంగా ఉంటుంది. సత్త్వగుణం ఏకాంతాన్ని కోరుకుంటే, రజోగుణం సందడిని కోరుకుంటుంది. అతను నలుగురిలోనూ కలివిడిగా ఉంటాడు. అటువంటి వ్యక్తిని తీసుకెళ్ళి ఒక గదిలో ఒంటరిగా బంధించి చూడండి! అక్కడ అతను ఒక్కక్షణం కూడా ఉండలేడు. గది తలుపులు బద్దలుకొట్టుకుని అయినా సరే బయటకి వచ్చేస్తాడు. అదే సత్త్వగుణం ఉన్న వ్యక్తిని ఒంటరిగా గదిలో బంధించి చూడండి! అతను ఆ గదిలో ఉన్నట్టుగా కూడా మనకు తెలియదు. ఏ విధమైన శబ్దాలూ బయటకు రావు. అతను ఆ ప్రశాంతతను ఆస్వాదిస్తాడు.

రాగాత్మకంలో రాగం అంటే అనుబంధం, అనురాగం, బంధం. మనుష్యులకు కరుచుకుపోతారు. రజోగుణం ఉన్నవారు గది చాలా విశాలంగా ఉన్నాకూడా, ఎవరి దగ్గరకన్నా వెళ్ళి వారిని ఆనుకుని కూర్చుంటారు. పడుకునేటప్పుడు కూడా పక్కన ఎవరైనా ఉండాలి. ఎవరూ లేకపోతే దిండును కౌగలించుకుని పడుకుంటారు.

ఈ రెండు రకాల మనస్తత్వాల్లో ఏది మంచిది, ఏది చెడ్డది అని చర్చించబోవటం లేదు మనము. నిజం చెప్పాలంటే, మనం మోక్షం పొందాలంటే, మనలో ఈ రెండు గుణాలూ ఉండాలి. కర్మయోగం పాటించాలంటే, అందులోనూ పంచమహాయజ్ఞాలు చెయ్యాలంటే వాటికి కర్మలు చెయ్యాలి; కర్మలు చెయ్యాలంటే రజోగుణం ఉండాలి; వేదాంతం అధ్యయనం చెయ్యాలంటే సత్త్వగుణం ఉండాలి. అందువల్ల ఒక గుణం మంచిదని చెప్పి, ఇంకొకగుణం చెడ్డదని కొట్టిపారేయలేము. దేని స్థానం, దేని ప్రాముఖ్యత దానికే ఉంది. మనం చెయ్యాల్సిన సాధనలను చూస్తే, ఒక్కోదశలో ఒక్కోగుణం అవసరం ఉంటుంది. అందువల్ల రజోగుణం రాగాత్మకం అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**తృష్ణాసంగసముద్భవమ్** – తృష్ణ అంటే కామం లేదా కోరిక. బాహ్యవస్తువులమీద కోరిక; అనేక వస్తువులమీద కోరిక; అనేకమైన మనుష్యులతో అనుబంధం పెంచుకోవాలనే కోరిక. రజోగుణం ఉన్న వ్యక్తి బహిర్ముఖంగా ఉంటాడు కాబట్టి, ఉల్లాసంతో చిందులు వేస్తుంటాడు కాబట్టి, అతనికి జీవితంమీద ఎన్నో ఆశలు, కోరికలు ఉంటాయి. ఎంతసేపూ ఏదో ఒక లక్ష్యం సాధించాలనే తపన ఉంటుంది.

ఈ తపనను రెండు రకాలుగా విభజించవచ్చు. అతను వర్క్‌హాలిక్‌లాగా పనిచేస్తాడు కాని అది సకామకర్మ అవచ్చు, లేదా నిష్కామకర్మ అవచ్చు.

ఇతను తను కోరిన వస్తువులను పొందాక, వాటిమీద సంగత్వం పెంచుకుంటాడు. ఎప్పుడో పదవ తరగతి పరీక్ష రాయటానికి వాడిన పెన్నును కూడా భద్రంగా దాచుకుంటాడు. ఇప్పుడు అలాంటి పెన్నులు లేవు, దాన్ని ఇంకుపెన్ను అంటారు. అలాంటి పనికిరాని వస్తువులు ఎన్నింటినో దాచుకుంటాడు. అందువల్ల ఇతను పరిగ్రహ ప్రధానం అవుతాడు. పరిగ్రహం అంటే వస్తువులను దాచుకోవటం.

సత్త్వగుణం ప్రధానం ఉన్నవ్యక్తి అపరిగ్రహ ప్రధానం అవుతాడు. అంటే తన దగ్గరున్న వస్తువులను వదుల్చుకోవాలని చూస్తాడు. రజోగుణమున్నవాడు అన్నీ ప్రోగేయాలని చూస్తే, సత్త్వగుణమున్నవాడు అన్నీ వదుల్చుకోవాలని చూస్తాడు.

సముద్భవం అంటే మూలం. ఏది మూలం? కామానికి, బంధానికి మూలం రజోగుణం. లేని వస్తువులను పొందాలనుకుంటాడు. పొందిన వస్తువులమీద మమకారం పెంచుకుంటాడు. పొందిన వస్తువుమీద మమకారం ఎంతగా ఉంటుందంటే, ఆ వస్తువును అతను పొందాడా లేక వస్తువే అతన్ని పొందిందా అని మనం ఆశ్చర్యపడకతప్పదు! ఇది రజోగుణ నిర్వచనం.

**లక్షణమ్ – రాగాత్మకము – బంధించే స్వభావం**

ఈ రజోగుణం ఒక వ్యక్తిని ఎలా బంధిస్తుంది?

**తత్ నిబధ్నాతి** – రజోగుణం కూడా బంధిస్తుంది.

**దేహినమ్ కర్మసంగేన** – దేహినమ్ అంటే ఒకవ్యక్తిని; కర్మసంగేన అంటే కర్మచేత బంధింపబడతాడు. అతనికి ఎంతసేపూ కర్మ చేయాలనే తపన ఉంటుంది. ఇది బంధన ప్రకారం.

కర్మ చెయ్యాలి కదా, కర్మను ఎలా తప్పించుకోగలమని సందేహం రావచ్చు.

నిజమే, కర్మయోగాన్ని చిత్తశుద్ధి పొందటానికి వాడాలి. కర్మయోగం పాటించాలంటే కర్మలు చెయ్యకతప్పదు. కాని వేదాంతం కర్మ ఒక స్థాయివరకే అవసరం అంటుంది. కర్మయోగం పాటించి, జ్ఞానయోగ్యతా ప్రాప్తిని పొంది, జ్ఞానయోగానికి రావాలి. కర్మయోగంనుంచి జ్ఞానయోగానికి రావాలి, కాని వచ్చిన చిక్కేమిటంటే రజోగుణం ప్రధానంగా ఉన్నవ్యక్తి ఎన్నటికీ జ్ఞానయోగానికి రాలేడు. అతను నిరంతరం కర్మ, కర్మ, కర్మ అంటూ కర్మల్లో కూరుకుపోతాడు. చివరికి జ్ఞానయోగానికి రాకుండానే మరణిస్తాడు. అందువల్ల రజోగుణం ఉన్న వ్యక్తిని కర్మ బంధిస్తుంది.

| | | |
|---|---|---|
| **లక్షణమ్** | **– రాగాత్మకము** | **– బంధించే స్వభావం** |
| **బంధన ప్రకారః** | **– కర్మసంగము** | **– కర్మ చేయాలనే తపన** |

శ్లో. 8 **తమస్త్వజ్ఞానజం విద్ధి మోహనం సర్వదేహినామ్ ।**
**ప్రమాదాలస్యనిద్రాభిః తన్నిబధ్నాతి భారత ॥**
తమః, తు, అజ్ఞానజమ్, విద్ధి, మోహనమ్, సర్వదేహినామ్,
ప్రమాదాలస్యనిద్రాభిః తత్, నిబధ్నాతి భారత ॥

| | | | |
|---|---|---|---|
| భారత! | = ఓ అర్జునా! | విద్ధి | = తెలిసికొనుము |
| సర్వదేహినామ్ | = దేహాభిమానము గలవారినందఱిని | తత్ | = ఆ తమోగుణము |
| మోహనమ్ | = మోహింపజేయు | (దేహినామ్) | = (జీవాత్మను) |
| తమః, తు | = తమోగుణమయితే | ప్రమాద ఆలస్య నిద్రాభిః | = నిర్లక్ష్యం, నిద్రాదులతో |
| అజ్ఞానజమ్ | = అజ్ఞానమునుండి ఉత్పన్నమైనదానినిగా | నిబధ్నాతి | = బంధించును |

**హే భారత! తమః తు సర్వ–దేహినామ్ మోహనమ్ అజ్ఞానజమ్ విద్ధి ।**
**తత్ (దేహినామ్) ప్రమాద–ఆలస్య–నిద్రాభిః నిబధ్నాతి ॥**

తా: ఓ అర్జునా! దేహాభిమానము గలవారినందఱిని మోహింపజేయు తమోగుణమయితే, అజ్ఞానమునుండి ఉత్పన్నమైనదానినిగా తెలిసికొనుము. ఆ తమోగుణము జీవాత్మను నిర్లక్ష్యం, నిద్రాదులతో బంధించును.

ఈ శ్లోకంలో తమోగుణ లక్షణం, తమోగుణ బంధన ప్రకారం చూస్తాము.

**తమః తు అజ్ఞానజం విద్ధి** – తమోగుణం అజ్ఞానంనుంచి పుట్టింది అని తెలుసుకో అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఇక్కడ అజ్ఞానం అంటే ప్రకృతి. ప్రకృతి త్రిగుణాత్మకమనీ, ప్రకృతినుంచి సృష్టి జరిగిందనీ, సృష్టిలోని ప్రతి వస్తువులోనూ ఈ మూడు గుణాలు ఉంటాయనీ చూశాము. ఏమిటా గుణాలు? సత్త్వ, రజ, తమోగుణాలు. ఆ విధంగా తమోగుణం కూడా ప్రకృతినుంచే ఉత్పన్నమయింది కాబట్టి తమోగుణాన్ని తప్పించుకోలేము.

మరి సమస్య ఏమిటి? తమోగుణం ప్రధానంగా ఉన్న మనస్సు ఉంటే వచ్చే సమస్య ఏమిటో విశ్లేషిస్తున్నాడు. నిద్రపోవటం సమస్య కాదు; కాని నిద్రపోతూనే ఉండటం సమస్య. అందరూ నిద్రపోవాలి కూడా. నిజానికి నిద్రపట్టకపోతే అది ఒక సమస్య. అందువల్ల తమోగుణాన్ని పూర్తిగా ఖండించటం లేదు, కాని దానిలోనే ఎప్పుడూ ఉండకూడదు అంటున్నాము. అలా ఉంటే ఏమిటి సమస్య?

ఈ తమోగుణం సత్త్వ, రజోగుణాలను అణగద్రొక్కివేస్తుంది. ఎప్పుడైతే సత్త్వగుణం అణగద్రొక్కబడుతుందో, అప్పుడే అతని ఆలోచనలో స్పష్టత ఉండదు. దానివల్ల అసలు ఈ జీవిత లక్ష్యమేమిటో కూడా ఆలోచించడు. ఎంతో దుర్లభమైన మనుష్యజన్మ దొరికింది అనుకోడు; కాలం విలువ తెలుసుకోడు; యౌవనం విలువ తెలుసుకోడు. అన్నిటికీ ఒకటే మూలకారణం – ఆలోచనలో స్పష్టత లేకపోవటం.

**మోహనం సర్వదేహినామ్** – సర్వదేహినామ్ అంటే తమోగుణం ఉన్నవారికందరికీ; మోహనం – మోహం ఉంటుంది. మోహనం అంటే ఇక్కడ మోహనరాగం కాదు; మోహనం అంటే మోహం, స్పష్టమైన ఆలోచన లేకపోవటం; సరియైన లక్ష్యం లేకపోవటం. ఉన్నా ఏది ముఖ్యలక్ష్యమో తెలియకపోవటం. ఏదో గుడ్డిగా జీవితాన్ని గడిపేయటం. ధనం ప్రాముఖ్యత తెలియదు; ఆరోగ్యం విలువ తెలియదు; జ్ఞానం గొప్పదనం తెలియదు. వేటిమీదా సరియైన అవగాహన ఉండదు. అందువల్ల తమోగుణం నిర్వచనం మోహనాత్మకం.

**లక్షణమ్ – మోహనాత్మకము – స్పష్టమైన ఆలోచన లేకపోవటం**

వారంతట వారికి స్పష్టమైన ఆలోచన లేకపోయినా, ఎవరైనా వారికి సహాయపడటానికి ప్రయత్నించినా, అది అందుకోరు. అందుకోకపోయినా ఫర్వాలేదు, వారు ఎంత శక్తివంతంగా ఉంటారంటే, వారి అయోమయాన్ని సలహా ఇవ్వటానికి వచ్చిన వ్యక్తికి విజయవంతంగా అందజేస్తారు. అందువల్ల అలాంటివారి విషయంలో మనమేమీ చెయ్యలేము. చేతులెత్తి భగవంతుణ్ణి ప్రార్థించటం తప్ప.

మామూలుగా ఈ మోహం చిన్నపిల్లల్లో ఉంటుంది. వారు చదువును నిర్లక్ష్యం చేస్తారు. బాగా చదివి వృద్ధిలోకి రావాలని ఆ వయస్సులో తెలియదు, ఇంకొకరు చెపితే వినరు. తల్లులు బెంగ పెట్టేసుకుంటారు. 'ఆడపిల్లలు చక్కగా చదువుకుని పి. హెచ్. డీ. లు చేసేస్తున్నారు, మా అబ్బాయేమో పదవ తరగతి కూడా గట్టెక్కేలా లేదు. ఇలా అయితే అతనికి చదువు అబ్బుతుందా, మంచి ఉద్యోగం వస్తుందా, మంచి సంబంధం వస్తుందా?' అని వాపోతుంటారు. చిన్నపిల్లలకు ఆలోచనలో స్పష్టత లేకపోయినా ఫర్వాలేదు. ఈ తమోగుణాన్ని పెద్దల్లో కూడా చూస్తాము. అక్కడ వస్తుంది సమస్య.

ఈ తమోగుణం ఒక వ్యక్తిని ఎలా బంధిస్తుంది?

**ప్రమాదాలస్యనిద్రాభిః తన్నిబధ్నాతి** – ప్రమాద అంటే నిర్లక్ష్యం; మానవ శరీరాన్ని సద్వినియోగం చేయని నిర్లక్ష్యం.

**లబ్ధ్వా కథంచిత్ నరజన్మ దుర్లభమ్**

మనిషిజన్మ పొందటం చాలా కష్టం. అందులోనూ ఇలాంటి వైదిక సంప్రదాయంలో పుట్టటం ఇంకా అరుదైన అవకాశం. వేదం మనిషికి దిశానిర్దేశం చేస్తుంది; అటువంటి అద్భుతమైన అవకాశాన్ని వదులుకుంటున్నాడు తమోగుణం ఉన్నవ్యక్తి. ఈ జన్మ కాకపోతే వచ్చే జన్మలో చూసుకుందాంలే అనటానికి వీలులేదు. ఎందుకంటే వచ్చే జన్మలో మనిషిగా పుడతాడో, ఇంకా హీనజన్మ పొందుతాడో తెలియదు. ఈ మాటలు జ్ఞానమార్గానికి వచ్చిన మీకు వర్తించవు. మీరు మోక్షాన్ని పొందారు. ఇవి తమోగుణం ఉన్న వ్యక్తిని ఉద్దేశించి చెప్పబడినవి.

ప్రమాద అంటే మనకు తెలిసిన ప్రమాదం కాదు; ప్రమాదం అంటే నిర్లక్ష్యం; పట్టించుకోకపోవటం; ఆలస్యం అంటే బద్ధకం; నిద్రాభిః అంటే నిద్ర మొదలైనవి. అందువల్ల ఈ వ్యక్తి ఎప్పుడూ నిద్రపోతూనో, నిద్రమత్తులోనో ఉంటాడు. అతనికి ఈ రెండు అవస్థలే తెలుసు. జాగ్రదావస్థ అని ఇంకొక అవస్థ ఉందనే తెలియదు. అయితే మంచినిద్రలో ఉంటాడు; లేదా నిద్రమత్తుతో జోగుతూ ఉంటాడు.

అటువంటి వ్యక్తికి ధ్యానం ఎన్నడూ సూచించకూడదు. అతనికి ధ్యానం గురించి చెబితే, హాయిగా కూర్చునే నిద్రపోతాడు. అందువల్ల తమోగుణం ప్రధానంగా ఉన్నవ్యక్తికి కర్మ చెయ్యమని చెప్పాలి.

తమోగుణం కూడా ఈ వ్యక్తిని బంధిస్తుంది. ఈ వ్యక్తి ఇటు పుణ్యమూ పొందడు, అటు పాపమూ పొందడు. ఆ విధంగా చూస్తే తమోగుణం కలిగివుండటం కూడా మంచిదే. అతనికి పుణ్యపాపాలు అంటవు. ఎందుకు అంటవు? ఏదైనా కర్మ చేస్తేనే కదా పుణ్యమైనా, పాపమైనా అంటటానికి. పుణ్యపాపాలు కర్మఫలాలు. ఈ జన్మలో చేసిన కర్మలకు ఫలితంగా ఆగామిఫలం వస్తుంది. అది పుణ్యమైనా కావచ్చు, పాపమైనా కావచ్చు. ఇతనికి ఏదీ అంటదు నిజమే కాని దాన్ని తలుచుకుని మురిసిపోకూడదు. ఎందుకు? అదేమైనా ఘనకార్యమా మురిసిపోవటానికి. జంతువులు కూడా కర్మలు చెయ్యవు కాబట్టి వాటికి కూడా పుణ్యపాపాలు అంటవు. అందువల్ల ఒకవ్యక్తి నాకు పుణ్యపాపాలు లేవు అంటే అతను జంతువులా జీవించాడని అర్థం. అందువల్ల బంధన ప్రకారం ప్రమాదసంగము.

| | | |
|---|---|---|
| **లక్షణమ్** | **– మోహనాత్మకము** | **– స్పష్టమైన ఆలోచన లేకపోవటం** |
| **బంధన ప్రకారః** | **– ప్రమాదసంగము** | **– నిర్లక్ష్యం, బద్ధకం, నిద్రలకు లోనవటం** |

శ్లో. 9 **సత్త్వం సుఖే సంజయతి రజః కర్మణి భారత ।**
**జ్ఞానమావృత్య తు తమః ప్రమాదే సంజయత్యుత ॥**
సత్త్వమ్, సుఖే, సంజయతి, రజః, కర్మణి, భారత,
జ్ఞానమ్, ఆవృత్య, తు, తమః, ప్రమాదే, సంజయతి, ఉత ॥

| | | | |
|---|---|---|---|
| భారత! | = ఓ అర్జునా! | (సంజయతి) | = నిమగ్నమొనర్చును |
| సత్త్వమ్ | = సత్త్వగుణము జీవుని | తమః, తు | = అలాగే తమోగుణమయితే |
| సుఖే | = సుఖమునందు | జ్ఞానమ్ | = జ్ఞానమును |
| సంజయతి | = నిమగ్నము చేయును | ఆవృత్య | = కప్పివేసి |
| రజః | = రజోగుణము | ప్రమాదే, ఉత | = నిర్లక్ష్యంలో |
| కర్మణి | = కర్మయందు | సంజయతి | = ముంచివేయును |

**హే భారత! సత్త్వమ్ (దేహినామ్) సుఖే సఞ్జయతి, రజః కర్మణి,**
**ఉత తమః తు జ్ఞానమ్ ఆవృత్య ప్రమాదే సఞ్జయతి ॥**

తా: ఓ అర్జునా! సత్త్వగుణము (జీవుని) సుఖమునందు నిమగ్నము చేయును. రజోగుణము కర్మయందు నిమగ్నమొనర్చును. అలాగే తమోగుణమయితే జ్ఞానమును కప్పివేసి నిర్లక్ష్యంలో ముంచివేయును.

ఈ శ్లోకంలో కృష్ణపరమాత్మ బంధన ప్రకారం గురించి మళ్ళీ చెబుతున్నాడు. మూడు గుణాలు ఏ విధంగా బంధిస్తాయో మళ్ళీ టూకీగా చెబుతున్నాడు. మూడు గుణాలు వాటి పద్ధతిలో అవి కొన్నిటిమీద బంధకత్వం ఏర్పరుస్తాయి. అవి లేనిదే ఉండలేని పరిస్థితిని తీసుకువస్తాయి. దాన్ని **సంగత్వం** అంటారు. ఏమిటా మూడు బంధాలు?

**సత్త్వం సుఖే సంజయతి** – సత్త్వగుణం ప్రశాంతత కోరుకుంటుంది. తను విద్యను అభ్యసించటానికి అనువైన పరిసరాలను కోరుకుంటాడు. సుఖం అంటే ప్రశాంతత, ఏకాంతం, ఒంటరితనం కోరుకుంటాడు. నిశ్శబ్దాన్ని కోరుకోవటం కూడా ఒక విధమైన బంధమే. అందువల్ల ఇతని బంధకత్వాన్ని సుఖసంగం అంటారు.

**రజః కర్మణి భారత** – రజోగుణం కర్మసంగం ఏర్పరుస్తుంది అర్జునా అంటున్నాడు కృష్ణపరమాత్మ. రజోగుణం ఉన్న వ్యక్తి కర్మతో బంధం పెంచుకుంటాడు. కర్మ చెయ్యటంవల్ల సమస్య లేదు; కర్మకు బానిస అయితే వస్తుంది సమస్య. అలాగే నిశ్శబ్దాన్ని అనుభవిస్తే సమస్య లేదు; నిశ్శబ్దంతో బంధకత్వం పెంచుకుంటే వస్తుంది సమస్య. ఇది దేనికైనా వర్తిస్తుంది. ధ్యానం చేస్తే అద్భుతం కాని, ధ్యానంతో బంధకత్వం పెంచుకుంటే వస్తుంది సమస్య. నిజానికి, వేదాంతం ఎంతమేరకు వెళుతుందంటే శాస్త్రంతో బంధం పెంచుకోవటం కూడా బంధకత్వం కిందికే వస్తుంది అంటుంది. ఇది వినగానే అయితే నేను శాస్త్రం నేర్చుకోవటం మానేస్తానని అనేయకండి. ఇంకా మీరు శాస్త్రంమీద కాని, గురువుమీద కాని శ్రద్ధే పూర్తిగా ఏర్పరచుకోలేదు. అలాంటప్పుడు బంధానికి ఆస్కారం ఏది?

వేదాంతం అక్కడితో ఆగదు. భగవంతునితో అనుబంధం కూడా బంధకత్వమే అంటుంది. అది ఎందుకు అందో సరిగ్గా అర్థం చేసుకోవాలి. మనం ఏకరూపభక్తినుంచి అనేకరూపభక్తికి; అనేకరూపభక్తినుంచి అరూపభక్తికి ఎదగాలి కాబట్టి అంటుంది. ఇప్పుడు మనం అంతదూరం వెళ్ళనవసరం లేదు. ఇక్కడ కృష్ణపరమాత్మ చెబుతున్నది అర్థం చేసుకుంటే చాలు. కృష్ణపరమాత్మ ఏమంటున్నాడు? కర్మ చేస్తే తప్పులేదు కాని కర్మకు బానిస అవకండి అంటున్నాడు.

**తమః ప్రమాదే సంజయత్యుత** – తమోగుణం ప్రమాదసంగం ఏర్పరుస్తుంది అంటున్నాడు కృష్ణపరమాత్మ. ప్రమాద అంటే నిర్లక్ష్యం, అశ్రద్ధ అని చూశాము. ఇటువంటి వ్యక్తికి ఏదైనా పనిచెబితే, అతను దాన్ని మనస్ఫూర్తిగా చెయ్యడు. శ్రద్ధ పెట్టి చెయ్యడు కాబట్టి అనేక తప్పులు దొర్లుతాయి. వాటిని మనం సరిదిద్దుతూ ఉండాలి. అతను నిద్రసంగం, ప్రమాదసంగం ఏర్పరచుకుంటాడు.

**జ్ఞానమావృత్య** – అతనిలో స్పష్టమైన ఆలోచన ఉండదు. అందువల్ల ఏ పనినీ బాధ్యతగా చెయ్యడు. అతనికేదైనా పని అప్పజెప్పినా, అతని వెనకే మనం ఉండి చూసుకోవాలి. దాని బదులు మనం చేసుకోవటం సుఖం.

ఈ విధంగా మూడు గుణాలలో ఏ గుణం ఉన్నా మనిషిని కట్టివేస్తుంది. సత్త్వగుణం ఉన్నవ్యక్తి ఒంటరితనం కోరుకుంటాడు; అంటే నలుగురికీ దూరంగా ఉండాలనుకుంటాడు; అంటే అనుబంధాలు తగ్గించుకోవాలనుకుంటాడు. అంటే నిశ్శబ్దానికి బానిస అవుతాడు.

రజోగుణం ఉన్నవ్యక్తికి అనేక పరికరాలు కావాలి; బయటకు వెళ్ళాలి; పనులు చేసేందుకు అనువైన వాతావరణం ఉండాలి. అవి లేకపోతే ఒడ్డునపడ్డ చేపలా గిలగిలలాడిపోతాడు. అంటే ఒకవ్యక్తి నిశ్శబ్ద వాతావరణం లేకపోతే బాధపడతాడు; ఇంకొకవ్యక్తి నిశ్శబ్దంగా ఉంటే బాధపడతాడు. కాని వేదాంతం మోక్షం అంటే నిశ్శబ్దం ఉన్నా, లేకపోయినా బాధపడని మానసిక స్థాయికి ఎదగటం అంటుంది. అటువంటి మనస్సు అటు నిశ్శబ్దానికీ కట్టుపడదు; ఇటు సందడికీ కట్టుపడదు.

తమోగుణం ఉన్నవ్యక్తికి నిశ్శబ్దమూ అవసరంలేదు, శబ్దమూ అవసరంలేదు. అసలు అతనికి ఏంకావాలో తెలియను కూడా తెలియదు. చీకటిలో తడుముకుంటున్నాడు అతను. అసలు నిర్ణయం తీసుకోవటమే ఇష్టం ఉండదు. నిర్లక్ష్యం, అశ్రద్ధ, అస్పష్టత అతన్ని ఆవరిస్తాయి.

ఒక్కముక్కలో చెప్పాలంటే సత్త్వగుణం సుఖసంగం ఏర్పరిస్తే, రజోగుణం కర్మసంగం ఏర్పరిస్తే, తమోగుణం ప్రమాదసంగం ఏర్పరస్తుంది.

శ్లో. 10 **రజస్తమశ్చాభిభూయ సత్త్వం భవతి భారత ।**
**రజఃసత్త్వం తమశ్చైవ తమః సత్త్వం రజస్తథా ॥**
రజః, తమః, చ, అభిభూయ, సత్త్వమ్, భవతి, భారత,
రజః, సత్త్వమ్, తమః, చ, ఏవ, తమః, సత్త్వమ్, రజః, తథా ॥

| | | | |
|---|---|---|---|
| భారత! | = ఓ అర్జునా! | తమః | = తమోగుణము అణచివేసి |
| రజః | = రజోగుణము ఇంకా | రజః | = రజోగుణము వృద్ధి చెందును |
| తమశ్చ | = తమోగుణము | తథా, ఏవ | = అలాగే |
| అభిభూయ | = అణచివేసి | సత్త్వమ్ | = సత్త్వగుణమును |
| సత్త్వమ్ | = సత్త్వగుణము వృద్ధి చెందును | రజశ్చ | = ఇంకా రజోగుణమును అణచివేసి |
| సత్త్వమ్ | = సత్త్వగుణమును | | |
| చ | = ఇంకా | తమః, భవతి | = తమోగుణము వృద్ధి చెందును |

**హే భారత! సత్త్వమ్, రజః తమః ఏవ అభిభూయ (స్వయం) భవతి; చ రజః, సత్త్వమ్ తమః చ (అభిభూయ స్వయం భవతి); తథా తమః, సత్త్వమ్ రజః (అభిభూయ స్వయం భవతి) ॥**

తా: ఓ అర్జునా! రజోగుణము ఇంకా, తమోగుణము అణచివేసి సత్త్వగుణము వృద్ధి చెందును. సత్త్వగుణమును ఇంకా తమోగుణమును అణచివేసి రజోగుణము వృద్ధి చెందును. అలాగే సత్త్వగుణమును ఇంకా రజోగుణమును అణచివేసి తమోగుణము వృద్ధి చెందును.

కృష్ణపరమాత్మ విశ్లేషించాల్సిన మూడవ అంశం **లింగమ్**. కాని ఆ అంశంలోకి వెళ్ళేముందు కృష్ణపరమాత్మ కొంచెం పక్కకివెళ్ళి, ఒక విషయాన్ని చెప్పబోతున్నాడు ఈ శ్లోకంలో. దీన్ని **ప్రసంగవశాత్** అంటారు. అది చూడటానికి వేరే అంశంగా అనిపించినా అది కావాలనే చెబుతున్నాడు కృష్ణపరమాత్మ. ఎందుకంటే ఇది చాలా ముఖ్యమైన అంశం. ఏమిటా అంశం? కృష్ణపరమాత్మ చెప్పదలుచుకున్న అంశం ఇది. ఈ జగత్తు సృష్టి మొత్తం ప్రకృతినుంచి వచ్చింది కాబట్టి, ప్రకృతిలో మూడు గుణాలు ఉన్నాయి కాబట్టి, జగత్తులోని చెట్టుకు, జంతువుకు, మనిషికి – అన్నిటికీ ఈ మూడుగుణాలు వస్తాయి. అంటే జడవస్తువునుంచి, అత్యంత గొప్ప మేధావి అయిన మనిషి దాకా అన్నిటిలోనూ, అందరిలోనూ ఈ మూడుగుణాలు ఉంటాయి.

అన్నింటిలోనూ ఈ మూడుగుణాలు ఉన్నా కూడా, అన్నింటిలోనూ ఒకే నిష్పత్తిలో ఉండవు ఇవి. సృష్టికి ముందు అంటే ప్రళయ అవస్థలో ఈ మూడుగుణాలు సమాన నిష్పత్తిలో ఉంటాయి. సాంఖ్యదార్శనికుల పరిభాషలో చెప్పాలంటే –

**గుణానాం సామ్య అవస్థా ప్రళయః**

కాని ఎప్పుడైతే సృష్టికార్యం మొదలవుతుందో, అప్పుడే వాటి నిష్పత్తి మారుతుంది. దాన్ని **విషమ అవస్థ** అంటారు. అంటే మూడూ సమాననిష్పత్తిలో లేకపోవటం.

ఒక జడవస్తువును తీసుకుంటే, అందులో కూడా మూడు గుణాలు ఉంటాయి. కాని అందులో తమోగుణం ఎక్కువగా ఉంటుంది. అందువల్ల ఆ జడవస్తువుకు నేర్చుకోవాలనే తపన ఉండదు. ఒక గోడకు వేదాంతం నేర్చుకోవాలనే తపన ఉండదు. అంటే అందులో సత్త్వగుణం లేనట్లా? ఉంది. కాకపోతే తమోగుణం ఎక్కువగా ఉంది. అందువల్ల సత్త్వగుణ లక్షణమైన నేర్చుకోవాలనే తపనా ఉండదు; రజోగుణ లక్షణమైన కర్మ చెయ్యాలనే తపనా ఉండదు. అదృష్టం! గోడకు ఏదైనా కర్మ చెయ్యాలనే తపన ఉంటే, అంటే సరదాగా అలా సంధ్యాసమయంలో వ్యాహ్యాళికి వెళ్ళాలి అనిపిస్తే, ఎలా ఉంటుంది? అదృష్టం బాగుండి, అలా చెయ్యదు అది. దానికి బద్ధకం, నిర్లక్ష్యం ఉంది. దానికి విద్యమీద కాని, పనిమీద కాని శ్రద్ధ లేదు. అందువల్ల దానిలో తమోగుణం ఎక్కువ ఉందని అర్థమవుతున్నది.

వృక్షసంపదకు వస్తే, వృక్షాల్లో కొంతమేరకు సత్త్వ, రజోగుణాలు ఉన్నాయి. చూడటానికి అవి కూడా జడవస్తువుగా ఉన్నట్టు ఉన్నా, వాటిల్లో సత్త్వ, రజోగుణాలు కూడా కొంతమేరకు ఉన్నాయి. అవి వాతావరణంలో మార్పుకు స్పందిస్తాయి. అలాంటి మార్పు జడవస్తువులో చూడము. అంటే కొంతమేరకు సత్త్వ, రజోగుణాలు ఉన్నాయి కాని చాలా ఎక్కువగా లేవు. అంటే నేర్చుకునే తపన లేదు. ఒకవేళ వృక్షాల్లో కూడా నేర్చుకునే తపన ఉంటే, వాటికి కూడా స్కూళ్ళు, కాలేజీలు ఏర్పాటు చెయ్యాల్సివచ్చేది. అంతేకాదు, వృక్షాల్లో రజోగుణం కూడా తక్కువే ఉంది. అవి ఎదిగేటందుకు తోడ్పడేటంత రజోగుణం ఉంది కాని, కర్మ చెయ్యాలనే తపన ఉండేటంత రజోగుణం లేదు. అలా ఉండివుంటే, అవి కూడా మనం రోడ్డుమీద కారులో హడావుడిగా దూసుకువెళ్తుంటే, రోడ్డు పక్కనుంచి సరదాగా వ్యాహ్యాళికి రోడ్డుమధ్యకు వచ్చివుండేవి. అదృష్టం! వాటికా శక్తి లేదు. అంటే జడవస్తువుకు కేవలం తమోగుణం ఎక్కువగా ఉంటే, వృక్షాలకు తమోగుణంతో పాటు కొంతమేరకు సత్త్వ, రజోగుణాలు కూడా పనిచేస్తాయి.

ఇప్పుడు పశుసంపదకు వస్తే, వాటిలో వృక్షసంపదకన్నా సత్త్వ, రజోగుణాలు మరికొంచెం ఎక్కువగా ఉంటాయి. వృక్షాలను స్థావరాలు అంటారు; అంటే అవి కదలకుండా స్థిరంగా ఒకచోటే ఉంటాయి; కాని జంతువులను జంగమాలు అంటారు. అవి కదులుతాయి. వాటిలో నేర్చుకునే అంశం కూడా కొంతమేరకు ఉంటుంది. వాటికి కొన్ని విషయాలను నేర్చుకుని అర్థం చేసుకునే సామర్థ్యం ఉంటుంది. అంతేకాదు, అవి బాగా తిరుగుతాయి కాబట్టి వాటిల్లో రజోగుణం ఎక్కువే ఉంటుంది. అంటే జంతువుల్లో, వృక్షాల్లోకన్నా ఎక్కువమేరకు సత్త్వ, రజోగుణాలు ఉంటాయి.

ఇక మనుష్యుల విషయానికి వస్తే, మనుష్యుల్లో ఈ సత్త్వ, రజోగుణాలు అన్నింటిలోకన్నా ఎక్కువగా ఉంటాయి. అందువల్లనే మనుష్యులకు అనేక స్కూళ్ళు, కాలేజీలు ఉన్నాయి; అనేక పుస్తకాలు, గ్రంథాలు ఉన్నాయి. మనుష్యులు నేర్చుకునే విద్య కూడా అనంతం. ఎన్నో విషయాలు నేర్చుకుంటూ వచ్చి, ఎంతో ఉన్నతమైన బ్రహ్మవిద్యను కూడా పొందుతారు. ఇదంతా సత్త్వగుణం మహిమ. రజోగుణం కూడా ఎక్కువే ఉంటుంది మనుష్యుల్లో. మనుష్యులు చేసే కర్మలు కూడా అనంతం. అంటే జడవస్తువులు, వృక్షాలు, పశువులకన్నా మనిషిలో సత్త్వ, రజోగుణాలు అధికస్థాయిలో ఉంటాయి. ఒక్కొక్క వస్తువులో వాటి స్థాయీభేదాలు ఎలా పెరుగుతూ వచ్చాయో చూశాము.

ఇక్కడ కృష్ణపరమాత్మ చెప్పదలుచుకున్నది మనుష్యజాతిలోనే ఈ మూడుగుణాలు ఉండే స్థాయిలో భేదాలు ఉన్నాయనే విషయం. కొంతమందిలో సత్త్వగుణం ఎక్కువగా ఉంటే, మరికొంతమందిలో రజోగుణం ఎక్కువగా ఉంటే, ఇంకా కొంతమందిలో తమోగుణం ఎక్కువగా ఉంటుంది. వారిలో ఉండే ఈ గుణాల ప్రాధాన్యతనుబట్టి వారి స్వభావం ఉంటుంది; వారి ప్రవర్తన ఉంటుంది.

ఒకవ్యక్తి సాత్త్విక పురుషుడని అంటే అతనిలో సత్త్వగుణం ఎక్కువగా ఉన్నట్టు అర్థం. అంటే అతనిలో రజోగుణం కాని, తమోగుణం కాని అసలు లేవని కాదు అర్థం; అవి తక్కువగా ఉన్నాయని అర్థం. అలాగే రాజసిక పురుషునిలో రజోగుణం ఎక్కువగానూ, సత్త్వ, తమోగుణాలు తక్కువగానూ ఉంటాయి. అదే సూత్రం ప్రకారం తామసిక పురుషునిలో తమోగుణం ఎక్కువగానూ, సత్త్వ, రజోగుణాలు తక్కువగానూ ఉంటాయి. ఈ గుణాల నిష్పత్తుల ప్రకారం కొందరి ప్రవర్తన జంతువుల లక్షణాలను పోలివుంటే, కొందరిది వృక్షాల లక్షణాలను పోలివుంటే, మరికొందరిది బండరాళ్ళను పోలివుంటుంది. అంటే మనుష్యులు కూడా జంతువులు, వృక్షాలు, బండరాళ్ళలా ప్రవర్తించగలరు.

ఈ నేపథ్యంతో ఈ శ్లోకాన్ని చూద్దాము.

**సత్త్వం భవతి** – సత్త్వగుణం ఉంటుంది అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఎవరిలో? సాత్త్విక పురుషునిలో అని మనం కలుపుకోవాలి. సత్త్వగుణం ఎలా ఉంటుంది?

**రజస్తమశ్చాభిభూయ** – రజ, తమోగుణాలను అధిగమించి మరీ ఉంటుంది సత్త్వగుణం.

**భారత** – ఓ అర్జునా అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**రజః (భవతి)** – భవతి మనం కలుపుకోవాలి. రాజసిక పురుషునిలో అని కూడా కలుపుకోవాలి. అంటే దీని అర్థం రాజసిక పురుషునిలో రజోగుణం ఉంటుంది. ఎలా ఉంటుంది?

**తమః సత్త్వం (అభిభూయ)** – అభిభూయ మనం కలుపుకోవాలి. రాజసిక పురుషునిలో తమోగుణం, సత్త్వగణాలను అధిగమించి రజోగుణం ఎక్కువగా ఉంటుంది.

**తమః (భవతి)** – తామసిక పురుషునిలో తమోగుణం ఉంటుంది. ఎలా ఉంటుంది?

**రజసత్త్వమ్ (అభిభూయ)** – మళ్ళీ అభిభూయ కలుపుకోవాలి. తామసిక పురుషునిలో రజ, సత్త్వగుణాలను అధిగమించి మరీ తమోగుణం ఎక్కువగా ఉంటుంది.

ఇవి వింటే మీకు ఒక ముఖ్యమైన సందేహం కలగవచ్చు. ఇప్పుడు మనుష్యులను మూడురకాలుగా విభజించాము కదా! అంటే సాత్త్వికపురుషుడు, రాజసికపురుషుడు, తామసికపురుషుడని మూడురకాలుగా చెప్పాము కదా! ఈ స్వభావాలు ఇంక మారవా? ఈ నిష్పత్తిని మార్చే అవకాశం లేదా? ఎందుకంటే అలా మార్చలేము అంటే మన పని ముగిసిపోయినట్లే; మనం నిస్సహాయులం అయిపోతాము; మన భవిష్యత్తు ముందే నిశ్చయించబడినట్టు అవుతుంది.

కాని, అదృష్టవశాత్తూ ఈ స్వభావాన్ని మార్చుకోవచ్చు అంటున్నది శాస్త్రం. కాకపోతే, ఎంత వేగంగా మారతాడు, ఎంతమేరకు మారతాడనే విషయం మాత్రం మనిషి, మనిషికీ మారుతుంది. కాని మార్పు తథ్యం. నిజానికి ఆధ్యాత్మిక సాధనలు ఉన్నవే అందుకు. ఈ మార్పును తీసుకురావటానికే. పైగా ఒక్కొక్క స్థాయిలో, ఒక్కొక్క సాధనకు, ఒక్కొక్క గుణం ఎక్కువగా ఉండాలి.

నిజానికి మనమంతా పుట్టుకతో, తమోగుణంతో పుట్టామంటుంది శాస్త్రం. ఎందుకు? ఎందుకంటే చిన్నపిల్లలుగా ఉన్న వయస్సులో మనం పదిగంటల పైనే పడుకున్నాము. మధ్యలో లేచినా, ఆకలివేసి లేచాము. అంటే ఆ వయస్సులో తినటం, పడుకోవటం తప్ప వేరే పనిలేదు. అందువల్ల మనం జన్మతః తమోగుణ ప్రధానులం. అందువల్ల శాస్త్రం ముందు తమోగుణంనుంచి రజోగుణానికి ఎదగండి అంటుంది. మనం అనేక కర్మలు చెయ్యాలంటుంది శాస్త్రం. అందువల్లనే మనకు జ్ఞానకాండ వేదపూర్వభాగంలో రాదు. వేదపూర్వభాగం కర్మప్రధానం. దాన్ని కర్మకాండ అని కూడా అంటారు. అందులో అనేక యజ్ఞయాగాదులను నిర్దేశిస్తుంది. అంటే మన జీవితం కర్మలతో మొదలవ్వాలి.

మళ్ళీ ఈ కర్మకాండను రెండుగా విభజించవచ్చు. ఎందుకంటే రజోగుణమే రెండురకాలుగా ఉంటుంది. రాజసికపురుషుడు అంటే రజోగుణం ఎక్కువగా ఉండి, సత్త్వ, తమోగుణాలు తక్కువగా ఉన్న పురుషుడని చూశాము. అందులో మళ్ళీ రజోగుణం తర్వాత తమోగుణం, సత్త్వగుణంకన్నా ఎక్కువ ఉండవచ్చు లేదా రజోగుణం తర్వాత సత్త్వగుణం ఎక్కువగా ఉండి, తమోగుణం తక్కువగా ఉండవచ్చు.

ముందు మొదటిరకం చూద్దాము. అంటే ఒకవ్యక్తిలో 70% రజోగుణం, 20% తమోగుణం, 10% సత్త్వగుణం ఉందనుకుందాము. అటువంటి వ్యక్తిని మన వీలుకోసం '**రతస**' అందాము. అంటే అతనిలో ఈ గుణాలు ఉండే వరుసక్రమం రజోగుణం, తమోగుణం, సత్త్వగుణం. ఇలాంటివ్యక్తి అంటే రజోగుణంతో పాటు తమోగుణం ఉన్న వ్యక్తి కర్మలు చేసినా కూడా తన స్వార్థం కోసమే చేస్తాడు. అంటే తనకున్న కోరికలు తీరటంకోసం చేస్తాడు. వేదం, మరేం ఫర్వాలేదు అంటుంది. ముందు మీ కోరికలు తీర్చుకోవటానికే కర్మలు చేసినా ఫర్వాలేదు అంటుంది. అర్థకామాల వెంట పరుగులు తీయండి అంటుంది. నిజానికి కర్మకాండే అనేక ప్రలోభాలను చూపిస్తుంది. ఏ కోరిక తీర్చుకోవాలనుకున్నా కూడా దానికొక పూజో లేదా యజ్ఞమో చెబుతుంది. ఇల్లు, టీవీ, కంప్యూటర్, కారు – ఏవి కొనుక్కోవాలని ఉన్నా, ఏ ఆనందం పొందాలని ఉన్నా అవి కొనుక్కోండి, అనుభవించండి.

సమాజానికి సేవ చెయ్యటానికి తీరికలేదు అన్నా ఫర్వాలేదు, ముందు మీ కోరికలు తీర్చుకోండి అంటుంది. ఇటువంటి వ్యక్తి చేసే కర్మలను **స్వార్థపూరిత కర్మలు** అంటారు. (వర్ణాశ్రమ ధర్మాలలో వివరంగా చూశాము).

ఇలా స్వార్థపూరిత కర్మలు కొన్నాళ్ళు చేశాక, నెమ్మదిగా దానికన్నా పైకి ఎదగండి అంటుంది శాస్త్రం. ఇంతకుముందు రజోగుణం తర్వాత తమోగుణం ఉంటే, ఇప్పుడు దాని స్థానంలోకి సత్త్వగుణాన్ని తీసుకువచ్చి, తమోగుణాన్ని వెనక్కి పంపండి అంటుంది. అంటే ఇంతకుముందు '**రతస**'గా ఉంటే ఇప్పుడు '**రసత**'గా మారాలి. అంటే మీరు చేసే కర్మలు స్వార్థపూరిత కర్మలనుంచి స్వార్థరహిత కర్మలకు మారాలి. అంటే స్వప్రయోజనాలను వదులుకుని, సమాజశ్రేయస్సుకోసం పాటుపడాలి. ఇంకోవిధంగా చెప్పాలంటే సకామకర్మనుంచి నిష్కామకర్మ స్థాయికి ఎదగాలి. **రతస** స్థాయినుంచి **రసత** స్థాయికి ఎదగాలి.

ఈ విధంగా సకామకర్మనుంచి నిష్కామకర్మ చెయ్యటం మొదలుపెట్టాక, ఉపాసనకాండకు రావాలి. కర్మకాండలో ఉన్నంతవరకూ బాహ్యాముఖంగా ఉంటారు; బాహ్యాముఖంగా ఉంటే జ్ఞానయోగానికి రావటానికి తీరికే ఉండదు. అందువల్ల కొన్నాళ్ళు కర్మచేసి, మనస్సు పరిపక్వత చెందాక, రజోగుణంనుంచి సత్త్వగుణం స్థాయికి ఎదగాలి. అయితే వెంటనే, రజోగుణం వదిలి ఇప్పుడే వచ్చేస్తాను అనకూడదు. కర్మ ఇచ్చే ప్రయోజనాన్ని ఉపాసన ఇవ్వలేదు; ఉపాసన ఇచ్చే ప్రయోజనాన్ని కర్మ ఇవ్వలేదు. అందువల్ల ప్రతి ఒక్కటీ ముఖ్యమే.

ఉపాసనయోగానికి వస్తే **రసత** స్థాయినుంచి '**సరత**' స్థాయికి ఎదుగుతారు. సరత అంటే సత్త్వగుణం ఎక్కువగా, రజోగుణం దానికన్నా తక్కువగా, తమోగుణం ఇంకా తక్కువగా ఉంటుందని అర్థం. రజోగుణం అసలు లేకపోతే, మీరు గీతాబోధకు వెళ్ళరు కూడా. అలాగే తమోగుణం కూడా ఉండాలి. అంటే ఇప్పుడు మూడు దశలను దాటారు. మీ ప్రయాణం ఎలా ఉండాలి? అసలేమీ పని చెయ్యకపోయే స్థాయినుంచి, స్వార్థపూరిత కర్మలు చేసే స్థాయికి రావాలి; తర్వాత స్వార్థపూరిత కర్మలు చేసే స్థాయినుంచి స్వార్థరహిత కర్మలు చేసే స్థాయికి ఎదగాలి. స్వార్థరహిత కర్మలు చేసే స్థాయినుంచి ఆత్మజ్ఞానం పొందేస్థాయికి ఎదగాలి. నిజానికి నాలుగు ఆశ్రమాలు నిర్దేశించేది కూడా అదే. బ్రహ్మచర్య ఆశ్రమం, గృహస్థాశ్రమం, వానప్రస్థ ఆశ్రమం, సన్యాస ఆశ్రమం – ఇవన్నీ కూడా ఒక ఆశ్రమంనుంచి ఇంకొక ఆశ్రమానికి క్రమేపీ ఎదగటానికి దోహదం చేస్తాయి.

ఈ దశలన్నీ దాటుకుంటే చివరికి ఆత్మజ్ఞానం పొందటానికి వస్తారు. ఇవి దాటి జ్ఞానానికి వస్తే, మీకు ఏ బాధా ఉండదు. ఎందుకంటే సమాజానికి చెయ్యాల్సిన సేవ ఏదో చేసేసే వచ్చారు. సమాజానికి మీవంతు సేవ చేశారు, బయటకు వచ్చారు. అలా చెయ్యకుండా, సరాసరి జ్ఞానానికి వస్తే, సమాజానికి ఏమీ చెయ్యలేదనే అపరాధభావన మిగిలిపోతుంది. అందువల్ల కర్మ చేసి, జ్ఞానానికి రావాలి.

మన ప్రవర్తనను మార్చుకోగలమా? మీ ఈ ప్రశ్నకు జవాబు వచ్చిందా? తమోగుణం ప్రధానంగా ఉండే దశనుంచి, రజోగుణం ప్రధానంగా ఉండే దశకు రావాలి. అందులోనూ రజోగుణాన్ని వెన్నంటి తమోగుణం ఉండే దశనుంచి రజోగుణాన్ని వెన్నంటి సత్త్వగుణం ఉండే స్థాయికి రావాలి. దాని తర్వాత సత్త్వగుణం ప్రధానంగా ఉండే స్థాయికి ఎదగాలి. నాలుగవ అధ్యాయం పరిభాషలో చెప్పాలంటే గుణబ్రాహ్మణుడు అవ్వాలి. గుణశూద్రునినుంచి గుణవైశ్యస్థాయికి ఎదిగి, ఆ తర్వాత గుణక్షత్రియ స్థాయికి ఎదిగి, చివరికి గుణబ్రాహ్మణుని

స్థాయికి ఎదగాలి. గుణశూద్రుడు బద్ధకంగా ఉంటాడు; గుణవైశ్యుడు స్వార్థపూరిత కర్మలు చేస్తాడు; గుణక్షత్రియుడు నిస్వార్థకర్మలు చేస్తాడు; గుణబ్రాహ్మణుడు అంతర్ముఖుడై జ్ఞానాభ్యాసంలో ఉంటాడు.

ఇదంతా చదివాక, మీరు ఏ స్థాయిలో ఉన్నారో విశ్లేషించుకుని, ఆ స్థాయినుంచి ఎదగటానికి అవసరమైన సాధన చేసి, చివరికి ఆత్మజ్ఞానం పొందేస్థాయికి రావాలి. ఈ విశ్లేషణ మిమ్మల్ని మీరు విశ్లేషించుకునేందుకే ఉపయోగించుకోవాలి కాని, ఇతరులను విశ్లేషించటానికి కాదు సుమా! ఇతరుల స్వభావాలను పరిశీలించి, నిర్ణయించే హక్కు మీకు లేదు. ఆ హక్కు ఎప్పుడు ఉంటుంది అంటే, వారు మీ పిల్లలు అయి, వారు మీ సంరక్షణలో ఉండి, వారిని మీరు వృద్ధిలోకి తీసుకురావాల్సి వస్తే ఉంటుంది. లేకపోతే మీ సంగతి మీరు విశ్లేషించుకోండి. ఏ గుణం మీలో ప్రధానంగా ఉంది? మీరు గుణశూద్రులుగా ఉన్నారా లేక గుణబ్రాహ్మణులుగా ఉన్నారా? ఎలా తెలుస్తుంది? కృష్ణపరమాత్మ నేనే చెబుతాను ఎలా తెలుసుకోవాలో అంటున్నాడు. మూడవ అంశం అయిన గుణలింగము చూడబోతున్నాము రాబోయే శ్లోకాల్లో.

శ్లో. 11 **సర్వద్వారేషు దేహేఽస్మిన్ ప్రకాశ ఉపజాయతే।**
**జ్ఞానం యదా తదా విద్యాత్ వివృద్ధం సత్త్వమిత్యుత ॥**
సర్వద్వారేషు, దేహే, అస్మిన్, ప్రకాశః, ఉపజాయతే,
జ్ఞానమ్, యదా, తదా, విద్యాత్, వివృద్ధమ్, సత్త్వమ్, ఇతి, ఉత ॥

| | | | |
|---|---|---|---|
| యదా | = ఏ సమయమందు | ఉపజాయతే | = ఏర్పడునో |
| అస్మిన్, దేహే | = ఈ దేహమందు | తదా | = అప్పుడు |
| సర్వద్వారేషు | = ఇంద్రియములందును | సత్త్వమ్, ఉత | = సత్త్వగుణము |
| ప్రకాశః | = చురుకుదనము, సామర్థ్యము | వివృద్ధమ్, ఇతి | = వృద్ధి చెందినదని |
| జ్ఞానమ్ | = వివేకశక్తి | విద్యాత్ | = తెలిసికొనవలెను |

**ఉత యదా అస్మిన్ దేహే సర్వ-ద్వారేషు ప్రకాశః జ్ఞానమ్ (చ)**
**ఉపజాయతే, తదా సత్త్వమ్ వివృద్ధమ్ ఇతి విద్యాత్ ॥**

తా: ఏ సమయమందు, ఈ దేహమందు, ఇంద్రియములందును చురుకుదనము, సామర్థ్యము ఇంకా వివేకశక్తి ఏర్పడునో అప్పుడు సత్త్వగుణము వృద్ధి చెందినదని తెలిసికొనవలెను.

సి) **లింగమ్ – శ్లోకాలు 11-13**

ఈ శ్లోకాల్లో లింగము గురించి చూస్తాము. లింగము అంటే ఏ గుణం ఎక్కువగా ఉందో అది తెలుసుకునే మార్గము.

**అస్మిన్ దేహే సర్వద్వారేషు ప్రకాశ ఉపజాయతే** – ఈ శరీరంలో అన్ని జ్ఞానేంద్రియాలూ ప్రకాశవంతంగా ఉంటాయి అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఇక్కడ ద్వారేషు అంటే ఇంద్రియాలందు. స్థూలశరీరంలో కనబడే

ఇంద్రియాలని గోళకాలు అంటుంది శాస్త్రం. ఈ గోళకాలు ప్రపంచాన్ని ఐదుగా విభజించి శబ్దస్పర్శరూపరసగంధాలద్వారా అనుభవాలను లేదా జ్ఞానాన్ని అందజేస్తాయి. ఉదాహరణకు శబ్దజ్ఞానం శ్రోత్రింద్రియంద్వారా కలుగుతుంది; రూపజ్ఞానం చక్షురింద్రియంద్వారా కలుగుతుంది.

సర్వద్వారేషు అంటే ఈ ఐదు ఇంద్రియాలు ప్రకాశః అంటే ప్రకాశవంతంగా ఉన్నాయి. అంటే ఈ ఐదు ఇంద్రియాలు పూర్తిగా, చురుకుగా పనిచేస్తాయి. అంటే అవి చూసిన విషయాల జ్ఞానాన్ని త్వరగా పొందుతాయి. ఇవి జ్ఞానాన్ని కలుగజేస్తాయి కాబట్టి జ్ఞానేంద్రియాలు అంటారు వీటిని. ఎప్పుడైతే వీటి గ్రహింపుశక్తి చురుకుగా ఉంటుందో, అప్పుడే ఆ వ్యక్తి జ్ఞానం కూడా నిముషాలమీద పొందుతాడు.

ఈ ఇంద్రియాల చురుకుదనాన్ని పరీక్షించుకోవటానికి అనేక ఆటలు ఆడిస్తారు. మీముందు షుమారు ఇరవై వస్తువులను పెట్టి, వాటిని రెండు నిముషాలసేపు దీక్షగా చూడమంటారు. ఆ తర్వాత మిమ్మల్ని పక్క గదిలోకి వెళ్ళి ఆ చూసిన వస్తువుల పేర్లు రాయమంటారు. మీరు ఎన్ని ఎక్కువ వస్తువుల పేర్లు రాస్తే మీ ఇంద్రియాలు అంత చురుకుగా పనిచేస్తున్నట్టు అర్థం. లేదా ఒక బొమ్మని రెండు నిముషాల సేపు చూసి, దాన్ని వెయ్యమంటారు.

అదీకాదంటే, ఇప్పుడు మీరు భగవద్గీతను చదువుతున్నారు కాబట్టి, మీకు నచ్చిన ఒక శ్లోకం తీసుకుని అది ఎన్నిసార్లు చదివితే మీరు చూడకుండా చెప్పగలరో ప్రయత్నించి చూడండి. మీరు ఎంత తక్కువసార్లు చూసి, చూడకుండా చెప్పగలిగితే, మీ ఇంద్రియాలు అంత చురుకుగా ఉన్నట్టు అర్థం. కొంతమందికి రెండుసార్లు చదివితే వస్తే, కొంతమందికి పదిసార్లు నేర్చుకుంటేనే కాని రాదు. వెంటనే నేర్చుకోగలిగితే, మీలో సత్త్వగుణం ప్రధానంగా ఉన్నట్టు అర్థం.

కొంతమందికి ఇలా ఇంద్రియాలు చురుగ్గా ఒక్కరోజే పనిచేస్తాయి. అది చాలదు. ఎప్పుడూ చురుకుగా పనిచెయ్యాలి.

ప్రకాశ ఉపజాయితే – అలా చురుకుదనం, సామర్థ్యం ఉన్న అతను సత్త్వ ప్రధానంగా ఉంటాడు. అందువల్ల అతని ఇంద్రియాలు ప్రకాశవంతంగా ఉంటాయి.

గీతాబోధకు వెళుతున్న సత్సంగ సభ్యులకు స్వామీజీ ఏదైనా కార్యక్రమం గురించి చెప్పాల్సివస్తే, ఆయన ఎన్ని జాగ్రత్తలు తీసుకుని ఆ విషయాన్ని ఎంత స్పష్టంగా చెప్పినా అందరూ అన్ని విషయాలూ వెంటనే గ్రహించరు. కొంతమంది ఆ కార్యక్రమం తారీఖు సరిగ్గా వినరు; కొంతమంది ఏ నెలో వినరు; కొంతమంది ఎక్కడో వినరు; కొంతమంది ఏ సమయంలోనో వినరు. ఒక్కోసారి ఒక నెలముందే ఫలానా కార్యక్రమం అని ఊహించుకుని, ఆ స్థలానికి వెళ్ళినవారూ లేకపోలేదు. అంటే దీని ఉద్దేశ్యం అందరూ ఒక్కలా జ్ఞానం పొందరు.

**జ్ఞానం యదా తదా విద్యాత్** – ఇంద్రియాలు ఎంత పదునుగా ఉంటే, అంత ఎక్కువ జ్ఞానం పొందవచ్చు అని తెలుసుకోవాలి.

**సత్త్వమ్ ఉత వివృద్ధమ్ ఇతి** – అటువంటి వ్యక్తిలో సత్త్వగుణం వృద్ధి చెందినదని తెలుసుకోవాలి.

**లింగమ్ – జ్ఞానవృద్ధి – జ్ఞానం వృద్ధి చెందుతుంది.**

శ్లో. 12 **లోభః ప్రవృత్తిరారంభః కర్మణామశమః స్పృహా ।**
**రజస్యేతాని జాయంతే వివృద్ధే భరతర్షభ ॥**

లోభః, ప్రవృత్తి, ఆరంభః, కర్మణామ్, అశమః, స్పృహా,
రజసి, ఏతాని, జాయంతే, వివృద్ధే, భరతర్షభ ॥

| | | | |
|---|---|---|---|
| భరతర్షభ | = ఓ అర్జునా! | కర్మణామ్, ఆరంభః | = స్వార్థబుద్ధితో కర్మలయొక్క ఆరంభము |
| రజసి | = రజోగుణము | అశమః | = అశాంతి ఇంకా |
| వివృద్ధే | = వృద్ధియైనప్పుడు | స్పృహా | = అహంకారం |
| లోభః, ప్రవృత్తిః | = లోభము, ఇంకా ప్రాపంచిక కర్మలందు ప్రవృత్తి | ఏతాని | = ఈ మొదలగునవి అన్నియును |
| | | జాయంతే | = కలుగును |

**హే భరతర్షభ! లోభః, ప్రవృత్తిః, కర్మణామ్ ఆరమ్భః,**
**అశమః, స్పృహా ఏతాని (చిహ్నాని) రజసి వివృద్ధే (సతి) జాయన్తే ॥**

తా: ఓ అర్జునా! రజోగుణము వృద్ధియైనప్పుడు లోభము, ఇంకా ప్రాపంచిక కర్మలందు ప్రవృత్తి స్వార్థబుద్ధితో కర్మలయొక్క ఆరంభము, అశాంతి ఇంకా అహంకారం ఈ మొదలగునవి అన్నియును కలుగును.

ఇప్పుడు రజోగుణం ప్రధానంగా ఉన్న వ్యక్తిని తెలుసుకోవటం ఎలాగో చెబుతున్నాడు కృష్ణపరమాత్మ.

**లోభః** – లోభం అంటే అత్యాశ. ఇతనికి ప్రాపంచిక విజయం పొందాలనే తపన ఎక్కువగా ఉంటుంది. నిజానికి దేశంయొక్క అభివృద్ధికి ఇలాంటి రజోగుణం ఉన్నవారు ఎంతో తోడ్పడతారు. అందువల్ల రజోగుణం ఉన్నవారిని విమర్శించటం లేదు. అలాంటివారు చేసే కర్మలే దేశాన్ని ఆర్థికంగా ఉన్నతస్థాయికి తీసుకువెళతాయి.

వివేకానందస్వామి మన దేశానికి సత్త్వగుణం ఉన్నవారికన్నా, రజోగుణం ఉన్నవారు ఎక్కువ కావాలి అంటారు. ఎందుకంటే తమోగుణం ఎక్కువగా ఉన్నవారిని ధ్యానం చెయ్యమని చెపితే, వారు చక్కగా నిద్రపోతారు; అందువల్ల తమోగుణం ఉన్నవారిని ఉత్సాహపరుస్తున్నారు లేవండి, లేచిరండి, మీ గమ్యం చేరేవరకూ ఆగకండి అని వారిని ప్రేరేపిస్తున్నారు. అందువల్ల తమోగుణంనుంచి రజోగుణానికి రావాలి నిజమే కాని, మళ్ళీ అక్కడే ఆగిపోకూడదు. మళ్ళీ ఇంకా పైకి ఎదగాలి. అంటే సత్త్వగుణాన్ని పెంపొందించుకోవాలి.

కాని ఇప్పుడు మనం రజోగుణం ప్రధానంగా ఉన్న వ్యక్తిని చూస్తున్నాము. తొంభయ్యోపడిలో పడినా కూడా, ఇటువంటి వ్యక్తి పనులు చేస్తూ, దాని గురించిన ప్రణాళికలు వేస్తూనే ఉంటాడు. అంటే అతను ప్రవృత్తిమార్గంలో వెళతాడు. ఇటువంటి వ్యక్తిని వర్కహాలిక్ అంటారు. అంటే ఆల్కహాల్ లేకుండా ఉండలేరు కొంతమంది. వారిని ఆల్కహాలిక్స్ అంటారు. అలాగే అసలు పని చెయ్యకుండా ఒక్కక్షణం కుదురుగా కూర్చోలేరు కొంతమంది. వారిని వర్కహాలిక్స్ అంటారు. వారు ఎంతసేపూ పనిలో సతమతమవుతూ ఉండటంవల్ల వారికి నిత్యకర్మలు చేసే తీరిక

లేదు; జపం చేసే తీరిక లేదు; పూజ చేసే తీరిక లేదు; గీతాబోధకు వెళ్ళే తీరిక లేదు; జీవితంలో అతని అంతిమలక్ష్యంగా ఏది ఉండాలో ఆలోచించుకునే తీరిక అసలే లేదు.

**కర్మణామశమః** – అనేక కర్మలు చేసేయాలనే వీర ఉత్సాహం ఉంటుంది; అవన్నీ చెయ్యగలడో లేదో ఆలోచించడు. కర్మణామశమః ని కర్మణామ్ (ఆరంభః) + అశమః గా విడదీయాలి. అనేక కర్మలను ప్రారంభిస్తాడు. అందువల్ల అతని మనస్సు అశమ అంటే అశాంతి పాలవుతుంది. అటువంటి వ్యక్తితో వచ్చిన చిక్కేమిటంటే, అతను ఒక్కక్షణం కుదురుగా కూర్చోడు, ఇతరులను కూడా కూర్చోనివ్వడు. 'పందిరి రాటకు కూడా పనిచెబుతాడు,' అంటారు. అంతేకాదు, ఎదుటివారు అతని వేగాన్ని కూడా అందుకోవాలని ఆశిస్తాడు. ఎవరినైనా అతను పిలిస్తే, ఆ వ్యక్తి అతని కళ్ళముందు భగవంతునిలా వెంటనే ప్రత్యక్షమవ్వాలి; లేకపోతే ఎదురుగా ఉన్న వస్తువులను విసిరికొడతాడు.

సాధారణంగా రజోగుణం ఎక్కువ ఉన్నవారు చాలా అసహనంగా ఉంటారు; చిన్నదానికే చికాకు పడిపోతారు; ఎదుటి మనిషి నీడను కూడా భరించలేరు; అందువల్ల సమాజంలో చెడ్డపేరు తెచ్చుకుంటారు కూడా. వారు వారి రంగంలో ప్రథమశ్రేణిలో ఉంటారు; విజయానికి మారుపేరులా ఉంటారు నిజమే; కాని వారితో పని చేసినవారికి తెలుస్తుంది వారితో వేగటం ఎంత కష్టమో. వారికి ఎప్పుడూ ముక్కుమీదే ఉంటుంది కోపం. వారితో కత్తిసాము చేసినట్టుగా ఉంటుంది. అందువల్ల వారు విజేతలు అయినా కూడా అశాంతిగా, చిరాకుగా ఉంటారు.

**స్పృహా** – అటువంటి వారికి విజయగర్వం తలకెక్కుతుంది. చాలా అహంకారం ఉంటుంది. అందరూ వారిని మెచ్చుకోవాలి అనుకుంటారు. కొంతమంది కష్టపడి పైకొస్తారు; అది కూడా స్వయంకృషితో. ఆ విజయం కీర్తించాల్సిందే, నిజమే, కాని వారు ఆ విజయాన్ని కలలో కూడా మర్చిపోరు. అటువంటి వారిని భరించటం ఇంకా కష్టం. ఎందుకంటే వారు ఎంతసేపూ వారి విజయగర్వాన్ని ప్రదర్శిస్తుంటారు. 'నేను కిందనుంచి పైకి వచ్చాను. నా స్వయంకృషితో, ఎవరి సహాయమూ లేకుండా, ఇవాళ కోటీశ్వరుణ్ణి అయ్యాను,' అంటారు. అది నిజమే కావచ్చు; కాని అది ఒకసారి కాదు, వందసార్లు కాదు, వేలసార్లు మనకే చెబుతారు; మనం శ్రద్ధగా వినకపోతే మండిపడతారు. అందువల్ల స్పృహా అంటే అహంకారం ఉంటుంది.

అంత విజయం సాధించినప్పుడు, ఆ విజయాన్ని ఎవరూ గుర్తించకపోయినా కూడా వారు చాలా కలత చెందుతారు. ఎంత ఎక్కువ ఆశిస్తే, అంత లోతైన ఆశాభంగం కలుగుతుంది. అందువల్ల నిరాశానిస్పృహలు ఎక్కువవుతాయి. నిముషంలో విరుచుకుపడతారు; అన్నీ విసిరికొడతారు. ఏక్షణంలోనైనా విస్ఫోటనం చెందే అగ్నిపర్వతంలాంటివారు వారు. వారి గురించి సానుకూలంగా చెప్పాలంటే వారు గొప్ప విజేతలు; ప్రతికూలంగా చెప్పాలంటే అగ్నిపర్వతం.

**రజసి వివృద్ధే (సతి)** – రజోగుణం ఎక్కువ ఉన్నవారిలో ఈ కోపం, చిరాకు, అశాంతిలాంటి లక్షణాలు కూడా ఎక్కువవుతాయి. రాజసిక ప్రవృత్తి ఉన్నవారు భగవంతుణ్ణి కూడా వదలరట. వారి ప్రార్థన ఇలా ఉంటుందని ఎవరో చమత్కరించారు. 'ఓ దేవా! నాకు నీ దర్శనభాగ్యం కలుగజేయి. ఇప్పుడే, ఈ క్షణమే. లేకపోతే నేను ఊరుకోను.'

**లింగమ్ – కర్మవృద్ధి – కర్మలు ఎక్కువ చేస్తాడు.**

శ్లో. 13 **అప్రకాశోఽ ప్రవృత్తిశ్చ ప్రమాదో మోహ ఏవ చ ।**
**తమస్యేతాని జాయంతే వివృద్ధే కురునందన ॥**
అప్రకాశః, అప్రవృత్తిః, చ, ప్రమాదః, మోహః, ఏవ, చ,
తమసి, ఏతాని, జాయంతే, వివృద్ధే, కురునందన ॥

| | | | |
|---|---|---|---|
| కురునందన | = ఓ అర్జునా! | చ | = అలాగే |
| తమసి | = తమోగుణము | ప్రమాదః | = వ్యర్థచేష్టలు |
| వివృద్ధే | = వృద్ధియగుచున్నప్పుడు | చ | = ఇంకా |
| అప్రకాశః | = జ్ఞానేంద్రియాలు చురుకుగా లేకుండుట | మోహః | = నిద్రాది మోహవృత్తులు |
| | | ఏతాని, ఏవ | = మొదలగునవి |
| అప్రవృత్తిః | = కర్తవ్య కర్మలందు విముఖత | జాయంతే | = కలుగును |

**హే కురు–నన్దన! అప్రకాశః, అప్రవృత్తిః చ, ప్రమాదః చ,**
**మోహః ఏవ ఏతాని (చిహ్నాని) తమసి వివృద్ధే (సతి) జాయన్తే ॥**

తా: ఓ అర్జునా! తమోగుణము వృద్ధియగుచున్నప్పుడు జ్ఞానేంద్రియాలు చురుకుగా లేకుండుట, కర్తవ్య కర్మలందు విముఖత అలాగే వ్యర్థచేష్టలు ఇంకా నిద్రాది మోహవృత్తులు మొదలగునవి కలుగును.

ఇప్పుడు తమోగుణం ప్రధానంగా ఉన్నవ్యక్తిని తెలుసుకోవటం ఎలాగో చెబుతున్నాడు కృష్ణపరమాత్మ. తమోగుణం ఎక్కువగా ఉన్నవ్యక్తి విషయంలో అతనికీ ఏమీ సమస్యలేదు, తోటివారికీ సమస్యలేదు. ఎందుకు? అతను అసలు సరిగ్గా జీవిస్తేనే కదా.

**అప్రకాశః** – అతని జ్ఞానేంద్రియాలు చురుకుగా పనిచేయవు. సత్త్వగుణం ప్రధానంగా ఉన్నవ్యక్తి జ్ఞానేంద్రియాలను ప్రకాశః అన్నాడు కృష్ణపరమాత్మ. ఇప్పుడు అప్రకాశః అంటున్నాడు. అతనికి దేనిమీదా శ్రద్ధ ఉండదు. వార్తాపత్రికలో ఒక చిన్న వార్తను చదవాలన్నా కూడా అతను దానిమీద ఏకాగ్రత చూపలేడు. పదిసార్లు చదివితేనే కాని అది అతని మెదడుకెక్కదు. అంటే జ్ఞానేంద్రియాలు చురుకుగా ఉండవు.

**అప్రవృత్తిః చ** – పోనీ కర్మేంద్రియాలు పనిచేస్తాయా అంటే అవికూడా చురుకుగా పనిచేయవు. రజోగుణం ఉన్న వ్యక్తికి కర్మేంద్రియాలు చురుకుగా ఉన్నాయని చెప్పటానికి ప్రవృత్తిః అన్నాడు కృష్ణపరమాత్మ. ఇప్పుడు అప్రవృత్తిః అంటున్నాడు.

అప్రకాశః అంటే సత్త్వగుణం లేదనీ; అప్రవృత్తిః అంటే రజోగుణం లేదనీ సూచిస్తున్నాడు. అంటే ఈ రెండు గుణాలనీ అధిగమించి, తమోగుణం ఉంటుంది ఇటువంటి వ్యక్తిలో.

ఇటువంటి వ్యక్తి సాధారణంగా ఏపనీ చెయ్యడు. ఒకవేళ బలవంతంగా చేయించినా, అతన్ని వెన్నంటే ఉండి అన్నీ చూసుకోవాలి. ఒకవేళ పూర్తిగా అతనిమీదే భారం వేసి వదిలేస్తే, అతను శ్రద్ధగా చెయ్యడు. అందువల్ల పని

కూడా సక్రమంగా అవదు. మళ్ళీ మీరు ఆ పనిని చేసుకోవాలి. దానిబదులు అతనికి చెప్పకుండా, నేనే చేసుకోవటం ఉత్తమం అనే భావనకు వస్తారు.

**ప్రమాదః** – ప్రమాదః అంటే నిర్లక్ష్యం అని చూశాము. నిర్లక్ష్యంవల్ల అనేక తప్పులు చేస్తాడు.

**మోహః** – మోహం కప్పివేస్తుంది అతన్ని. అసలు తనకు ఏంకావాలో జీవితకాలంలో తెలుసుకోలేడు. 'నీ లక్ష్యం ఏమిటి?' అని మీరు ప్రశ్నిస్తే కప్పదాటు వ్యవహారం చూపిస్తాడు. అంటే ఆ విషయాన్ని దాటేయటానికి చూస్తాడు. ఎందుకు? అతనికి తెలిస్తే కదా, మీకు చెప్పటానికి. పోనీ అతనికి సహాయం చేద్దామని మీరు ఏదైనా మార్గం చూపించబోయినా, అతను వినటానికి సిద్ధంగా ఉండడు. తనకు తెలియదు, ఇంకొకరు చెపితే వినడు. అతనంతట అతను తన జీవితంలో ఏం సాధించాలో నిర్ణయించుకోలేడు, మీరు చెప్పింది వినటానికి ఇష్టపడడు. అలా మందకొడిగా మిగిలిపోతాడు. అటువంటి వ్యక్తిని మీరు ఏమీ చెయ్యలేరు; అతని గురించి చేతులెత్తి భగవంతుణ్ణి ప్రార్థించటం తప్ప. మోహః అంటే బద్ధకం, నీరసం.

**తమసి వివృద్ధే (సతి)** – తమోగుణం ఎక్కువగా ఉన్నవ్యక్తిలో ఈ నిర్లక్ష్యం, మోహం, బద్ధకం లక్షణాలు బయట పడతాయి. ఇంతవరకూ చూసిన లక్షణాలనుబట్టి, ఏ వ్యక్తిలో ఏ గుణం ఎక్కువగా ఉందో నిర్ణయించవచ్చు.

**లింగమ్ – ప్రమాదావృద్ధి – నిర్లక్ష్యం ఎక్కువగా ఉంటుంది.**

గుణాలను ఎందుకు ఇలా లక్షణాలనుబట్టి తెలుసుకోవాలి? అవి ప్రత్యక్షప్రమాణానికి అందవు కాబట్టి, వాటికి తర్కాన్ని ఉపయోగించాలి. ప్రత్యక్షప్రమాణం అందనిచోట అనుమాన ప్రమాణం వాడతాము. అనుమాన ప్రమాణానికి శాస్త్రం ఇచ్చే ఉదాహరణ –

**పర్వతః అగ్నిమాన్ ధూమవత్వాత్ యథా మహానసే**

కొండమీద అగ్ని ఉన్నట్టు మనకు ప్రత్యక్షంగా తెలియటంలేదు. అంటే కంటికి అగ్ని కనబడటం లేదు. కాని కొండ దగ్గర పొగ కనిపిస్తోంది. మనకు ఎక్కడ పొగ ఉంటే అక్కడ అగ్ని ఉంటుందని ప్రత్యక్షప్రమాణం ద్వారా తెలుసు. దీన్ని వ్యాప్తివాక్యం అంటారు.

**యత్ర యత్ర ధూమః తత్ర తత్ర అగ్నిః**

ఎక్కడ పొగ ఉంటే, అక్కడ అగ్ని ఉంటుంది. ఈ నియమాన్ని అనుసరించి, కొండమీద పొగ ఉంది కాబట్టి, ఎక్కడ పొగ ఉంటే అక్కడ అగ్ని ఉంటుంది కాబట్టి, కొండమీద అగ్ని ఉందని తార్కికంగా నిరూపిస్తాము. దానికి దృష్టాంతం లేదా ఉదాహరణ పూర్వకాలపు వంటిల్లు (మహానసే). దీన్ని అనుమాన ప్రమాణం అంటారు.

అదే విధంగా ఏ గుణం ఒకవ్యక్తిలో ఎక్కువగా ఉంటే, మన కంటితో చూడలేము కాబట్టి, అనుమాన ప్రమాణం వాడతాము. **గుణ అప్రతక్ష్యత్వాత్.** ఇలా లక్షణాలను తెలుసుకోవటాన్ని **లింగము** అంటారు.

ఈ లక్షణాలనుబట్టి మీలో ఏ గుణం ఎక్కువగా ఉందో గ్రహించుకుని, దాన్నించి సత్త్వగుణానికి ఎదగటానికి కావాల్సిన సాధన ఏమిటో తెలుసుకుని, దానిని చెయ్యాలి. మిమ్మల్ని ఎదుటివారితో పోల్చుకోకండి. ఎదుటివారితో

పోల్చుకుంటే బాధ తప్ప ఏమీ మిగలదు. మిమ్మల్ని మీరు బేరీజు వేసుకుని, ఎక్కడ ఉన్నారో తెలుసుకుని, దాన్ని దాటి రండి.

తమోగుణం విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే తమోగుణం ఉన్నవ్యక్తి కూడా వేదాంతం మాట్లాడతాడు. అంటే వైరాగ్యం గురించి చెబుతాడు. అతనికి నిజంగా వైరాగ్యం కలిగికాదు, తన ఉన్నత స్థాయి గురించి తెలుసుకుని కాదు, అలా మాట్లాడేది. కేవలం బద్ధకంవల్ల. అసలు ఏపనీ చెయ్యడు; ఒకవేళ పొరపాటుగా చేసినా, దాన్ని చాలా అశ్రద్ధగా చేస్తాడు; అంటే అడ్డదిడ్డంగా చేస్తాడు ఆ పనిని.

తమోగుణం ఉన్న వ్యక్తి సరాసరి సత్త్వగుణానికి ఎదగలేడు. అందువల్ల అటువంటి వ్యక్తికి వేదాంతం బోధించకూడదు; ఉపాసన నిర్దేశించకూడదు; కర్మ మాత్రమే చెయ్యమని ఆదేశించాలి. కర్మలో కూడా అటువంటి వ్యక్తి వెంటనే నిష్కామకర్మకు రాలేడు; అతనికి సకామకర్మనే నిర్దేశించాలి. దాన్నించి నెమ్మదిగా నిష్కామకర్మకూ, ఆపైన ఉపాసనకూ ఎదిగితే, అప్పుడు అతనికి వేదాంత విచారణ సూచించవచ్చు.

ఇక్కడితో కృష్ణపరమాత్మ చర్చిస్తున్న మూడవ అంశం అయిన **లింగము** అయిపోయింది.

శ్లో. 14 **యదా సత్త్వే ప్రవృద్ధే తు ప్రలయం యాతి దేహభృత్ ।**
**తదోత్తమవిదాం లోకాన్ అమలాన్ ప్రతిపద్యతే ॥**
యదా, సత్త్వే, ప్రవృద్ధే, తు, ప్రలయమ్, యాతి, దేహభృత్,
తదా, ఉత్తమవిదామ్, లోకాన్, అమలాన్, ప్రతిపద్యతే ॥

| | | | |
|---|---|---|---|
| యదా | = ఎప్పుడు | తదా, తు | = అటువంటి సమయంలో |
| దేహభృత్ | = మనుష్యుడు | ఉత్తమవిదామ్ | = ఉత్తమకర్మల నాచరించువారు వెళ్ళు |
| సత్త్వే, ప్రవృద్ధే | = సత్త్వగుణము వృద్ధి చెందుచున్నప్పుడు | అమలాన్ | = నిర్మలములైన |
| | | లోకాన్ | = స్వర్గాది దివ్యలోకములను |
| ప్రలయమ్, యాతి | = మృతి చెందునో | ప్రతిపద్యతే | = పొందును |

**యదా తు సత్త్వే ప్రవృద్ధే (సతి) దేహ-భృత్ ప్రలయమ్ యాతి**
**తదా ఉత్తమ-విదామ్ అమలాన్ లోకాన్ ప్రతిపద్యతే ॥**

తా: ఎప్పుడు మనుష్యుడు సత్త్వగుణము వృద్ధి చెందుచున్నప్పుడు మృతి చెందునో అటువంటి సమయంలో ఉత్తమకర్మల నాచరించువారు వెళ్ళు నిర్మలములైన స్వర్గాది దివ్యలోకములను పొందును.

### డి) గతి - శ్లోకాలు 14, 15

ఈ శ్లోకాల్లో కృష్ణపరమాత్మ నాలుగవ అంశం అయిన గతి గురించి చెప్పబోతున్నాడు. గతి అంటే ప్రయాణం; మరణానంతర ప్రయాణం. ఏయే గుణం ప్రధానంగా ఉంటే, ఏయే లోకాలకు మరణానంతరం ఒక జీవియొక్క జీవాత్మ ప్రయాణం చేస్తుందో వివరించబోతున్నాడు కృష్ణపరమాత్మ.

ఈ శ్లోకంలో సత్త్వగతి గురించి మాట్లాడుతున్నాడు కృష్ణపరమాత్మ. సత్త్వగతిః అంటే **సత్త్వప్రధాన పురుషస్య మరణాంతర గతిః** – సత్త్వగుణం ప్రధానంగా ఉన్నవ్యక్తి యొక్క జీవాత్మ మరణం తర్వాత ఏ లోకానికి వెళుతుంది?

**యదా సత్త్వే ప్రవృద్ధే తు ప్రలయం యాతి దేహభృత్** – దేహభృత్ అంటే జీవాత్మ; ప్రలయం అంటే ఇక్కడ మరణం. మామూలుగా ప్రళయం అంటే సృష్టి మొత్తం లయమవటం. కాని ఇక్కడ ఒకవ్యక్తి మరణించినప్పుడు; యదా సత్త్వే ప్రవృద్ధే – అతనిలో సత్త్వగుణం ప్రధానంగా ఉంటే; అతని పరిస్థితి ఏమిటో వర్ణిస్తున్నాడు కృష్ణపరమాత్మ.

ఈ వ్యక్తి జ్ఞానా? అజ్ఞానా? జ్ఞాని ఏ లోకానికి ప్రయాణిస్తాడు? గుర్తుంచుకోండి, జ్ఞానికి అసలు ప్రయాణం లేదు. అతను జీవించివుండగానే జీవన్ముక్తి పొందుతాడనీ, మరణించాక విదేహముక్తి పొందుతాడనీ చూశాము. అంటే అతను సర్వవ్యాపకమైన బ్రహ్మలో లయమవుతాడు.

**న తస్య ప్రాణా ఉత్క్రామంతి బ్రహ్మైవ సన్ బ్రహ్మాప్యేతి** – బృహదారణ్యకం

అతని ప్రాణాలు అంటే అతని సూక్ష్మశరీరం ప్రయాణం చెయ్యదు. స్థూలశరీరం స్థూలప్రపంచంలోనూ, సూక్ష్మశరీరం సూక్ష్మప్రపంచంలోనూ కలిసిపోతాయి. దానికి ఉదాహరణ ఐస్‌బర్గ్. ఎలాగైతే ఐస్‌బర్గ్ కరిగి సముద్రం నీళ్ళతో కలిసిపోతుందో, అలాగే జ్ఞాని జీవాత్మ సమష్టిప్రపంచంలో కలిసిపోతుంది. **అతనికి ప్రయాణం లేదు.** అందువల్ల ఈ గతిః మాట్లాడేది అజ్ఞానీ జీవి గురించి. ఇప్పుడు చూస్తున్నది సత్త్వగుణప్రధాన అజ్ఞాని మరణిస్తే అతనికి ఏమవుతుంది అనే అంశం.

**అమలాన్ లోకాన్ ప్రతిపద్యతే** – సత్త్వగుణప్రధాన అజ్ఞాని ఊర్ధ్వలోకాలకు లేదా ఉన్నతలోకాలకు వెళతాడు. అమలాన్ అంటే నిర్మలమైన లోకాలు, పుణ్యలోకాలు. భూమికి పైన ఆరు పుణ్యలోకాలు ఉన్నాయి. అవి – భువర్లోక, సువర్లోక, మహర్లోక, జనలోక, తపోలోక, సత్యలోకాలు. వీటిల్లో దేనికైనా వెళతాడు. అవి పుణ్యలోకాలు కాబట్టి, ఆ వ్యక్తి ఆనందం స్థాయి కూడా చాలా ఎక్కువే ఉంటుంది.

**తే యే శతం మనుష్యా ఆనందాః స ఏకో మనుష్యగంధర్వాణామ్ ఆనందః** – తైత్తిరీయం

మనిషి ఆనందంకన్నా మనుష్యగంధర్వుల ఆనందం వందరెట్లు ఉంటుందని తైత్తిరీయోపనిషత్తులో వస్తుంది. ఆనందమీమాంసలో అలా ఆనందం స్థాయి పెంచుకుంటూపోయి, హిరణ్యగర్భ ఆనందం మనిషి ఆనందానికి $10^{20}$ రెట్లు ఉంటుందని వర్ణిస్తుంది. అలా పైలోకాలకి వెళ్ళినకొద్దీ అక్కడ ఇంకా ఎక్కువ ఆనందం, ఇంకా మంచి పరిసరాలు, ఇంకా ఎక్కువ సుఖాలూ ఉంటాయి. అందువల్ల అమలాన్ పదం వేశాడు కృష్ణపరమాత్మ. అవి పుణ్యప్రధాన లోకాలు. ఎవరు పొందుతారు ఈ లోకాలను?

**ఉత్తమవిదామ్ (లోకాన్)** – గొప్ప ఉపాసకులు పొందుతారు ఈ లోకాలను. ఉత్తమ + విదాః – ఉత్తమ అంటే ఈశ్వరుడు; విదాః అంటే ఉపాసకుడు; ఉత్తమవిదాః అంటే ఈశ్వర ఉపాసకుడు. ఎటువంటి ఈశ్వరునికి ఉపాసన? సగుణ ఈశ్వరునికా, నిర్గుణ ఈశ్వరునికా? ఈ సాధకుడు అజ్ఞాని అని ముందే చూశాము. అజ్ఞానికి

నిర్గుణ ఈశ్వరజ్ఞానం ఉండదు. కాబట్టి ఇతను సగుణ ఉపాసనచేసే అజ్ఞాని. ఇటువంటి ఉపాసకుడు పుణ్యలోకాలకు వెళతాడు. ఒక్కముక్కలో చెప్పాలంటే ఊర్ధ్వలోకాలకు వెళతాడు.

**గతి – ఊర్ధ్వగతి – ఊర్ధ్వలోకాలకు వెళతాడు.**

శ్లో. 15 **రజసి ప్రలయం గత్వా కర్మసంగిషు జాయతే ।**
**తథా ప్రలీనస్తమసి మూఢయోనిషు జాయతే ॥**
రజసి, ప్రలయమ్, గత్వా, కర్మసంగిషు, జాయతే,
తథా, ప్రలీనః, తమసి, మూఢయోనిషు, జాయతే ॥

| | | | |
|---|---|---|---|
| రజసి | = రజోగుణము వృద్ధి చెందుచున్నప్పుడు | తథా | = అలాగే |
| | | తమసి | = తమోగుణము వృద్ధిచెందునప్పుడు |
| ప్రలయమ్, గత్వా | = మృతిచెందినవాడు | ప్రలీనః | = మరణించినవాడు |
| కర్మసంగిషు | = కర్మాసక్తులైన మనుష్యులందు | మూఢయోనిషు | = పశుపక్షికీటకాది మూఢయోనులందు |
| జాయతే | = పుట్టును | జాయతే | = పుట్టును |

**(దేహ–భృత్) రజసి ప్రలయమ్ గత్వా కర్మ–సఙ్గిషు జాయతే ।**

**తథా (సః) తమసి ప్రలీనః మూఢ–యోనిషు జాయతే ॥**

తా: రజోగుణము వృద్ధి చెందుచున్నప్పుడు మృతిచెందినవాడు కర్మాసక్తులైన మనుష్యులందు పుట్టును. అలాగే తమోగుణము వృద్ధిచెందునప్పుడు మరణించినవాడు పశుపక్షికీటకాది మూఢయోనులందు పుట్టును.

ఈ శ్లోకంలో రజోగతి గురించి, తమోగతి గురించి మాట్లాడుతున్నాడు కృష్ణపరమాత్మ. రజోగతి అంటే రజోగుణప్రధాన పురుషుని గతి; తమోగతి అంటే తమోగుణప్రధాన పురుషుని గతి. ముందుగా రజోగుణం ఉన్న వ్యక్తి గురించి చూడబోతున్నాము.

**రజసి ప్రలయం గత్వా** – ఇక్కడ కూడా ప్రలయం అంటే మరణం; రజసి అంటే రజోగుణం ప్రధానంగా ఉన్నవ్యక్తి. గుర్తుంచుకోండి, ఇతను కూడా అజ్ఞానే. రజోగుణం ప్రధానంగా ఉన్నవ్యక్తి మరణం తర్వాత మళ్ళీ పుడతాడు.

**జాయతే** – తప్పకుండా పుడతాడు. ఎక్కడ?

**కర్మసంగిషు** – కర్మ ప్రధానంగా ఉన్నలోకంలో పుడతాడు. కర్మ ప్రధానంగా ఉన్నలోకం ఒక్క మనుష్యలోకమే అని శాస్త్రం ఘోషిస్తుంది. ఊర్ధ్వలోకాలన్నీ భోగలోకాలు. వాటిల్లో మన పుణ్యఫలాన్ని అనుభవించగలము కాని కొత్తగా పుణ్యాన్ని కాని, పాపాన్ని కాని ప్రోగుచేయలేము. అలాగే అధోలోకాలలో మన పాపక్షయం చేసుకోగలము కాని అక్కడ ఏ విధమైన కర్మలు చెయ్యలేము. అంటే పద్నాలుగు లోకాల్లో భూలోకంలో తప్ప వేరే ఏ లోకంలోను కర్మ చెయ్యలేము. అందువల్లనే మనుష్యలోకంలో పుట్టటం అంటే చాలా అపురూపమైన జన్మ అంటారు. అది చాలా కష్టం.

అందువల్ల కర్మసంగిషు అంటే కర్మలు చేసే భూలోకంలో పుడతాడు. అటు ఊర్ధ్వలోకాలకూ వెళ్ళడు, ఇటు అధోలోకాలకూ వెళ్ళడు. సత్త్వగుణం ఉన్నవ్యక్తి ఊర్ధ్వలోకాలకు వెళితే, తమోగుణం ఉన్నవ్యక్తి అధోలోకాలకు వెళతాడు. కాని రజోగుణం ఉన్నవ్యక్తి ఈ లోకంలోనే ఉంటాడు. అంటే మధ్యలోకంలో పుడతాడు. కర్మసంగిషు జాయతే అంటే మనుష్యలోకంలో పుడతాడు.

**గతి – మధ్యమగతి – మనుష్యలోకంలో పుడతాడు.**

ఇప్పుడు తమోగుణం ఉన్నవ్యక్తి గురించి చూస్తాము.

**తథాప్రలీనః** – అదేవిధంగా మరణం సంభవించిన

**తమసి** – తమోగుణం ప్రధానంగా ఉన్నవ్యక్తి

**మూఢయోనిషు జాయతే** – అతను అధోలోకాలకు వెళతాడు. అవి అతల, వితల, సుతల, రసాతల, మహాతల, తలాతల, పాతాళలోకాలు. అయితే ఈ పాతాళలోకాల్లో దేనికన్నా వెళతాడు. ఒకవేళ భూలోకంలోనే పుట్టినా ఫ్రీవిల్, బుద్ధి ఉన్న మనుష్యజన్మ పొందడు. ఏ పశుపక్ష్యాదులుగానో, క్రిమికీటకాలుగానో, వృక్షాలుగానో పుడతాడు. అందువల్ల మూఢయోని అన్నాడు కృష్ణపరమాత్మ. మూఢయోని అంటే బుద్ధిజీవి కాదని అర్థం. అందువల్లనే జంతువులు ఏ బోధకూ వెళ్ళలేవు.

**గతి – అధోగతి – మూఢయోనిలో పుడతాడు.**

ఇక్కడితో నాలుగవ అంశం అయిన గతి గురించిన వివరణ కూడా అయిపోయింది.

శ్లో. 16 **కర్మణః సుకృతస్యాహుః సాత్త్వికం నిర్మలం ఫలమ్ ।**
**రజసస్తు ఫలం దుఃఖమ్ అజ్ఞానం తమసః ఫలమ్ ॥**
కర్మణః, సుకృతస్య, ఆహుః, సాత్త్వికమ్, నిర్మలమ్, ఫలమ్,
రజసః, తు, ఫలమ్, దుఃఖమ్, అజ్ఞానమ్, తమసః ఫలమ్ ॥

| | | | |
|---|---|---|---|
| సుకృతస్య, కర్మణః | = శ్రేష్ఠమైన కర్మకు | ఫలమ్ | = ఫలము |
| సాత్త్వికమ్ | = సుఖ, జ్ఞాన, వైరాగ్యాది సాత్త్వికమైన | దుఃఖమ్ | = దుఃఖము అని |
| నిర్మలమ్, ఫలమ్ | = నిర్మలమైన ఫలము లభించునని | తమసః | = తామసకర్మకు |
| ఆహుః | = అంటారు | ఫలమ్ | = ఫలము |
| తు | = కాని | అజ్ఞానమ్ | = అజ్ఞానము అని |
| రజసః | = రాజసకర్మకు | (ఆహుః) | = అంటారు |

**సుకృతస్య కర్మణః సాత్త్వికమ్ నిర్మలమ్ ఫలమ్, రజసః ఫలమ్ తు దుఃఖమ్, తమసః (చ) ఫలమ్ అజ్ఞానమ్ (ఇతి) ఆహుః ॥**

తా: శ్రేష్ఠమైన కర్మకు సుఖ, జ్ఞాన, వైరాగ్యాది సాత్త్వికమైన నిర్మలమైన ఫలము లభించునని అంటారు. కాని రాజసకర్మకు ఫలము దుఃఖము అని, తామసకర్మకు ఫలము అజ్ఞానము అని అంటారు.

ఇ) **ఫలమ్ – శ్లోకాలు 16, 17**

ముందు రెండు శ్లోకాలు గతి గురించి మాట్లాడితే, ఈ రెండు శ్లోకాల్లోనూ ఫలం గురించి మాట్లాడబోతున్నాడు కృష్ణపరమాత్మ. గతికి, ఫలానికీ మధ్య ఉన్న సూక్ష్మభేదాన్ని మర్చిపోకూడదు. గతి అంటే మరణించాక పొందే ఫలము, ఫలం అంటే జీవించి ఉండగానే పొందే ఫలం. ఇప్పుడు ఈ మూడు గుణాల్లో ఏది ఎక్కువ ఉంటే, ఎటువంటి ఫలం పొందుతాడో వర్ణిస్తున్నాడు.

**సుకృతస్య కర్మణః ఫలమ్ సాత్త్వికమ్ ఆహుః** – ఈ వాక్యాన్ని కొంచెం మార్చుకుందాము. సుకృతస్యాహుః కర్మణః సాత్త్వికమ్ అని చదివే బదులు సాత్త్వికస్య కర్మణః ఫలం సుకృతమ్ అని మార్చుకుందాము. అంటే శ్లోకంలో ఉన్న సుకృతస్యను సుకృతమ్ చేశాము. సాత్త్వికమ్ పదాన్ని సాత్త్వికస్య చేశాము. అప్పుడు సాత్త్వికస్య కర్మణః ఫలం అని వస్తుంది.

సాత్త్విక పురుషుడు కర్మ చేస్తే, అతను చేసే కర్మలు మంచివిగా, ఉన్నతంగా ఉంటాయి. అందువల్ల వాటికి వచ్చే ఫలం కూడా మంచిదే వస్తుంది. సుకృతం అంటే పుణ్యం. అంటే ఆధ్యాత్మిక ఎదుగుదలకు తోడ్పడతాయి ఈ కర్మలు. అతనికి శాంతిని, సమతుల్యతను, నిశ్చలమనస్సును ప్రసాదిస్తాయి.

**నిర్మలమ్ (ఫలమ్)** – నిర్మలం అంటే స్వచ్ఛమైన మనస్సు ఏర్పడుతుంది. ఆందోళనలు, బెంగలు, కలతలులేని నిర్మల మనస్సు ఉంటుంది.

నిజానికి అటువంటి నిర్మల మనస్సు ఉన్నవారి సమక్షంలో ఉంటే మీకు కూడా ప్రశాంతంగా ఉంటుంది. కావాలంటే మీరే గమనించండి, కొన్ని ఇళ్ళకు వెళితే ముళ్ళమీద కూర్చున్నట్టు ఉంటుంది. ఏ క్షణంలో ఎవరేమంటారో, ఏ గొడవ రాజుకుంటుందో అని హడలిపోతూ కూర్చుంటారు. దానికి భిన్నంగా కొన్ని ఇళ్ళకు వెళితే, మీకు కూడా ప్రశాంతంగా, నిశ్చింతగా, హాయిగా ఉంటుంది. అంటే అది సాత్త్వికలక్షణం ఉన్నవ్యక్తి ఇల్లు అన్నమాట. ప్రేమ, ఆప్యాయతలు, అనుబంధాలులేని ఇల్లు కేవలం నాలుగు గోడలు ఉన్న ఆకారంగా కనిపిస్తుంది అంతే. అదే ప్రేమ, శాంతి, ఆప్యాయతలు ఉన్న ఇల్లు కేవలం ఇల్లులా కాకుండా శాంతినిలయంగా మారుతుంది. దీన్నే నిర్మలం ఫలం అంటారు.

**రజసస్తు ఫలం దుఃఖమ్** – రాజసిక గుణం ప్రధానంగా ఉన్నవ్యక్తి చాలా హుషారుగా ఉండి, చాలా పనులు చేస్తాడు నిజమే కాని అతనికి ఉన్న సమస్య ఏమిటి? అన్ని పనులు నెత్తిన వేసుకోవటంవల్ల ఆందోళన, ఒత్తిడి, కోపం, చిరాకు, అసహనం మొదలైనవి చోటుచేసుకుంటాయి. ఎక్కడ మానసిక ఆందోళన చోటు చేసుకుంటుందో అక్కడ శారీరక ఆరోగ్యమూ దెబ్బతింటుంది; మానసిక ఆరోగ్యమూ దెబ్బతింటుంది. అందువల్ల రాజసగుణం ఉన్న వ్యక్తి దుఃఖాన్ని అనుభవిస్తాడు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

ఎక్కడ కర్మ చేస్తే అక్కడ ఆందోళన, ఒత్తిడి తప్పదు. ఎక్కడ ఆందోళన, ఒత్తిడి ఉంటే అక్కడ కోపం, చిరాకు తప్పవు. ఇంట్లో ఒకరిమీద ఒకరు చిన్న కారణానికి కూడా విరుచుకుపడతారు. అందువల్ల కుటుంబసభ్యుల మధ్య ఉండాల్సిన సామరస్యభావన కొరవడుతుంది. ఇల్లు అంటే ఇటుక, సిమెంటులతో కట్టిన నాలుగుగోడలు కాదు, ఇల్లు అంటే అనుబంధం, ఆప్యాయతలతో పెనవేసుకున్న పొదరిల్లు. ఎప్పుడైతే ఈ ఆప్యాయతలు కొరవడతాయో, అప్పుడు నలుగురు కొత్తవారు ఒక చూరు కింద కలిసి ఉన్నట్టుగా ఉంటారు తప్పితే వారిమధ్య సామరస్యం ఉండదు. అందువల్ల అటువంటి ఇల్లు దుఃఖాలయం అవుతుంది. దేవాలయంగా ఉండాల్సిన ఇల్లు దుఃఖాలయం అవుతుంది.

బాహ్యంగా చూస్తే మాత్రం ఆ ఇంట్లో ఎక్కడ చూసినా ఐశ్వర్యం తాండవమాడుతుంది, ఇంటినిండా నౌకర్లు ఉంటారు, ఎప్పుడూ హడావుడిగా పరుగులు తీస్తూ ఉంటారు. ఇల్లు చూస్తే ఇంద్రభవనంలా ఉండి, ఆ ఇంట్లోని వ్యక్తులు భోగభాగ్యాలతో తులతూగుతున్నట్టుగా కనిపిస్తారు; కాని తేరిపార చూస్తే, వారి హృదయలోతులను కొలవగలిగితే ఆ ఇంట్లో ఏదో లోపం కనిపిస్తుంది. అంటే ప్రశాంతత ఉండదు. ఎంత ఐశ్వర్యం ఉండి ఏంలాభం, కావాల్సిన ప్రశాంతత లేకపోయాక అనిపిస్తుంది, అలాంటివారిని చూస్తే.

అదే సాత్త్విక పురుషులను చూడండి, వారు లౌకికంగా విజయాలు సాధించి ఉండకపోవచ్చు; పదవిలోనో, వ్యాపారంలో నిచ్చెనమెట్లు త్వరత్వరగా ఎక్కకపోయి ఉండవచ్చు కాని వారి ఇంట్లో కావాల్సినంత ప్రశాంతత, ఆనందం నెలకొని ఉంటుంది. సాత్త్వికపురుషుల ఇల్లు నిర్మలంగా ఉంటే రజోగుణం ఉన్న పురుషుల ఇంట్లో దుఃఖం తాండవమాడుతుంది. రజసస్తు (కర్మణః) ఫలం దుఃఖమ్. కర్మణః మనం కలుపుకోవాలి.

**తమసః (కర్మణః) ఫలమ్** – తామసికగుణం ఎక్కువగా ఉన్నవ్యక్తికి కలిగే ఫలం అజ్ఞానం అంటున్నాడు కృష్ణపరమాత్మ. అతనికి దుఃఖం ఉండదు; ఎందుకంటే అతను ఎక్కువసేపు నిద్రపోతూనో, నిద్రమత్తుగా అలసత్త్వంగానో ఉంటాడు. దుఃఖం అనుభవించాలంటే మేలుకుని ఉండాలి. కాని ఇతని సమస్య ఏమిటి? అజ్ఞానంలో కూరుకుపోతాడు. అన్ని రకాల అజ్ఞానమూ ఉంటుంది; ఆత్మ అజ్ఞానంతో సహా! ఇంత అద్భుతమైన మానవజన్మ పొందిన సదవకాశాన్ని వినియోగించుకోలేకపోతాడు ఇతను. అందువల్ల తామసికకర్మయొక్క ఫలం అజ్ఞానం. వాక్యాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. ఈ కర్మఫలంగా అజ్ఞానం వస్తుంది అంటే అజ్ఞానం కొత్తగా పుట్టిందని కాదు దాని అర్థం. అజ్ఞానం కొత్తగా పుట్టనవసరం లేదు మనం పుడుతూనే అజ్ఞానంతో పుట్టాము. అందువల్ల అజ్ఞానం ఫలంగా పొందుతాడు అంటే అజ్ఞానంలోనే కూరుకుపోతాడని అర్థం. తామసికగుణం ఉన్నవ్యక్తి జీవితం జంతువుల జీవితాన్ని పోలివుంటుంది. అవి మనుష్యుల్లాగా వాటిలో అవి పోట్లాడుకోవు; మనుష్యుల్లాగా జ్ఞానాన్నీ సంపాదించవు. అలా తమోగుణం ఉన్నవ్యక్తి అజ్ఞానంలో కూరుకుపోతాడు.

శ్లో. 17 **సత్త్వాత్ సంజాయతే జ్ఞానం రజసో లోభ ఏవ చ ।**
**ప్రమాదమోహౌ తమసో భవతోఽజ్ఞానమేవ చ ॥**
సత్త్వాత్, సంజాయతే, జ్ఞానమ్, రజసః, లోభః, ఏవ, చ,
ప్రమాదమోహౌ, తమసః, భవతః, అజ్ఞానమ్, ఏవ, చ ॥

| | | | |
|---|---|---|---|
| సత్త్వాత్ | = సత్త్వగుణమునుంచి | చ | = అలాగే |
| జ్ఞానమ్ | = జ్ఞానము | తమసః | = తమోగుణమునుంచి |
| సంజాయతే | = కలుగును | ప్రమాదమోహౌ | = అశ్రద్ధ, మోహములు |
| చ | = ఇంకా | భవతః | = కలుగును, ఇంకా |
| రజసః | = రజోగుణమునుంచి | అజ్ఞానమ్, ఏవ | = అజ్ఞానము కూడ |
| లోభః, ఏవ | = నిస్సందేహముగా లోభము | (భవతి) | = కలుగును |

**సత్త్వాత్ జ్ఞానమ్ సఞ్జాయతే, రజసః లోభః ఏవ చ (సఞ్జాయతే),**
**తమసః ప్రమాద–మోహౌ భవతః అజ్ఞానమ్ చ ఏవ (భవతి) ॥**

తా: సత్త్వగుణమునుంచి జ్ఞానము కలుగును ఇంకా రజోగుణమునుంచి నిస్సందేహముగా లోభము, అలాగే తమోగుణమునుంచి అశ్రద్ధ, మోహములు కలుగును, ఇంకా అజ్ఞానము కూడ కలుగును.

అదే భావన కొనసాగుతున్నది ఈ శ్లోకంలో కూడా. అంటే ఈ శ్లోకంలో కూడా ఫలం గురించే చెబుతున్నాడు.

**త్రిగుణఫలమ్.**

**సత్త్వాత్ సంజాయతే జ్ఞానమ్** – సత్త్వగుణంవల్ల జ్ఞానం పుడుతుంది అంటున్నాడు కృష్ణపరమాత్మ. సత్త్వగుణం ప్రధానంగా ఉన్నవ్యక్తికి జ్ఞానేంద్రియాలు చాలా చురుకుగా పనిచేస్తాయని చూశాము. అలాంటి వ్యక్తి ఏదైనా వినగానే చటుక్కున పట్టేసుకుంటాడు, దాన్ని బాగా గుర్తు పెట్టుకుంటాడు కూడా. అంటే గ్రహణశక్తి, గ్రాహణశక్తి కూడా ఎక్కువే ఉంటుంది. అతని బుద్ధి చాలా చురుకుగా, పదునుగా ఉంటుంది.

అందువల్ల అతను అంతులేని జ్ఞానసంపదను పొందుతాడు. అది ఏ రంగంలోనైనా సరే. ఇటు ఆధ్యాత్మిక రంగంలోనైనా, అటు లౌకికరంగంలోనైనా కూడా. ఎందుకంటే, ఏ జ్ఞానం పొందాలన్నా కూడా సత్త్వగుణం ప్రధానంగా ఉండాలి.

**రజసో లోభః (సంజాయతే)** – రజోగుణం ఎక్కువగా ఉంటే లోభము ఏర్పడుతుంది. లోభం అంటే దురాశ, తపన, ప్రణాళికలు, కుతంత్రాలు బాగా ఉంటాయి. ఆఖరిశ్వాస పీల్చేవరకూ బొంగరంలా గిర్రున తిరుగుతూనే ఉంటాడు. ఒక్కముక్కలో చెప్పాలంటే, అతని దురాశవల్ల ఎంత పొందినా తృప్తి ఉండదు.

**తమసో ప్రమాదమోహౌ (సంజాయతే)** – తమోగుణం ఎక్కువగా ఉంటే ప్రమాదమోహాల్లో పడతారు. ప్రమాదం అంటే తెలుగు ప్రమాదం కాదు. ప్రమాదం అంటే నిర్లక్ష్యం, మతిమరుపు, అశ్రద్ధ మొదలైన లక్షణాలు ఉంటాయి. మోహం అంటే సంఘర్షణ, నిర్ణయం తీసుకోలేకపోవటం మొదలైన లక్షణాలు ఉంటాయి. ఎప్పుడూ వారి మనస్సు డోలాయమానంగానే ఉంటుంది. చెయ్యాలా వద్దా, వెళ్ళాలా వద్దా, తినాలా వద్దా. ఈ ప్రశ్నలు నిరంతరం వారిని పట్టి కుదిపివేస్తూనే ఉంటాయి. ఆ విధంగా తమోగుణం ఫలం మోహం.

**భవతోఽజ్ఞానమేవ చ** – అజ్ఞానం కూడా కలుగుతుంది. అంటే వారు మనిషిగా పుట్టినా అజ్ఞానం పోదు; అది ఇంకా వారిలో రాజ్యమేలుతూనే ఉంటుంది. ఈ రెండు శ్లోకాల సారం టూకీగా చూస్తే ఒక్కొక్కరి ఫలం ఈ విధంగా ఉంటుంది.

| | | |
|---|---|---|
| **సాత్త్విక పురుషుడు** | **– పుణ్యం, జ్ఞానం** | **– పుణ్యం, జ్ఞానం పొందుతాడు.** |
| **రాజసిక పురుషుడు** | **– దుఃఖం, లోభం** | **– దుఃఖం, అత్యాశ కలుగుతాయి.** |
| **తామసిక పురుషుడు** | **– అజ్ఞానం, మోహం** | **– అజ్ఞానం, సంఘర్షణ కలుగుతాయి.** |

శ్లో. 18 **ఊర్ధ్వం గచ్ఛంతి సత్త్వస్థా మధ్యే తిష్ఠంతి రాజసాః ।**
**జఘన్యగుణవృత్తిస్థా అధో గచ్ఛంతి తామసాః ॥**
ఊర్ధ్వమ్, గచ్ఛంతి, సత్త్వస్థాః, మధ్యే, తిష్ఠంతి, రాజసాః,
జఘన్యగుణవృత్తిస్థాః, అధః, గచ్ఛంతి, తామసాః ॥

| | | | |
|---|---|---|---|
| సత్త్వస్థాః | = సత్త్వగుణ ప్రధానులు | జఘన్యగుణ | = తమోగుణ కార్యములైన నిద్రా |
| ఊర్ధ్వమ్, గచ్ఛంతి | = స్వర్గాది–ఊర్ధ్వలోకములను పొందుదురు | వృత్తిస్థాః | అశ్రద్ధ, ఆలస్యములందు స్థితమైనట్టి |
| | | తామసః | = తామసపురుషులు |
| రాజసాః | = రాజసపురుషులు | అధః | = అధోగతులను అనగా పశుకీటకాది జన్మలను, నరకములను |
| మధ్యే | = మానవలోకమున | | |
| తిష్ఠంతి | = జన్మింతురు | గచ్ఛంతి | = పొందుదురు |

**సత్త్వస్థాః ఊర్ధ్వమ్ గచ్ఛన్తి, రాజసాః మధ్యే తిష్ఠన్తి,**
**జఘన్య–గుణ–వృత్తిస్థాః తామసాః అధః గచ్ఛన్తి ॥**

తా: సత్త్వగుణ ప్రధానులు స్వర్గాది–ఊర్ధ్వలోకములను పొందుదురు. రాజసపురుషులు మానవలోకమున జన్మింతురు. తమోగుణ కార్యములైన నిద్రా అశ్రద్ధ, ఆలస్యములందు స్థితమైనట్టి తామస పురుషులు అధోగతులను అనగా పశుకీటకాది జన్మలను నరకములను పొందుదురు.

ఈ శ్లోకంలో వీరు ముగ్గురూ ఏ గతి పొందుతారో మళ్ళీ చెబుతున్నాడు కృష్ణపరమాత్మ. అందువల్ల ఈ శ్లోకాన్ని 14, 15 శ్లోకాలతో కలిపి చదువుకోవాలి. ఎవరెలా ప్రయాణం చేస్తారు?

**సత్త్వస్థాః ఊర్ధ్వమ్ గచ్ఛంతి** – సత్త్వగుణం ప్రధానంగా ఉన్న వ్యక్తులు ఊర్ధ్వలోకాలకు వెళతారు అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఉన్న పద్నాలుగు లోకాల్లో ఆరు ఊర్ధ్వలోకాలు, ఏడు అధోలోకాలు ఉన్నాయి. మిగిలిన ఒకటి మనం ఉన్న భూలోకం. వీరు ఊర్ధ్వలోకాలకు వెళతారు. అవి భువః, సువః, మహః, జనః, తపః, సత్యమ్. వీటిల్లో ఏదో ఒక లోకానికి వెళతారు.

**మధ్యే తిష్ఠంతి రాజసాః** – రజోగుణం ప్రధానం ఉన్న వ్యక్తులు మధ్యలోకంలో ఉంటారు అంటున్నాడు కృష్ణపరమాత్మ. వారు ఊర్ధ్వలోకాలకీ వెళ్ళరు, అధోలోకాలకీ వెళ్ళరు. వారు మనుష్యలోకంలో లేదా భూలోకంలోనే ఉంటారు. సానుకూలంగా చూస్తే వారు అధోలోకానికి వెళ్ళరు; ప్రతికూలంగా చూస్తే ఊర్ధ్వలోకాలకు వెళ్ళలేరు.

**జఘన్యగుణవృత్తిస్థా** – ఎవరైతే అన్నింటికన్నా తక్కువగా ఉంటారో, అంటే తమోగుణం ప్రధానంగా కలిగివుంటారో, **తామసాః అధో గచ్ఛంతి** – తమోగుణం ఉన్నవారు అధోగతికి వెళతారు అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఈ మూడు శ్లోకాల (14, 15, 18) సారం ఒకసారి టూకీగా చూస్తే ఒక్కొక్కరి గతి ఈ విధంగా ఉంటుంది.

| | | |
|---|---|---|
| **సాత్త్విక పురుషుడు** | **– ఊర్ధ్వగతి** | **– ఊర్ధ్వలోకాలకు వెళతాడు.** |
| **రాజసిక పురుషుడు** | **– మధ్యమగతి** | **– మధ్యలోకంలో పుడతాడు.** |
| **తామసిక పురుషుడు** | **– అధోగతి** | **– అధోలోకాలకు వెళతాడు.** |

(ఈ త్రైగుణ్య విశ్లేషణను ఒక పట్టికలో ఈ అధ్యాయం చివర చూడవచ్చు)

ఇక్కడ మనం ఒక విషయం గ్రహించాలి. స్వర్గలోకాలను ఊర్ధ్వలోకాలనీ; పాతాళలోకాలను అధోలోకాలనీ అంటున్నాము కాని అక్షరాలా చూస్తే దేశపరంగా పైలోకం, కిందలోకం అంటూ లేవు. ఊర్ధ్వలోకాలు, అధోలోకాలు మాటలు సాపేక్షిక పదాలు. మనం ఒక దేశంలో ఉంటే ఇంకొక దేశం దానికన్నా కింద ఉండవచ్చు. అందువల్ల ఏ లోకానికాలోకంయొక్క కాలం, దేశం మారుతూ ఉంటుంది అంటుంది శాస్త్రం.

మన దేశంలో ఉన్న దేశం, కాలం స్వప్నప్రపంచంలో వర్తించదు. మన స్వప్నవృత్తాంతాన్ని గమనిస్తే, ఈ విషయం స్పష్టమవుతుంది. మనం చూసే స్వప్నప్రపంచం దేశం, కాలం వేరు. స్వప్నంలో చూసిన ఏనుగు ఎక్కడ ఉంది అంటే ఫలానా చోట ఉందని చెప్పలేము. ఆ నియమం ప్రకారం స్వర్గలోకం అక్షరాలా పైన ఉందని చెప్పటానికి కుదరదు.

అదే సూత్రం ప్రకారం సమయం కూడా అన్ని లోకాలకూ ఒక్కలాగా ఉండదు. స్వప్నంలో మనకు పెళ్ళి అయి పిల్లలూ, మనవళ్ళు పుట్టి, ఆ మనవళ్ళకు కూడా పెళ్ళి అవుతుంది. ఇదంతా మన జాగ్రద్ ప్రపంచంతో పోల్చి చూస్తే మన స్వప్నసమయం ఒకటిన్నర నిముషాలు మాత్రమే అంటారు శాస్త్రజ్ఞులు. కాని స్వప్నకాలం వేరు. అలాగే పితృలోకాల్లో ఉన్న మన పితృదేవతలకు తర్పణాలు సంవత్సరానికి ఒకసారి మాత్రమే వదులుతాము. ఎందుకు? మన ఒక సంవత్సరం వారికి ఒకరోజుతో సమానం. ఆ విధంగా వారికి ఏడాదికి ఒకసారి చేసినా రోజూ తర్పణాలు వదులుతున్నట్టే అవుతుంది. ఈ లోకంలో ఉన్నవారికి పెట్టినట్టుగా మూడు గంటలకొకసారి పెట్టనవసరం లేదు.

ఊర్ధ్వలోకాలు అంటే నిజంగా పైన ఉన్న లోకాలని కాదు అర్థం; జీవనవిధానం పరంగా ఉన్నతమైన లోకాలు. ఉదాహరణకు భూలోకంలోనే అమెరికాలాంటి దేశాలను భూతలస్వర్గం అంటారు. అక్కడ సౌఖ్యాలు ఎక్కువగా ఉంటాయి; గాలి, నీరు, పరిసరాలు శుభ్రంగా ఉంటాయి. కొన్ని దేశాల్లో కుళాయినీరు తాగినా బాగానే ఉంటుంది, కొన్నిచోట్ల మినరల్ వాటర్ కూడా స్వచ్ఛంగా ఉండదు.

అలా భూలోకంలోనే జీవనవిధానంలో స్థాయీభేదాలు ఉంటే, ఇంక ఊర్ధ్వలోకాల గురించి వేరే చెప్పాలా? అక్కడ శరీరం, అక్కడ ఇంద్రియాలు ఇంకా సూక్ష్మంగా, ప్రత్యేకంగా ఉంటాయి. ఈ లోకంలోనే ఇంద్రశరీరం ధరించగలిగితే, ఈ లోకం ఇంద్రలోకంగా కనిపిస్తుంది. అలాగే ఈ లోకంలో మనిషి చూసే ప్రపంచం వేరు,

వినే శబ్దాలు వేరు; కుక్క చూసే ప్రపంచం వేరు, వినే శబ్దం వేరు. మనిషి వినలేని శబ్దాలను కూడా కుక్క వింటుంది. మనిషిగా మనిషి వినే శబ్దాలు వినటమే కష్టం మనకు. అలాంటిది మనకు కుక్క చెవులు ఉంటే అందరికీ నిశ్శబ్దంగా ఉన్నట్టు అనిపించినా, చాలా శబ్దాలు వినిపిస్తాయి.

అందువల్ల వేరే లోకాలు అంటే అనుభవాల్లో కలిగే స్థాయిభేదాలు; మన దేశం, కాలం అక్కడ పనిచెయ్యవు. అందువల్ల ఈ లోకంలో ప్రయాణిస్తే, ఎంత ప్రయాణించినా స్వర్గలోకం చేరుకోలేము. ఉదాహరణకు జాగ్రదావస్థలో ఉన్న కారు వేసుకుని, స్వప్నావస్థలో ఉన్న కాశీకి చేరుకోగలమా? జాగ్రద్ ప్రపంచాన్ని, స్వప్నప్రపంచంతో కలిపే రోడ్డు లేదు. అందువల్ల స్వప్నప్రపంచంలో ఎంత ప్రయాణించినా జాగ్రదావస్థలోకి రాలేము. అంటే స్వప్నలోకాన్నీ, జాగ్రద్ ప్రపంచాన్నీ కలిపే రోడ్డు లేదు. రాకెట్టులో దూసుకువెళ్ళినా ఈ బొందితో స్వర్గానికి వెళ్ళలేము. స్వర్గలోకానికి మరణించాక మాత్రమే వెళ్ళగలము. అంటే ఈ చర్చయొక్క సారాంశం, ఈ లోకంలోని కాలం, దేశం వేరు; వేరే లోకాల్లోని కాలం, దేశం వేరు. అక్కడ ఉండే శరీరాలు వేరు, ఇంద్రియాలు వేరు, జీవితం వేరు. అందువల్ల ఊర్ధ్వలోకాలు అంటే అవి ఉన్నతమైన లోకాలని కాని, నిజంగా ఫలానా చోట ఉన్నాయని కాదు అర్థం.

### 3. గుణాతీతంగా ఎదగటం – శ్లోకాలు 19, 20: ఉపోద్ఘాతం

ముందు శ్లోకంతో (5–18 శ్లోకాల్లో) త్రైగుణ్య విశ్లేషణ ముగించాడు కృష్ణపరమాత్మ. ఈ విశ్లేషణద్వారా రెండు ప్రాథమిక అంశాలను వెల్లడి చేశాడు.

ఎ) **ఎవరూ ఈ గుణాలను తప్పించుకోలేరు** – అహంకారం ప్రకృతినుంచి ఏర్పడింది కాబట్టి, ప్రకృతిలో ఉన్న మూడు గుణాలను అహంకారం తప్పించుకోలేదు.

అహంకారం = కార్యకరణసంఘాతం + చిదాభాస

మహాజ్ఞానికి కూడా సగుణమనస్సే ఉంటుంది. నిర్గుణ మనస్సు అంటూ ఉండదు. భగవంతుని మనస్సును మాయ అంటారు. మాయకే ఈ మూడు గుణాలూ తప్పలేదు. అందువల్ల శరీరం, మనస్సులకు ఈ మూడు గుణాలూ ఉంటాయి. కాకపోతే వాటి స్థాయిల్లో భేదాలు ఉంటాయి. ఒకరిలో సత్త్వగుణం ఎక్కువగా ఉంటే, ఇంకొకరిలో రజోగుణం ఎక్కువగా ఉంటే, మరొకరిలో తమోగుణం ఎక్కువగా ఉంటుంది. అందువల్ల అహంకారం ఈ గుణాలనుంచి తప్పించుకోలేదు.

బి) **గుణాలు బంధకత్వాన్ని కలుగజేస్తాయి** – ఎవరిలో ఏ గుణం ప్రధానంగా ఉన్నా కూడా, ఆ గుణం వారిని బంధించి వేస్తుంది. అంటే ఎవరూ కూడా వాటి బంధకత్వాన్నుంచి తప్పించుకోలేరు. ఆ బంధించే విధానంలో భేదం ఉంటుంది కాని, బంధం మాత్రం తప్పదు. ఒకవ్యక్తి నేను నిన్ను చంపుతాను కాని తుపాకీతో కాల్చనా, కత్తితో తల నరకనా అని అడిగితే ఎలా ఉంటుంది? ఎలా చేసినా మరణం తథ్యం. అలాగే ఈ గుణాలు మూడూ బంధిస్తాయి, అది తప్పదు. ఎందుకు? ఒక్కొక్క గుణం ఒక్కొక్క రకమైన పరిసరాలను కోరుకుంటుంది. బంధన ప్రకారంలో ఆ వివరాలు చూశాము.

| | | |
|---|---|---|
| **సత్త్వగుణం** | **- జ్ఞానసంగము** | **- జ్ఞానతృష్ణ ఉంటుంది** |
| **రజోగుణం** | **- కర్మసంగము** | **- కర్మ చేయాలనే తపన** |
| **తమోగుణం** | **- ప్రమాదసంగము** | **- నిర్లక్ష్యం, బద్ధకం, నిద్రకు లోనవటం** |

సత్త్వగుణం ప్రధానంగా ఉన్నవ్యక్తికి జ్ఞానతృష్ణ ఉంటుంది. అందువల్ల అది నెరవేర్చుకోవటానికి అనువైన ప్రశాంతతను, ఏకాంతాన్ని కోరుకుంటాడు. అది నెరవేరకపోతే బాధపడతాడు. అలాగే రాజసిక గుణం ప్రధానంగా ఉన్నవ్యక్తి సందడి కోరుకుంటాడు. ఒంటరిగా అసలు ఉండలేడు. గదిలో పెట్టి బంధిస్తే, తలుపు బద్దలుకొట్టి బయటకు వచ్చేస్తాడు. అలాగే తామసిక గుణం ప్రధానంగా ఉన్నవ్యక్తి తను నిద్ర పోవటానికి అనుకూల వాతావరణం కోరుకుంటాడు. అది తీరకపోతే బాధపడిపోతాడు.

ఆ విధంగా ఏ గుణానికా గుణం, ఒక ప్రత్యేకమైన వాతావరణాన్ని కోరుతుంది; ఆ వాతావరణం దొరకకపోతే, చిందులు తొక్కుతుంది. అందువల్ల భోక్తగా చూస్తే ఉన్న వాతావరణం ఎన్నటికీ నచ్చదు. ప్రవృత్తి మార్గమో, నివృత్తి మార్గమో చూపిస్తూనే ఉంటాడు. ప్రవృత్తి అంటే నచ్చిన వాతావరణం వైపు వెళ్ళటం; నివృత్తి అంటే నచ్చని వాతావరణానికి దూరంగా వెళ్ళిపోవటం. ఈ వాతావరణం గుణాన్నిబట్టి మారుతుంది. సత్త్వగుణం ప్రధానంగా ఉన్నవ్యక్తికి నిశ్శబ్దం నచ్చితే, అదే నిశ్శబ్దం రజోగుణం ప్రధానంగా ఉన్నవ్యక్తికి నచ్చదు. ఆ నిశ్శబ్దాన్ని సత్త్వగుణం ఉన్నవ్యక్తి ఆశ్రమంలో ఉండే ప్రశాంతత కనిపిస్తోందని స్తుతిస్తే, రజోగుణం ఉన్నవ్యక్తి శ్మశానంలో నెలకొనివున్న భయంకర నిశ్శబ్దం పరుచుకొని ఉంది అంటాడు. ఉన్నదొకటే నిశ్శబ్దం. ఒకరికి సానుకూల ఆలోచన కలిగిస్తే, ఇంకొకరికి ప్రతికూల ఆలోచన కలిగించింది.

ఆ విధంగా, భోక్తగా ఉన్న వాతావరణాన్ని సానుకూల వాతావరణంగానో, ప్రతికూల వాతావరణంగానో విభజించుకుంటాడు ఒకవ్యక్తి. అంటే ఆ వాతావరణంమీద తీవ్రమైన రాగమో, తీవ్రమైన ద్వేషమో పెంచుకుంటాడు. పైగా అనుకూలంగా లేని వాతావరణాన్ని తనకు అనుకూలంగా మార్చుకోవటానికి అతను కర్త అవుతాడు. కర్తగా కొన్ని మార్పులు చేశాక, భోక్తగా మళ్ళీ పరిస్థితులను బేరీజు వేస్తాడు. ఒక చిత్రకారుడు ఒక చిత్రం వేశాక, మళ్ళీ వెనక్కివెళ్ళి దాన్ని అనేక కోణాల్లో చూసి, దాని దగ్గరికి వెళ్ళి దానికి మెరుగులు దిద్దుతాడు. అలా ఒకసారి కాదు, తృప్తి కలిగేదాకా దిద్దుతూనే ఉంటాడు. ఆ విధంగా అతను వాతావరణాన్ని మార్చి కర్త అవుతాడు. దాన్ని బేరీజు వేస్తూ భోక్త అవుతాడు. ఈ విధంగా పరిసరాలను తనకు అనుగుణంగా మార్చుకోవటంతో తలమునకలవటంవల్ల అతనికి తన ఉన్నతస్థాయి అయిన నిర్గుణసాక్షి స్వరూపాన్ని తెలుసుకునే తీరికే ఉండదు. ఈ మూడు గుణాలు అతన్ని కార్యకరణ సంఘాతంతో కట్టివేస్తాయి.

**నిబధ్నంతి మహాబాహో దేహే దేహినమవ్యయమ్** - 14.5

ఈ మూడు గుణాలు మనిషిని కట్టివేస్తాయి అన్నాడు కృష్ణపరమాత్మ. ఈ మూడు గుణాలు ఎంతగా కట్టివేస్తాయి అంటే ఇంక వేరే విషయాన్ని ఆలోచించే తీరికే ఉండదు. చిన్న పిల్లవాడు ఏడ్చినట్టుగా, ఈ గుణాలు మనిషిని విసిగిస్తూ ఉంటాయి. స్వామీజీని భిక్షకి పిలిచినప్పుడు, కొంతమంది వేదాంతం గురించి కొన్ని ప్రశ్నలు వేస్తుంటారు. ఒక ఇంట్లో నెలల పిల్లవాణ్ణి తల్లి ఒళ్ళో కూర్చోబెట్టుకుని 'మహావాక్యం అంటే ఏమిటో చెప్పండి,' అంది.

స్వామీజీ చెప్పటానికి గొంతు విప్పేలోగా ఆ చంటిపిల్లాడు గొంతు చించుకుని ఏడ్చాడు. పిల్లవాడిని మరిపించటంలో మునిగిపోయిన తల్లికి, వేదాంతం వినే తీరిక ఎక్కడిది? అలాగే సగుణ శరీరం, సగుణ మనస్సు, సగుణ పరిసరాలు ఎంతగా మనిషికి దేహాభిమానం కలుగజేస్తాయంటే, తనకు ఇంకొక ఉన్నతస్వరూపం ఉన్నదనే విషయం అతనిని తెలుసుకోనివ్వదు.

అహంకారం కాకుండా ఇంకొకటి ఉంది. ఏమిటది? ఏమీ లేదని అనకండి. అహంకారం అంటే ఏమిటన్నాము? కార్యకరణసంఘాతం + చిదాభాస. చిదాభాస అంటే ప్రతిబింబచైతన్యం. ఒక అద్దం ఉండి, అందులో ఒక ప్రతిబింబ ముఖం ఉంటే, అందులో పడుతున్న అసలు ముఖం ఉండాలా లేదా? అసలు ముఖం అద్దం ముందు లేకపోతే, ప్రతిబింబ ముఖం ఏర్పడలేదు. అలాగే మనలో ప్రతిబింబచైతన్యం, దాన్ని ప్రతిబింబింపచేసే మాధ్యమం అయిన మనస్సు ఉంటే, దానికొక బింబచైతన్యం ఉండి తీరాలి.

కాని ఈ అహంకారం, సాక్షి జోలికి పోనివ్వకుండా, అహంకారంలోనే నిలిపివేస్తుంది. ఎంతసేపూ పరిసరాలను తనకు అనుగుణంగా మార్చుకోవటానికి ప్రయత్నించేలా చేస్తుంది. అసలు అన్ని విధాలా పరిపూర్ణమైన పరిసరాలు ఉండవు. ఒకవేళ మీరు కష్టపడి పరిసరాలను మీకు అనుగుణంగా మార్చుకున్నా కూడా, అది శాశ్వతంగా మిగిలిపోదు. ఇంకో సందర్భంలో సురేశ్వరాచార్యులవారు అంటారు, 'పరిసరాలను మార్చాలనుకోవటం మీ నిటారైన ముక్కు చివర ఆపిల్‌పండును నిలబెట్టటానికి ప్రయత్నించటంలా ఉంటుంది.' ఎందుకంటే ఏ వ్యక్తిలోనూ ఈ గుణాలు ఎప్పుడూ ఒక్కలా ఉండవు. ఒకేవ్యక్తి సత్త్వగుణంనుంచి రజోగుణానికి మారిపోతూ ఉంటాడు. శరీరం మారిపోతూ ఉంటుంది. శరీరం లావెక్కిపోతూ ఉంటుంది, చిక్కిపోతూ ఉంటుంది; మనస్సు విషయం చెప్పనే అవసరంలేదు. ఈ క్షణంలో ప్రశాంతంగా ఉంటే ఇంకో క్షణంలో విస్ఫోటనం చెందుతుంది. కాబట్టి ఏ పరిసరాలను కోరుకుంటాడు? ఇది అంతుపట్టని సమస్య. దీనికి ఒక్కటే మార్గముంది. ఏమిటది? గుణాతీతంగా ఎదగటం. అంటే ఈ మూడుగుణాలకు అతీతంగా ఎదగటం.

గుణాతీతునిగా ఎదగటం ఎలా? అహంకారం ఎన్నటికీ గుణాతీతం అవలేదు. మహా అయితే తమోగుణం నుంచి రజోగుణానికి మారగలదు లేదా రజోగుణంనుంచి సత్త్వగుణానికి మారగలదు. అంతేకాని గుణాతీతం అవలేదు.

అహంకారం కాకుండా సాక్షిచైతన్యం ఉందని చూశాము. దాన్నే చిత్ అనీ, బింబచైతన్యం అనీ అంటారు. సాక్షిచైతన్యానికి ఏ గుణాలు ఉన్నాయి? అది నిర్గుణం. పోనీ సాక్షిచైతన్యం గుణాతీతం అవుతుందా? ముందేమన్నాము? అహంకారం గుణాతీతమవుతుందా అని అడిగితే, అహంకారం ఎన్నటికీ గుణాతీతం కాలేదన్నాము. అయితే సాక్షిగుణాతీతమవుతుందా? దానికి జవాబు ఏది ఇచ్చినా అది తప్పే. సాక్షి గుణాతీతం అవుతుంది అన్నా తప్పే, అవదు అన్నా తప్పే. ఎందుకు? సాక్షి ముందే గుణాతీతం అంటే నిర్గుణం. ఇంక కొత్తగా గుణాతీతం అవాల్సిన అవసరం ఏముంది?

ఒకపక్క అహంకారం గుణాతీతమవలేదని, ఇంకొకపక్క సాక్షి గుణాతీతం అవనవసరం లేదని అంటే, ఎవరు అవుతారు గుణాతీతంగా? గుణాతీతంగా ఎవరూ అవరు. అందువల్ల గుణాతీతంగా ఎలా ఎదగాలి అనే ప్రశ్నే తప్పు.

సరే గుణాతీతంగా ఎలా ఎదగాలి ప్రశ్నే తప్పు అని అర్థమయింది కాని గుణాతీతంగా ఎలా ఎదగాలని రెట్టిస్తే, దానికి జవాబు ఇచ్చితీరాలని అంటే, రాజీపడిన జవాబు ఇవ్వకతప్పదు. ఏమిటది?

మీ దృష్టిని అహంకారంనుంచి సాక్షికి మారిస్తే మీరు గుణాతీతులు అవుతారు. 'అవుతారు,' పదాన్ని అక్షరాలా తీసుకోకూడదు. నిజంగా భౌతికంగా మార్పు ఉండదు. దృష్టిలో మార్పు వస్తుంది. అంటే మీ దృష్టిని తక్కువస్థాయి అహంకారంనుంచి ఉన్నతస్థాయి అయిన సాక్షి వైపుకు మరల్చటం; అనాత్మనుంచి ఆత్మ వైపుకు మరల్చటం; శరీరంనుంచి చైతన్యం వైపుకు మరల్చటం; క్షేత్రంనుంచి క్షేత్రజ్ఞుని వైపుకు మరల్చటం. మనశ్శరీరాలతో అనుబంధం పెంచుకున్నంతవరకూ మీరు సగుణ అహంకారం అవుతారు. సగుణ అహంకారంతో మమేకం చెందినంతవరకూ సంసారాన్ని తప్పించుకోలేరు.

అందువల్ల గుణాతీతంగా మారాలంటే అర్థం – నేను అహంకారాన్ని అని అనే బదులు, నేను సాక్షిని అని అర్థం చేసుకోవాలి. నేను, నాలో సాక్షి ఉన్న శరీరాన్ని అని చెప్పేబదులు; నేను శరీరం ఉన్న సాక్షిని అని చెప్పగలగాలి. అంటే ఇన్నాళ్ళూ చెబుతున్నదానికి పూర్తి వ్యతిరేకవాక్యం. నేను సాక్షిని, నాకు వ్యవహారం నడపటానికి నాకు భగవంతుడు తాత్కాలికంగా ఈ మనశ్శరీరాలను ఇచ్చాడు.

ఈ మనశ్శరీరాలతో వ్యవహారం నడుపుతున్నంతసేపూ మమేకం చెందితే, తప్పేంలేదు. కాకపోతే మమేకం చెందుతున్నప్పుడు కూడా నేను సాక్షిచైతన్యాన్ని అనే విషయం మర్చిపోకూడదు. ఒక నటుడు ఎటువంటి పాత్ర వేసినా, అంటే రావణాసురునిలా వేసినా, రామునిగా వేసినా ఆ పాత్రలో లీనమయ్యే నటిస్తాడు కాని తను నిజంగా ఆ పాత్ర కాదు. తన అసలు వ్యక్తిత్వం వేరే ఉందని గుర్తుంచుకుంటూనే ఉంటాడు. అంటే అతను రావణాసురునిగా హూంకరిస్తున్నప్పుడు, మధ్యలో నేను ఫలానా అని పనిగట్టుకుని చెప్పనవసరం లేదు కాని తన మనస్సులో తెలుసుకుంటే చాలు.

అలాగే ప్రపంచంలో వ్యవహారం నడుపుతున్నప్పుడు సగుణ అహంకారంతో మమేకం చెందినా, ఆ వ్యవహారాన్ని సక్రమంగా చేసినా, ఇది నేను వేస్తున్న పాత్ర మాత్రమే, నా అసలు స్వరూపం సాక్షిచైతన్యం అని గుర్తుపెట్టుకోవాలి. గుణాతీతుడు అవాలంటే ఒకటే మార్గం. మీ ఉన్నతస్వరూపం ఏమిటో తెలుసుకోవాలి. దానిలో నిలబడాలి. తెలుసుకోవటం, నిలబడటం చెయ్యాలి.

సగుణ అహంకారంనుంచి నిర్గుణసాక్షికి దృష్టి మరల్చాలి. అది ఒక్కటే మార్గం. దీన్ని **ఆత్మానాత్మ వివేకం** అంటారు. నేను శాశ్వతమైన సాక్షిచైతన్యాన్ని, అశాశ్వతమైన శరీరాన్ని కాదు; తాత్కాలికంగా ఉన్న శరీరంలో శాశ్వతమైన సాక్షిని అని అర్థం చేసుకోవాలి. సాక్షిగా నేను ఎప్పుడూ నిర్గుణ ఆత్మను; ఎప్పటికీ అకర్తను, అభోక్తను. ఈ జ్ఞానం ఒక్కటే దానికి పరిష్కారం.

గుణాతీతుడు అవాలంటే ఆత్మజ్ఞానం పొందాలని అర్థం. ఆత్మజ్ఞానం అంటే గురుముఖతా వేదాంతశాస్త్ర శ్రవణం, మననం, నిదిధ్యాసనలు చెయ్యటం.

**తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా ।**
**ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానినస్తత్త్వదర్శినః ॥** – 4.34

గురువుద్వారా శాస్త్రాన్ని అధ్యయనం చేసి నేను నిర్గుణసాక్షిని అని తెలుసుకోవాలి. 19, 20 శ్లోకాల్లో ఆత్మజ్ఞానం పొంది, గుణాతీతుడిగా ఎలా ఎదగాలో వివరించబోతున్నాడు కృష్ణపరమాత్మ. ఈ రెండు శ్లోకాలు చాలా ముఖ్యమైన శ్లోకాలు. జీవితాన్ని ఒక నాటకంగా మలుచుకోవాలి. అందులో మీరు వేస్తున్న పాత్ర అహంకారం. మీ అసలు మీరు సాక్షి. ఈ **అహంకార ఆత్మ వివేకాన్ని** వివరించబోతున్నాడు కృష్ణపరమాత్మ. ఈ నేపథ్యంతో ఈ రెండు శ్లోకాలను చూద్దాము.

శ్లో. 19 **నాన్యం గుణేభ్యః కర్తారం యదా ద్రష్టానుపశ్యతి ।**
**గుణేభ్యశ్చ పరం వేత్తి మద్భావం సోఽధిగచ్ఛతి ॥**

న, అన్యమ్, గుణేభ్యః, కర్తారమ్, యదా, ద్రష్టా, అనుపశ్యతి,
గుణేభ్యః, చ, పరమ్, వేత్తి, మద్భావమ్, సః, అధిగచ్ఛతి ॥

| | | | |
|---|---|---|---|
| యదా | = ఎప్పుడైతే | పరమ్ | = అతీతుడైన సచ్చిదానంద పరమాత్మను |
| ద్రష్టా | = ద్రష్టయైనవాడు | వేత్తి | = అర్థం చేసుకొనునో అప్పుడు |
| గుణేభ్యః | = మూడు గుణములను తప్ప | సః | = అతడు |
| అన్యమ్, కర్తారమ్ | = మఱియొక దానిని కర్తగా | మద్భావమ్ | = నా స్వరూపమునే |
| న, అనుపశ్యతి | = చూడడో | అధిగచ్ఛతి | = పొందును |
| చ | = ఇంకా | | |
| గుణేభ్యః | = మూడు గుణములకన్నా | | |

**యదా ద్రష్టా గుణేభ్యః అన్యమ్ కర్తారమ్ న అనుపశ్యతి, గుణేభ్యః**
**చ పరమ్ (ఆత్మానం) వేత్తి, (తదా) సః మత్-భావమ్ అధిగచ్ఛతి ॥**

తా: ఎప్పుడైతే ద్రష్టయైనవాడు మూడు గుణములను తప్ప మఱియొక దానిని కర్తగా చూడడో ఇంకా మూడు గుణములకన్నా అతీతుడైన సచ్చిదానంద పరమాత్మను అర్థం చేసుకొనునో అప్పుడు అతడు నా స్వరూపమునే పొందును.

**గుణేభ్యశ్చ పరం వేత్తి** – ఈ సాధకుడు సాక్షిచైతన్యాన్ని తెలుసుకుంటాడు. ఈ సాక్షిచైతన్యం స్వరూపం ఏమిటి?

గుణేభ్యశ్చ పరమ్ – మూడు గుణాలకు అతీతంగా ఉంది. గుణాలు ఉన్నవి శరీరం, మనస్సు. అంటే కార్యకరణ సంఘాతం. దీనిని అనాత్మ అంటారు. సాక్షి ఈ అనాత్మకు అతీతంగా ఉంది.

అతీతంగా ఉందంటే ఏమిటి అర్థం? అతీతంగా అంటే దూరంగా ఉందని ఒక అర్థం వస్తుంది. ఆ ఇల్లు, ఆ కారుకు అతీతంగా ఉంది అంటే, కారుకు దూరంగా ఇల్లు ఉందని అర్థం వస్తుంది. అలా సాక్షి శరీరానికి అతీతంగా ఉందంటే సాక్షి ఎక్కడో దూరంగా ఆకాశంలో ఉందని కాదు అర్థం. ఇక్కడ అతీతానికీ, భౌతికదూరానికీ

సంబంధం లేదు. అయితే, అతీతం అంటే ఏమిటి? అంటే ఈ సాక్షిచైతన్యం మనశ్శరీరాలు అంతటా వ్యాపించి ఉంది కాని, వాటికి భిన్నంగా ఉంది. వాటికి ఏమైనా సాక్షికి ఏమీ అవదు.

కాంతి చెయ్యి అంతటా వ్యాపించి ఉంటుంది కాని, చేతికి ఏమయినా కూడా కాంతికి ఏమీ అవదు. దీన్ని **అసంగత్వం** అంటారు. ఈ సాక్షిచైతన్యం, త్రిగుణాత్మక శరీరం అంతటా ఉండి, త్రిగుణ శరీరానికి చైతన్యాన్ని ప్రసాదిస్తుంది కాని, శరీరానికున్న మలినాలు దీనికి అంటవు.

**న పుణ్యం న పాపం న సౌఖ్యం న దుఃఖమ్।**
**న మంత్రో న తీర్థం న వేదా న యజ్ఞః।** – నిర్వాణషట్కమ్

శరీరానికి ఉన్న అనారోగ్యం సాక్షిని కలుషితం చెయ్యలేదు; మనస్సుకున్న రాగద్వేషాలు సాక్షిని కలుషితం చెయ్యలేవు. ఈ అసంగత్వాన్నే పరం అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**(అహమ్ ఇతి వేత్తి)** – ఇది మనం కలుపుకోవాలి. ఈ త్రిగుణాలకు అతీతంగా ఉన్న సాక్షిచైతన్యాన్ని నేను అని నేర్చుకుంటాడు సాధకుడు.

**యదా ద్రష్టా** – ద్రష్టా అంటే తెలివైన సాధకుడు; పరిసరాలను తన గుణాలకు తగ్గట్టుగా మలుచుకుంటూ వచ్చి, అలసిపోయిన సాధకుడు. ఇవాళ ఉన్న ఏర్పాటు రేపు నచ్చదు. ఇంట్లో ఆ మూల ఉన్న బల్ల ఇటుపెట్టి, ఇటు ఉన్న సోఫా అటు జరుపుతారు కొందరు. లేదా జుట్టు తగ్గించుకుని, గడ్డం పెంచుకుంటారు మరికొందరు. దీనికి పెద్దగా ఖర్చు కూడా అవదు. అలా అనేక రకాలుగా వారు మారుతూ, పరిసరాలను మారుస్తూ వస్తారు. కాని ఒక శుభముహూర్తాన కొంతమందికి జ్ఞానోదయం అవుతుంది. ఏమని? సమస్య బాహ్యప్రపంచంలో లేదు, సమస్య నన్ను నేను చూసుకునే విధానంలో ఉందని అర్థం చేసుకుంటారు. అంటే తాము పూర్ణత్వం కోరితే, దాన్ని పరిసరాలు ఇవ్వలేవనీ, తామే మారాలనీ అర్థం చేసుకుంటారు.

ఇంతకుముందు చెప్పిన బల్ల, సోఫాలను మార్చటం పని చేసుకోవటానికి వీలుకోసం మార్చితే ఫర్వాలేదు, అది వేరే విషయం; కాని మీరు ఏదో మెరుగుపడతారు అనుకుని మార్చితే మాత్రం అది సంసారం అవుతుంది. ఎప్పుడైతే మీరే పూర్ణసాక్షి అని తెలుసుకుంటారో, అప్పుడు మీరు మీచుట్టూ ఉన్న పరిసరాలను మార్చటానికి ప్రయత్నించరు. ఆ పరిసరాలు సత్త్వగుణానికి అనుకూలంగా ఉన్నా, రజోగుణానికి అనుకూలంగా ఉన్నా, తమోగుణానికి అనుకూలంగా ఉన్నా పట్టించుకోరు.

**దుఃఖేష్వనుద్విగ్నమనాః సుఖేషు విగతస్పృహః** – 2.56

అంటే ఎటువంటి పరిసరాలు ఉన్నా పట్టించుకోరు. అందువల్ల ద్రష్ట అంటే పరిసరాలను మార్చటానికి ప్రయత్నించే బదులు, తనను తాను మార్చుకునే తెలివైన వ్యక్తి.

**యదా అనుపశ్యతి** – నేను ఉన్నతమైన సాక్షిని, నేను గుణాతీతుణ్ణి అని అర్థం చేసుకుంటాడు. **అను** పదం చాలా ముఖ్యం. అను అంటే గురుశాస్త్ర ఉపదేశం. నేను సాక్షిని అనే జ్ఞానం స్వతంత్రంగా ఏర్పడదు. శాస్త్రం నేర్చుకోకుండా,

మీరు స్వంతంగా ప్రయత్నిస్తే, మీ పరిసరాలను మార్చటానికి ప్రయత్నిస్తూనే ఉంటారు. ఏదో ఒక శుభముహూర్తాన మీ భార్య మీకు అనుకూలవతిగా మారుతుందని, మీ అబ్బాయి మీరు చెప్పినట్టు వింటాడనీ, రోడ్లన్నీ సాఫీగా సాగిపోయేలా ఉంటాయని ఎదురుచూస్తూ, అటువంటి పరిపూర్ణమైన పరిస్థితులకోసం నిరంతరం కృషిచేస్తూనే ఉంటారు. ఈ మార్గం సరియైనదో కాదో మిమ్మల్ని మీరు ఎన్నడూ ప్రశ్నించుకోరు.

అటువంటి పరిస్థితుల్లో శాస్త్రం మీకొక సవాలు విసురుతుంది. పూర్ణత్వం పొందటానికి ఇంకొక మార్గం ఉందని మీకు తెలుసా? ఏమిటా మార్గం? అంతర్ముఖులవటం. ఈ జ్ఞానం శాస్త్రమూ, గురువూ మాత్రమే ఇవ్వగలరు. అందువల్ల యదా అనుపశ్యతి అంటే గురుశాస్త్ర ఉపదేశంద్వారా నేర్చుకుంటాడు.

**గుణేభ్యః అన్యం కర్తారం న (పశ్యతి)** – అంతేకాదు, అతను కర్మలు అనాత్మకు చెందినవని తెలుసుకుంటాడు అంటున్నాడు కృష్ణపరమాత్మ. గుణేభ్యః అంటే అనాత్మకు చెందినవని అర్థం. అనాత్మ అంటే శరీరత్రయం – స్థూల, సూక్ష్మ, కారణశరీరాలు; లేదా పంచకోశాలు. ఈ అనాత్మ ఎప్పటికీ కర్తగా పనిచేస్తూనే ఉంటుంది. అనాత్మ పని ఆపటం అంటూ ఉండదు. కొంతమంది పదవీ విరమణ చేశాక, ఇంకొక ఉద్యోగంలో చేరతారు. అలా ఏదో ఒక పని చేస్తూనే ఉంటారు. పైగా అనాత్మ పనిచెయ్యకపోతే, అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉంది. అందువల్ల అనాత్మ ఎప్పటికీ కర్తనే. మీరు కర్తృత్వభావనకు అతీతంగా ఎదగాలంటే, మీరు అనాత్మ కాదు, మీరు ఆత్మ అని నేర్చుకుని, మీ ఉన్నతస్థాయిలో నెలకొని ఉండాలి.

గుణేభ్యః అన్యం కర్తారం న పశ్యతి వాక్యంలో కృష్ణపరమాత్మ రెండు వ్యతిరేక పదాలను వేశాడు. కృష్ణపరమాత్మ చెప్పదలుచుకున్నది అనాత్మ కర్త అనే అంశం. కాని ఆయన వాడిన వాక్యం ప్రత్యేకత ఏమిటంటే అనాత్మ కాకుండా వేరే కర్త లేదు అన్నాడు. అనాత్మ కర్త అన్నా, అనాత్మ కాకుండా వేరే కర్త లేదు అన్నా రెండింటి అర్థం ఒకటే. కాని ఇలా వ్యతిరేకపదాలద్వారా చెప్పటంవల్ల చెప్పాల్సిన అంశం గట్టిగా నొక్కివక్కాణించినట్టు అవుతుంది. నేను ఎవరు ఆత్మనా, అనాత్మనా? నేను ఆత్మను. అందువల్ల నేను ఎప్పటికీ అకర్తా, అభోక్తను.

ఇతి యదా పశ్యతి – ఏ రోజైతే ఈ విషయాన్ని మీరు అర్థం చేసుకుంటారో, ఆరోజే మీరు జీవితమనే పరుగు పందెంనుంచి ముక్తిపొందినవారు అవుతారు. లేకపోతే, భోక్తగా మీరు అనుభవిస్తున్నది నచ్చక, ఆ అనుభవాన్ని మెరుగుపరచటంకోసం మళ్ళీ కర్తగా మారతారు. కర్తగా చేసిన కర్మఫలం అనుభవించటానికి మళ్ళీ భోక్తగా మారతారు.

మరణశయ్యమీద ఉన్న ఎవరినైనా అడిగిచూడండి – 'నీ జీవితం తృప్తిగా ముగుస్తోందా?' ఇంచుమించుగా అందరూ చెప్పేది ఒకటే జవాబు. 'అంతా బాగానే ఉంది, కాని...' ఆ కాని లేకుండా ఉండదు. అంటే ఏదో ఒక కొరత మిగిలిపోతుంది. అహంకారం అలా అసంతృప్తితో మరణిస్తుంది కాబట్టి, ఏ కోరిక మిగిలిపోతే ఆ పరిసరాల్లో మళ్ళీ పుడతాడు.

**కామాన్యః కామయతే మన్యమానః స కామభిర్జాయతే తత్ర తత్ర।** – ముండకం 3.2.2

దేనిమీదైతే తీవ్రమైన కోరిక మిగిలిపోతుందో, ఆ పరిసరాల్లో పుట్టేలా చేస్తుంది అహంకారం. అక్కడ మళ్ళీ సంసారం మొదలు. మళ్ళీ మరణించేటప్పుడు, ఇదే కొరత. ఇది ఒక అంతులేని కథ. ఈ ప్రయాణం ముగియలేదు. అంటే పునరపి జననం, పునరపి మరణం తప్పదు.

పూరీ వత్తాక నూనెలో వేస్తే, అది పూర్తిగా పొంగేదాకా నూనెలో అటుఇటు పరుగులు పెడుతూనే ఉంటుంది. పూర్తిగా పొంగాక, కుదురుగా ఒకచోట ఉంటుంది. అంటే పూర్ణత్వం పొందేసరికి, ఆత్మలోనే రమిస్తుందన్నమాట. మన జీవితమూ అలాగే ఉంటుంది. మనమూ పూర్ణత్వం పొందేవరకూ జీవితమనే పరుగుపందెంలో పరుగులు తీస్తూనే ఉంటాము. జ్ఞానం పొందాక, పరుగులు తీయమా, చేసే పనులు చెయ్యమా అంటే అప్పుడూ చేస్తాము. కాకపోతే దానికీ, దీనికీ చాలా భేదం ఉంది.

జ్ఞానం పొందకముందు పూర్ణత్వం**కోసం** పరుగులు తీస్తే, జ్ఞానం పొందాక పూర్ణత్వం**వల్ల** పరుగులు తీస్తాము. పూర్ణత్వంకోసం పరుగులు తీస్తే ఆందోళన, బెంగ నిరంతరం రాజ్యమేలుతూనే ఉంటాయి. రాత్రిపూట కంటి నిండా కునుకు కూడా తీయనివ్వవు. అదే పూర్ణత్వంవల్ల పరుగులు తీస్తే ఆందోళన, బెంగలు అంటే ఏమిటో తెలియదు. రాత్రి ఇలా దిండుమీద తల వాలుస్తామో లేదో, అలా నిద్రలోకి జారుకుంటాము. ఏ సమయంలో చూసినా, అంతఃకరణ అంతా బాగుంది అంటుంది. అంతకుముందు నేను బాగాలేను, పరిసరాలు బాగాలేవు అని సతాయించే మనస్సు ఇప్పుడు నేను బాగున్నాను, నువ్వు బాగున్నావు, అంతా బాగుంది అంటుంది.

**మద్భావమ్ అధిగచ్ఛతి** – అటువంటి వ్యక్తి పూర్ణత్వాన్ని పొందుతాడు అంటున్నాడు కృష్ణపరమాత్మ. అంటే సాక్షిచైతన్యాన్ని అర్థం చేసుకున్న వ్యక్తి ఈశ్వరభావాన్ని పొందుతాడు. కృష్ణపరమాత్మ ఈశ్వరుడు కాబట్టి మద్భావం అంటే ఈశ్వరభావం; ఈశ్వరభావం అంటే ఈశ్వరస్వరూపం; ఈశ్వరస్వరూపం అంటే పూర్ణత్వం. పూర్ణత్వభావన ఉన్న మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. అందువల్ల మద్భావం అంటే పూర్ణత్వం లేదా జీవన్ముక్తి అని అర్థం.

**వేత్తి** – ఈ పూర్ణత్వాన్ని జ్ఞానంవల్ల మాత్రమే పొందగలవు అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఈ విషయాన్ని బాగా గమనించాలి. వేత్తిని గుర్తు పెట్టుకోవాలి. వేత్తి అంటే అర్థం చేసుకున్న అని వస్తుంది. దేన్ని అర్థం చేసుకున్న? పూర్ణత్వాన్ని అర్థం చేసుకున్న వ్యక్తి.

మోక్షానికి ఎన్ని మార్గాలు ఉన్నాయి? కర్మయోగం, భక్తియోగం, రాజయోగం, హఠయోగం, కుండలినీయోగం మొదలైనవి మోక్షానికి దారితీస్తాయా? ఇవేవీ మోక్షానికి దారితీయవు అని ఈ శ్లోకంద్వారా అర్థమవుతుంది. అలాగని ఈ యోగాలవల్ల ప్రయోజనం లేదనటం లేదు, కాని ఇవన్నీ జ్ఞానయోగ్యతాప్రాప్తిని కలుగజేస్తాయి. కాని అంతిమలక్ష్యమైన పూర్ణత్వాన్ని కనుగొనాలంటే మాత్రం వేదాంత శ్రవణ, మనన, నిదిధ్యాసనలతో కూడిన జ్ఞానయోగానికి రావటమొక్కటే మార్గము.

అందువల్ల ఈ శ్లోకం చాలా ముఖ్యమైన శ్లోకం. ఈ అధ్యాయంలో మాత్రమే కాదు, భగవద్గీతలోనే ముఖ్యమైన శ్లోకాల్లో ఇది ఒకటి.

శ్లో. 20 **గుణానేతానతీత్య త్రీన్ దేహీ దేహసముద్భవాన్ ।**
**జన్మమృత్యుజరాదుఃఖైః విముక్తోఽమృతమశ్నుతే ॥**
గుణాన్, ఏతాన్, అతీత్య, త్రీన్, దేహీ, దేహసముద్భవాన్,
జన్మమృత్యుజరాదుఃఖైః, విముక్తః, అమృతమ్, అశ్నుతే ॥

| | | | |
|---|---|---|---|
| దేహీ | = పురుషుడు | జన్మమృత్యు- జరాదుఃఖైః | = జన్మ, మృత్యు, వార్ధక్యములవల్ల కలుగు దుఃఖములనుంచి |
| దేహ సముద్భవాన్ | = శరీరముయొక్క ఉత్పత్తికి కారణములైన | విముక్తః | = విముక్తుడై |
| ఏతాన్, త్రీన్, గుణాన్ | = ఈ మూడు గుణములను | అమృతమ్ | = పూర్ణత్వాన్ని, శాశ్వతత్వాన్ని |
| అతీత్య | = అధిగమించినచో | అశ్నుతే | = పొందును |

**దేహీ ఏతాన్ దేహ-సముద్భవాన్ త్రీన్ గుణాన్ అతీత్య,**
**జన్మ-మృత్యు-జరా-దుఃఖైః విముక్తః (సన్) అమృతమ్ అశ్నుతే ॥**

తా: పురుషుడు శరీరముయొక్క ఉత్పత్తికి కారణములైన ఈ మూడు గుణములను అధిగమించినచో జన్మ, మృత్యు, వార్ధక్యములవల్ల కలుగు దుఃఖములనుంచి విముక్తుడై పూర్ణత్వాన్ని, శాశ్వతత్వాన్ని పొందును.

ఈ శ్లోకంలో జ్ఞానఫలాన్ని స్పష్టంగా వివరిస్తున్నాడు కృష్ణపరమాత్మ.

**దేహీ ఏతాన్ త్రీన్ గుణాన్ అతీత్య** – ఈ జీవుడు ఈ మూడు గుణాలకు అతీతంగా ఎదుగుతాడు అంటున్నాడు కృష్ణపరమాత్మ. దేహీ అంటే జీవుడు; ఏతాన్ త్రీన్ గుణాన్ – ఈ మూడు గుణాలనుంచి; అతీత్య – అతీతంగా ఎదుగుతాడు. ఎలా? జ్ఞానం పొందటంవల్ల. అతీతంగా ఎదుగుతాడు అంటే ఈ గుణాలమీద ఉన్న అభిమానంనుంచి విడివడతాడు. మూడు గుణాలు మూడు శరీరాలను సూచిస్తాయి; మూడు గుణాలు పంచకోశాలను సూచిస్తాయి. ఒక్కముక్కలో చెప్పాలంటే అనాత్మను సూచిస్తాయి.

నేను శరీరాన్ని అనే బదులు నేను ఆత్మను, నేను వ్యవహారం నడపటానికి భగవంతుడు తాత్కాలికంగా ఈ శరీరాన్నిచ్చాడు అంటాడు జ్ఞాని. శరీరం అవసరం ఎందుకు? కేవలం తినటానికి కాదు; ఈ శరీరాన్ని అందులోనూ మానవశరీరాన్ని భగవంతుడు ఇచ్చిన కారణం జ్ఞానం పొందటానికి. అది కూడా ఎటువంటి జ్ఞానం? శరీరాన్ని ఉపయోగించి నేను శరీరాన్ని కాదు, నేను ఆత్మను అనే జ్ఞానం పొందటానికి. ఆ జ్ఞానం పొందిన వ్యక్తి ఈ శరీరానికి అతీతంగా ఎదుగుతాడు.

**ఏతమన్నమయమాత్మానముపసంక్రామతి**
**ఏతం ప్రాణమయమాత్మానముపసంక్రామతి** – తైత్తిరీయం

అతీత్య అంటే ఉపసంక్రామతి. ఈ మూడు గుణాలూ దేనికి చెందినవి?

**దేహసముద్భవాన్** – ఈ శరీరం పుట్టటానికి కారణమయ్యాయి. శరీరం పుట్టటానికి కారణం అంటే, ఈ జన్మ రావటానికి కారణమయ్యాయి. ఎందుకంటే జన్మను కొత్త శరీరం పొందటంగా అభివర్ణిస్తారు. అందువల్ల ఈ మూడు గుణాలు మనకు ఈ జన్మని ఇచ్చాయి; ఈ మూడు గుణాలే వచ్చే జన్మను కూడా ఇస్తాయి.

ఎటువంటి జన్మను ఇస్తుంది? ఇంతకుముందు చూసిన వర్ణన గుర్తు తెచ్చుకోవాలి. సత్త్వగుణం ప్రధానంగా ఉంటే ఊర్ధ్వలోకాలకు వెళతాడనీ; రజోగుణం ప్రధానంగా ఉంటే ఈ లోకంలోనే పుడతాడనీ; తమోగుణం ప్రధానంగా ఉంటే అధోలోకాలకు వెళతాడనీ చూశాము. ఊర్ధ్వలోకాల్లో జన్మ శాశ్వతమా, అశాశ్వతమా? అశాశ్వతమే. ఈ మూడు గుణాల్లో ఏ గుణం కూడా మోక్షాన్నివ్వదు. అందువల్ల మూడు గుణాలు శరీరం రావటానికి అంటే పునర్జన్మ పొందటానికి కారణమవుతాయి. దేహ సముద్భవాన్ అంటే పునర్జన్మ కారణ భూతాన్. ఇలా పునరపి జననం, పునరపి మరణం కలగజేసే ఈ మూడు గుణాలనుంచి విడివడటం నేర్చుకుంటాడు జ్ఞాని. అలా ఒక జ్ఞాని ఈ గుణాలనుంచి, శరీరంనుంచి విడివడితే అతనికి కలిగే ఫలం ఏమిటి?

**విముక్తః** – విముక్తి పొందుతాడు. దేన్నుంచి విముక్తి పొందుతాడు? శరీరానికి సంబంధించిన సమస్యలనుంచి విముక్తి పొందుతాడు. మీరు శరీరంతో మమేకం చెందితే శరీరం సమస్యలు మిమ్మల్ని పట్టిపీడిస్తాయి. మీరొక కొత్త, మెరిసిపోయే కారును కొనుక్కున్నారనుకోండి. ఆ కారంటే చాలా అభిమానం కూడా ఉందనుకోండి. ఆ కారుమీద చిన్నగీత పడినా మీ హృదయంమీద గీసినట్టుగా విలవిలలాడిపోతారు. ఎందుకు? నా కారు అనే మమకారం, మీ కారుకు ఏదైనా అయితే మీకే అయినంత బాధ కలుగజేస్తుంది.

ఈ సూత్రం శరీరానికి కూడా వర్తిస్తుంది. ఎప్పుడైతే మీరు శరీరం అనుకుంటారో, అప్పుడే శరీరానికి ఏ బాధ కలిగినా, మీరు విలవిలలాడిపోతారు. ముఖ్యంగా శరీరానికి మరణం తప్పదు. దేహాభిమానంవల్ల మీరేమంటారు? శరీరం మరణిస్తుంది అనకుండా, నేను మరణిస్తాను అంటారు.

శరీరం మరణించటం పెద్ద సమస్య కాదు, ప్రతిరోజూ వందలకొద్దీ మనుష్యులు మరణిస్తూనే ఉంటారు. పొద్దునే కాఫీ తాగుతూ, వార్తాపత్రిక చదువుతుంటారు మీరు. అందులో పేపరు తెరిస్తే చాలు, ఎక్కడో రైలు ప్రమాదమో, బస్సు ప్రమాదమో, పడవ ప్రమాదమో జరిగిందని, చాలామంది మరణించారనీ చదువుతారు. ఫలానాచోట బస్సు ప్రమాదం జరిగి, 35 మంది మరణించారు అనే వార్తను చదువుతారు. కాఫీ తాగుతూ ఆ వార్తను చాలా ప్రశాంతంగా చదువుతారు. మహా అయితే 'అయ్యోపాపం,' అని వారిమీద జాలిపడతారు, అంతే. దాని తర్వాత దాని గురించి మర్చిపోతారు.

అందువల్ల సమస్య మరణంలో లేదు. నేను మరణిస్తాను అనుకోవటంలో ఉంది. ఎంతమంది మరణించినా ఫర్వాలేదు, నేను–నావారు మాత్రం మరణించకూడదు. ఈ సమస్యకు వేదాంతం ఒక్కటే పరిష్కారం. వేదాంతం నాకు మరణం ఉందనే భావనను పోగొడుతుంది. ఎలా పోగొడుతుంది? ఆత్మజ్ఞానం కలగజేయటంద్వారా. నేను నాశనమయ్యే ఈ శరీరాన్ని కాదు, నాశనమయ్యే ఈ శరీరం వెనకనున్న శాశ్వతమైన సాక్షిచైతన్యాన్ని అనే జ్ఞానం కలుగజేయటంద్వారా ఈ భావనను పోగొడుతుంది. అందువల్ల విముక్తః అంటే శరీరసమస్యలనుంచి విముక్తి పొందుతాడు. ఏమిటా సమస్యలు?

**జన్మమృత్యుజరాదుఃఖైః** – పుట్టుక, మరణం, వార్ధక్యం. మొదటి సమస్య – జన్మ. తల్లిగర్భంలో తొమ్మిదినెలలు ఉండాలి, అదే పెద్ద సమస్య. తర్వాత సమయం ఆసన్నమయ్యాక తల్లిగర్భంనుంచి బయట ప్రపంచంలోకి రావాలి. అది అటు తల్లికీ, ఇటు బిడ్డకీ – ఇద్దరికీ కూడా పెద్దగండమే. అలా పుట్టుకే పెద్ద సమస్య. జన్మ అంటే పుట్టుక.

పుట్టాక మరణం ఇంకో పెద్ద సమస్య. నాకు మరణం అంటే భయంలేదు అంటారు కొంతమంది. అది నిజంకాదు, భయంలేదు అనుకుంటున్నారు అంతే. కొంతమంది నేను అవస్థపడి చావకూడదు, ప్రశాంతంగా మరణించాలి, అది కూడా నిద్రలో ప్రాణంపోతే మరీమంచిది అంటారు. దేవునికి ప్రతిరోజూ ఈ ప్రార్థనే చేస్తున్నాను అంటారు కూడా. మృత్యు అంటే మరణం.

ఇంకొక సమస్య వార్ధక్యం. జరా అంటే వార్ధక్యం. ఈ మూడూ దుఃఖభూయిష్ఠాలు. వీటినుంచి ఎవరూ తప్పించుకోలేరు. శరీరం అన్నాక జన్మ, వార్ధక్యం, మరణాలు తప్పవు. అది శరీరలక్షణం. శరీరానికి ఆరు వికారాలు ఉంటాయని చూశాము. అవి అస్తి, జాయతే, వర్ధతే, విపరిణమతే, అపక్షీయతే, వినశ్యతి. పుట్టి, మార్పులు చెంది చివరికి నశిస్తుంది. అగ్ని స్వరూపలక్షణం వేడి. అలాగే శరీరలక్షణం మార్పుచెందటం.

స్వరూపలక్షణాన్ని స్వరూపలక్షణంగా స్వీకరించలేకపోతే వస్తుంది సమస్య. స్వరూపాన్ని ఎదురీదాలనుకుంటే దుఃఖం తప్పదు. అగ్ని వేడిగా ఉంది, అగ్ని వేడిగా ఉంది అని బాధపడిపోవటం అర్థంలేని విషయం. అలాగే శరీరం మారిపోతుందని బాధపడిపోవటం కూడా అర్థంలేని విషయమే. దేహాభిమానం పెంచుకుంటే వస్తాయి ఈ బాధలు. ఇంతకుముందు కూడా చూశాము. మరణం తప్పదని మనకు తెలుసు. వందలమంది ఏ సునామీలోనో మరణించారని చదివినా, ఎక్కువగా చలించము. కాని నేనూ, నావారూ మాత్రం శాశ్వతంగా పదికాలాలపాటు ఈ భూమ్మీదే నిలిచిపోవాలని ఆశిస్తాము. అది అర్థంలేని కోరిక అని కృష్ణపరమాత్మ ముందే హెచ్చరించాడు.

**జాతస్య హి ధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్య చ ।**
**తస్మాదపరిహార్యేఽర్థే న త్వం శోచితుమర్హసి ॥** – 2.27

పుట్టిన వ్యక్తి మరణించక తప్పదు. ఎప్పుడైతే నేను శరీరం కాదు, నేను సాక్షిచైతన్యాన్ని అని నేర్చుకుంటానో అప్పుడే శరీరాన్ని నాకు భిన్నంగా సాక్షీభూతంగా చూడటం నేర్చుకుంటాను. ఎప్పుడైతే శరీరాన్ని నాకు భిన్నంగా చూడటం నేర్చుకుంటానో, అప్పుడే నా శరీరంమీద ప్రత్యేకమైన అభిమానం ఉండదు. ఈ శరీరం కూడా తక్కిన శరీరాలలాంటిదే. దీనికి కూడా వార్ధక్యం, మరణం తప్పదు అనే సత్యాన్ని స్వీకరిస్తాను.

సాక్షిచైతన్యం నేను అని అర్థమయితే, శరీరానికి ఈ బాధలు తప్పవు అని కూడా గ్రహిస్తాను. వయస్సు మీదపడ్డ కొద్దీ, కంటిచూపు మందగిస్తుంది; వినికిడి శక్తి తగ్గుతుంది; కీళ్ళనొప్పులు మేమున్నామని ముందుకు వస్తాయి; బుద్ధిలో పదును తగ్గుతుంది కాని ఇవేవీ నన్ను బాధించవు. శరీరం అన్నాక ఈ బాధలు తప్పవు; ఇవి శరీరంయొక్క స్వరూపం అని అర్థం చేసుకుంటాను. వాటిని నవ్వుతూ స్వీకరించటం నేర్చుకుంటాను. యాక్సెప్ట్ అండ్ అకామడేట్ అంటారు దీన్ని.

ఎప్పుడైతే వీటిని స్వరూపలక్షణంగా తీసుకుంటానో, అప్పుడే అవి కలుగజేసే బాధయొక్క తీవ్రత తగ్గుతుంది. దీన్ని అభిభావ పద్ధతి అంటారు. ఈ పద్ధతిలో శరీరానికి ఉన్న సమస్యలను తొలగించలేము. సమస్యలు అలాగే ఉంటాయి కాని వాటిని చూసే దృక్పథం మారుతుంది. ఇన్నాళ్ళూ పెద్ద సమస్యగా నన్ను పట్టిపీడించిన శరీర అనారోగ్యం నన్ను అంతగా బాధించదు. రాత్రి ఎంతో మిలమిలలాడుతూ మెరిసే నక్షత్రాలు, పొద్దున్న సూర్యుని

దేదీప్యకాంతిలో వెలవెలబోతాయి. పగలు నక్షత్రాలు ఉండవా అంటే ఉంటాయి కాని వాటి కాంతిని అధిగమిస్తుంది సూర్యకాంతి. అంటే సూర్యకాంతి నక్షత్రాల కాంతిని నాశనం చెయ్యదు కాని వాటి కాంతిని కనబడకుండా చెయ్యటంవల్ల వాటిని లేనట్టుగా చేస్తుంది.

ఈ సూత్రం సాక్షిచైతన్యానికి కూడా వర్తిస్తుంది. శరీర అనారోగ్యం మెరుగుపడిపోదు; కుటుంబసభ్యులు రాత్రికి రాత్రి మారిపోరు; నీటిసమస్య తొలగిపోదు; కాని సాక్షిచైతన్యం గురించిన జ్ఞానకాంతిలో ఈ సమస్యల తీవ్రత తగ్గుతుంది. అవి ఉంటాయి కాని బాధించవు. దీనికి ఆంజనేయస్వామిని ఉదాహరణ చెబుతారు. ఆంజనేయస్వామి సముద్రం దాటి లంకకు వెళ్ళాలంటే ముందు అది చాలా కష్టం అనుకున్నాడు.

**గోష్పదీకృతవారాశిం మశకీకృత రాక్షసమ్**

**గోష్పదీకృతవారాశిమ్ –** కాని ఎప్పుడైతే శ్రీరామచంద్రుణ్ణి తలుచుకున్నాడో, అప్పుడే అంత పెద్ద సముద్రం కూడా చిన్నకొలనులాగా అనిపించింది. సముద్రం అలాగే ఉంది; సముద్రాన్ని హనుమంతుడు చూసిన దృక్పథం మారింది. శ్రీరామునిమీద హనుమంతునికున్న అపారభక్తి అనంతమైన సముద్రాన్ని చిన్నది చేసి చూపించింది.

**మశకీకృత రాక్షసమ్ –** అంత ఘోరమైన రాక్షసులు చిన్న దోమలుగా అనిపించారు. దోమకాటు అంతగా బాధించదు మనను; అంతేకాదు, దోమను సంహరించటానికి ఏ యుద్ధసన్నాహాలు చెయ్యాలి? దాన్ని సునాయాసంగా చంపవచ్చు. అలాగే రాక్షసులబలాన్ని హనుమంతునికున్న రామభక్తివల్ల చిన్న దోమకున్న బలానికి, ఆకారానికి తగ్గించివేసింది.

ఆ విధంగా నేను సాక్షిచైతన్యమనే జ్ఞానం కలగటంవల్ల తక్కిన సమస్యలు సూదితో గుచ్చినంత చిన్నవిగా మారిపోతాయి. అందువల్ల విముక్తః అన్నాడు కృష్ణపరమాత్మ. దీన్ని జీవన్ముక్తి అంటారు. జీవన్ముక్తి అంటే జ్ఞానం పొందాక దృక్పథం మారటంవల్ల, సమస్యలకు తీవ్రంగా స్పందించకపోవటం. దానివల్ల కలిగే ప్రయోజనమేమిటి?

**అమృతమ్ అశ్నుతే** – శరీరంయొక్క సమస్యలు తీవ్రంగా బాధించకపోవటమే కాదు, జ్ఞాని శాశ్వతత్వాన్ని పొందుతాడు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

జ్ఞాని శాశ్వతత్వాన్ని పొందుతాడు అంటే అహంకారం పొందుతుందా, సాక్షి పొందుతుందా? అహంకారం లేదా శరీరం శాశ్వతత్వాన్ని పొందలేదు; సాక్షి పొందనవసరం లేదు. శాశ్వతత్వం అంటే నా దృష్టిని అశాశ్వతమైన అహంకారం వైపునుంచి, శాశ్వతమైన సాక్షివైపుకు మరల్చటం. ఇలా అహంకారంనుంచి సాక్షివైపుకు తిరిగితే గుణాతీతుడు అవుతాడు. అందువల్ల జ్ఞానిని గుణాతీతుడు అంటారు.

**అర్జున ఉవాచ**

శ్లో. 21 **కైర్లింగైః త్రీన్ గుణానేతాన్ అతీతో భవతి ప్రభో ।**
**కిమాచారః కథం చైతాన్ త్రీన్ గుణానతివర్తతే ॥**
కైః, లింగైః, త్రీన్, గుణాన్, ఏతాన్, అతీతః, భవతి, ప్రభో,
కిమాచారః, కథమ్, చ, ఏతాన్, త్రీన్, గుణాన్, అతివర్తతే ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| ప్రభో! | = | ఓ ప్రభూ! | చ | = | ఇంకా |
| ఏతాన్ | = | ఈ | కిమాచారః (భవతి) | = | ఎలా ప్రవర్తిస్తాడు? |
| త్రీన్, గుణాన్ | = | మూడు గుణములను | ఏతాన్, త్రీన్ గుణాన్ | = | సాధకుడు ఈ మూడు గుణములను |
| అతీతః | = | అధిగమించిన పురుషుడు | | | |
| కైః, లింగైః | = | ఏయే లక్షణములతో కూడి | కథమ్ | = | ఏ విధముగా |
| భవతి | = | ఉండును? | అతివర్తతే | = | అధిగమించును? |

**హే ప్రభో! ఏతాన్ త్రీన్ గుణాన్ అతీతః (జీవః) కైః లిఙ్గైః (జ్ఞాతః) భవతి?**
**(సః) చ కిమ్ ఆచారః? (సః) చ ఏతాన్ త్రీన్ గుణాన్ కథమ్ అతివర్తతే ॥**

తా: ఓ ప్రభూ! ఈ మూడు గుణములను అధిగమించిన పురుషుడు ఏయే లక్షణములతో కూడి ఉండును? ఇంకా ఎలా ప్రవర్తిస్తాడు? సాధకుడు ఈ మూడు గుణములను ఏ విధముగా అధిగమించును?

**4. గుణాతీతలక్షణం, సాధన – శ్లోకాలు 21–27**

కృష్ణపరమాత్మ బోధతో ప్రభావితం చెందిన అర్జునుడు అటువంటి గుణాతీతుని లక్షణాలు ఏమిటో, అవి ఎలా సాధించాలో తెలుసుకోవాలనుకున్నాడు.

**అర్జున ఉవాచ** – అర్జునుడు కృష్ణపరమాత్మను అడిగాడు.

**ప్రభో ఏతాన్ త్రీన్ గుణాన్ అతీతః కైః లింగైః భవతి** – ఈ మూడు గుణాలకు అతీతంగా ఎదిగినవ్యక్తి లక్షణాలు ఎలా ఉంటాయి? లింగైః అంటే లక్షణాలు.

**స్థితప్రజ్ఞస్య కా భాషా** – 2.54

రెండవ అధ్యాయంలో స్థితప్రజ్ఞుని లక్షణాలు ఎలా ఉంటాయో చెప్పు అన్నాడు అర్జునుడు. జ్ఞాని శారీరకంగా మారతాడా, అతని మొహంలో కాంతి వస్తుందా? ఇలాంటి సందేహాలు కలుగుతాయి ఎవరికైనా. ఇన్నిరోజులుగా నేను భగవద్గీత నేర్చుకుంటున్నాను కదా, నా మొహంలో ఏమైనా కాంతి వచ్చిందా అని రోజూ అద్దం ముందు నిల్చుని చూసుకుంటే, కాంతి రావటం మాటేమో కాని బట్టతల పెరిగి, మొహం పెద్దదిగా కనిపిస్తుంది.

కొంతమంది జ్ఞానికి కొన్ని సిద్ధులు వస్తాయి అనుకుంటారు. జ్ఞాని ఎదుటివారి మనస్సును తెరిచివుంచిన పుస్తకంగా చదవగలడు అనుకుంటారు వారు. కొంతమంది స్వామీజీని అడుగుతారు కూడా, 'మీకు మా మనస్సును చదివే శక్తి ఏమైనా ఉందా? మేము ఇవాళ ఏ సందేహంతో మీ బోధకు వచ్చామో, సరిగ్గా ఆ సందేహాన్ని మేము అడగకుండానే తీర్చేశారు,' అంటారు. కొంతమంది స్వామీజీకి అలాంటి సిద్ధులు ఉన్నాయి కూడా అంటారు. కాని స్వామీజీ ఆ ఘనతను శాస్త్రానికే అందిస్తున్నారు. అది శాస్త్రం గొప్పదనం అంటారు. శాస్త్రం మనకు రాగలిగే సందేహాలన్నిటినీ కూడా ఊహించి, వాటికి ముందే జవాబు చెబుతుంది. అందుకని అటువంటి జవాబు చెప్పినప్పుడల్లా, ఎవరికైనా ఆ సందేహం కలిగితే, ఆ జవాబు వారికే చెప్పినట్టుగా భావిస్తారు. ఇంతకీ చెప్పొచ్చింది అలాంటి సిద్ధులు ఉంటాయా అని చాలామందికి సందేహం కలుగుతుంది.

అర్జునుడు కూడా రెండవ అధ్యాయంలో అడిగినట్టే, అలాంటి గుణాతీతుణ్ణి తెలుసుకోవటానికి ఏమైనా మార్గం ఉందా అని అడుగుతున్నాడు. అటువంటి గుణాతీతుడు ఎలా ఉంటాడు?

**కిమ్ ఆచారః** – ఎలా ప్రవర్తిస్తాడు? అంటే తోటి మనుష్యులతో అతని ప్రవర్తన ఎలా ఉంటుంది? అతను జ్ఞానం పొందాక కూడా, ఆ మనుష్యుల మధ్యనే సంచరిస్తుంటాడు. అతని వేషభాషల్లో ఏమైనా మార్పు వస్తుందా? రెండవ అధ్యాయంలో ఎలా నడుస్తాడు, ఎలా తింటాడు అని అడిగాడు. ఎవరైనా వేషభాషలను మార్చి, పెద్దగడ్డం పెంచుకుంటే అతను జ్ఞాని అయివుంటాడు అనుకుంటాము. గడ్డం ఉన్న వ్యక్తి గడ్డం గీసుకుంటే మార్పు వచ్చింది అనుకుంటాము. ఇవన్నీ అపోహలు. బాహ్యంగా ఏమీ మార్పులు ఉండాల్సిన అవసరంలేదు. మనం చూడాల్సిన మార్పు తలమీద కాదు, తల లోపల. అంటే బాహ్యమైన మార్పు కాదు, అంతర్గతమైన మార్పు.

వేదాంతం కొంచెం కూడా సిద్ధుల గురించి చెప్పదు. అవన్నీ వేదాంతానికి రాకముందు మాట్లాడే అంశాలు. అతను ఎలా ప్రవర్తిస్తాడు అనటంలో ఉద్దేశ్యం అతనిలో ఏమైనా ప్రత్యేకత ఉందా?

**కథం చ ఏతాన్ త్రీన్ గుణాన్ అతివర్తతే** – ఈ మూడుగుణాలను జ్ఞాని ఎలా అధిగమిస్తాడు? మోక్షం అంటే వేరే లోకానికి ప్రయాణం చేసి వెళ్ళటం అనే అపోహ ఉంది చాలామందిలో. కొంతమంది మోక్షం భవిష్యత్తులో వస్తుంది అంటారు; మరికొంతమంది అది ఒక సంఘటన అంటారు. ఇవన్నీ అపోహలు మాత్రమే. మోక్షం అంటే ప్రయాణం కాదు; మోక్షం భవిష్యత్తులో వచ్చేది కాదు; మోక్షం ఒక సంఘటన కాదు.

మరి మోక్షం అంటే ఏమిటి? మోక్షం అంటే నేను నిత్యముక్తపురుషుణ్ణి అని తెలుసుకోవటం. మళ్ళీ ఒకసారి అర్జునుడు అడిగిన ప్రశ్నలను టూకీగా చూస్తే, అర్జునుడు మూడు ప్రశ్నలు అడిగాడు. అవి –

ఎ) **గుణాతీత లింగమ్** – గుణాతీతుని లక్షణాలు

బి) **గుణాతీత ఆచారః** – గుణాతీతుడు ప్రవర్తించే తీరు

సి) **గుణాతీతస్య సాధనమ్** – గుణాతీతునిగా ఎదగటానికి అవసరమైన సాధనలు.

ఈ ప్రశ్నలకు రాబోయే శ్లోకాల్లో కృష్ణపరమాత్మ జవాబు చెబుతాడు.

**శ్రీ భగవాన్ ఉవాచ**

శ్లో. 22 **ప్రకాశం చ ప్రవృత్తిం చ మోహమేవ చ పాండవ ।**
**న ద్వేష్టి సంప్రవృత్తాని న నివృత్తాని కాంక్షతి ॥**
ప్రకాశమ్, చ, ప్రవృత్తిమ్, చ, మోహమ్, ఏవ, చ, పాండవ,
న, ద్వేష్టి, సంప్రవృత్తాని, న, నివృత్తాని, కాంక్షతి ॥

పాండవ! = ఓ అర్జునా! (ఏ పురుషుడైతే)
ప్రకాశమ్, చ = సత్త్వగుణకార్యరూపమైన ప్రకాశమూ

| | | | | | |
|---|---|---|---|---|---|
| ప్రవృత్తిమ్, చ | = | రజోగుణకార్యరూపమైన ప్రవృత్తియు | నివృత్తాని | = | అవి దూరమయినప్పుడు |
| మోహమ్, ఏవ | = | తమోగుణకార్యరూపమైన మోహమూ | న, కాంక్షతి | = | వాటికోసం ఆరాటపడడో |
| సంప్రవృత్తాని | = | ఏర్పడినప్పుడు | | | |
| న, ద్వేష్టి | = | వాటిని ద్వేషింపడో | | | |
| చ | = | ఇంకా | | | |

**హే పాణ్డవ! ప్రకాశమ్ చ ప్రవృత్తిమ్ చ మోహమ్ ఏవ చ**
**సంప్రవృత్తాని న ద్వేష్టి, నివృత్తాని (చ) న కాంక్షతి ॥**

తా: ఓ అర్జునా! సత్త్వగుణకార్యరూపమైన ప్రకాశమూ, రజోగుణకార్యరూపమైన ప్రవృత్తియు, తమోగుణకార్యరూపమైన మోహమూ ఏర్పడినప్పుడు వాటిని ద్వేషింపడో ఇంకా అవి దూరమయినప్పుడు వాటికోసం ఆరాటపడడో,

మూడు ప్రశ్నలకు ఐదు శ్లోకాల్లో జవాబు చెబుతాడు కృష్ణపరమాత్మ. 22, 23 శ్లోకాల్లో గుణాతీతలింగమ్; 24, 25 శ్లోకాల్లో గుణాతీత ఆచారః; 26 శ్లోకంలో గుణాతీతస్య సాధన వివరిస్తాడు.

ఎ) **గుణాతీతలింగమ్** – గుణాతీతుడు అంటే కార్యకరణసంఘాతంమీద అభిమానం లేనివాడు అంటున్నాడు కృష్ణపరమాత్మ. గుణాతీతుడు అంటే దేహాభిమానాన్ని వదులుకున్నవాడు అని అర్థం. జగత్తును ఎలాగైతే తనకు భిన్నంగా చూస్తాడో, అలా తన మనశ్శరీరాలను కూడా తనకు భిన్నంగా చూస్తాడు. తను మనశ్శరీరాలకు భిన్నంగా ఉన్నాడని తెలుసుకోవటంవల్ల వాటికి వచ్చే సమస్యలకు, జ్ఞాని తీవ్రంగా స్పందించడు. ఈ చలించకపోవటమే ఇతను గుణాతీతుడని చూపిస్తుంది.

ఈ జ్ఞాని ఇలా గుణాతీతునిగా ఎదగటంవల్ల, అతని శరీరం, మనస్సులు కూడా ఆరోగ్యవంతంగానే ఉంటాయి. అతను అలా ఎదగటానికి చాలా సాధన చేసివుంటాడు. అతను కర్మయోగ సాధన చేసి, ఉపాసనయోగసాధన చేసి, జ్ఞానయోగ్యతను పొందాడు. అంటే సత్త్వగుణం ప్రధానంగా ఉన్న మనస్సును పొందాడు. ఇలా సాధన చెయ్యటంవల్ల జ్ఞాని మనస్సులో సత్త్వగుణం ఎక్కువగా ఉంటుంది.

సత్త్వగుణం పొందటానికి అతను కృషి చెయ్యటంవల్ల, అతని మనస్సు దృఢంగా ఉంటుంది. జ్ఞాని మనస్సు సంస్కరించబడివుంటుంది; జ్ఞాని మనస్సు తీవ్రంగా స్పందించదు. నిజానికి సత్త్వగుణంయొక్క నిర్వచనమే అది. సత్త్వగుణం ప్రధానంగా ఉన్నవ్యక్తి జీవితంలో ఎటువంటి ఒడిదుడుకులు ఎదురైనా, తీవ్రంగా స్పందించడు. ఒకవేళ స్పందించినా, అది బాహ్యంగా ప్రకటితమవదు; మనస్సులోనే ఉంటుంది. ఒకవేళ మనస్సులోనే స్పందించినా అది కూడా ఎక్కువసేపు ఉండదు. వెంటనే ఆ స్పందననుంచి బయటపడతాడు. ఆ విధంగా జ్ఞానికి ఆరోగ్యకరమైన మనస్సు ఉంటుంది.

జ్ఞాని ఆరోగ్యకరమైన మనస్సును కష్టపడి సాధన చేసి పెంపొందించుకున్నా కూడా, జ్ఞానికి తెలుసు ఏ మనస్సు కూడా నూటికి నూరుపాళ్ళు ఆరోగ్యవంతంగా ఉండదని. ఎలాగైతే శరీరపరంగా నూటికి నూరుశాతం

ఆరోగ్యం ఉండదో, అలాగే మనస్సుపరంగా కూడా సంపూర్ణ ఆరోగ్యం అంటూ ఉండదు. అందువల్ల జ్ఞాని, తన మనస్సు సాత్త్వికంగానే ఉన్నాకూడా, అది కూడా మూడుగుణాల మధ్య తిరుగుతుందనీ, ఒక్కోసారి తన మనస్సు కూడా వికారాలకు లోనవుతుందనీ తెలుసుకుంటాడు కాబట్టి అలాంటి మానసోద్రేకాలు కలిగే సందర్భాలలో కూడా తీవ్రంగా స్పందించడు, కోపం తెచ్చుకోడు. అంటే తన మనస్సును తను సాక్షీభూతంగా చూడగలడు. అందువల్ల సమస్యలు ఎక్కువగా రావుకాని, ఒకవేళ వచ్చినా కూడా, వాటికి ఆరోగ్యకరంగానే స్పందిస్తాడు.

ఆరోగ్యకరంగా స్పందిస్తాడు అంటే ఏమిటి అర్థం? మనస్సుకు ఏవైనా సమస్యలు వస్తే, జ్ఞాని అసలు పట్టించుకోకుండానూ ఉండడు, అలాగని తీవ్రంగానూ స్పందించడు. జ్ఞానికి తను పూర్ణుడనీ తెలుసు; మనస్సు ఎలావున్నా, తన పూర్ణత్వానికి ఏమీ లోటులేదనీ తెలుసు. కాని మనస్సును మెరుగుపరుచుకోవటానికి ప్రయత్నిస్తాడు జ్ఞాని. ఎందుకంటే అతని మనస్సు ఆరోగ్యంగా ఉన్నకొద్దీ, అతనికీ, అతని జీవితంతో పెనవేసుకుని ఉన్నవారికీ కూడా జీవితం బాగుంటుంది. కాని జ్ఞాని తన మనస్సును మెరుగుపరుచుకుంటున్న స్థితిలో కూడా, తన పూర్ణత్వాన్నికేమీ లోటులేదనీ, మనస్సు ఎలా ఉన్నా తన పూర్ణత్వాన్ని ఏమీ చెయ్యలేదనీ, తను మనస్సును సాక్షీభూతంగా చూస్తున్న సాక్షిచైతన్యాన్ననీ ఎన్నడూ మర్చిపోడు.

**ప్రకాశం చ ప్రవృత్తిం చ మోహమేవ చ** – జ్ఞాని మూడు గుణాలనూ అనుభవిస్తాడు. ప్రకాశం అంటే సత్త్వగుణం. జ్ఞానికి సత్త్వగుణం ప్రధానంగా ఉంటుంది. ప్రవృత్తించ అంటే రజోగుణం; మోహమేవ చ అంటే తమోగుణం. అంటే జ్ఞానికి కూడా ఈ మూడుగుణాలూ ఉండక తప్పవు. కాకపోతే, జ్ఞానికి సత్త్వగుణం ఎక్కువ పాళ్ళలోనూ, రజోగుణం కొంచెం తక్కువ పాళ్ళలోనూ, తమోగుణం చాలా తక్కువ పాళ్ళలోనూ ఉంటుంది. అతనికి తన మనస్సు నూటికి నూరుశాతం సత్త్వగుణం ప్రధానంగా లేదని తెలుసు. ఆ మాటకొస్తే ఎవరి మనస్సు కూడా నూటికి నూరుశాతం సత్త్వగుణం ప్రధానంగా ఉండదు.

జ్ఞాని మనస్సులో కూడా ఈ మూడుగుణాలూ ఉండటమే కాదు, వాటిలో హెచ్చుతగ్గులు మారుతూ వస్తాయి. అంటే ఒకసారి తమోగుణం ఎక్కువ ఉండవచ్చు, ఇంకొకసారి రజోగుణం ఎక్కువగా ఉండవచ్చు కాని వాటి కాలపరిమితి చాలా తక్కువగా ఉంటుంది. జ్ఞాని మనస్సులో సత్త్వగుణం ఎక్కువ ఉంటుంది. అది జ్ఞానికి కూడా తెలుసు. ఈ విషయం తెలిసిన జ్ఞాని ఎలా ప్రవర్తిస్తాడు?

**సంప్రవృత్తాని** – మూడుగుణాల్లో ఏది ఎప్పుడు ఎక్కువవున్నా;

**న ద్వేష్టి** – తన మనస్సును తను ద్వేషించడు. తనలో తమోగుణం ఎక్కువైనా, రజోగుణం ఎక్కువైనా, దానికి కారణమైన మనస్సును ద్వేషించడు.

**న నివృత్తాని కాంక్షతి** – ఒకవేళ సత్త్వగుణం తగ్గిపోతున్నా కూడా, ఆ గుణం రావాలని కోరుకోడు. అంటే సత్త్వగుణంతో బంధం పెంచుకోడు. ఆమాటకొస్తే, ఏ గుణంమీదా రాగద్వేషాలు చూపడు. తమో, రజోగుణాలు ఎక్కువైనప్పుడు వాటిని ద్వేషించడు; సత్త్వగుణం తగ్గినప్పుడు బాధపడడు. ప్రతి ఒక్క మనస్సులోనూ, **తన మనస్సుతో సహా**, ఈ మూడుగుణాలు మేళవించి ఉంటాయని అతనికి తెలుసు. అతనికి తన మనస్సును

ఉన్నదున్నట్టుగా స్వీకరించటం తెలుసు. తన శరీరాన్ని, తన మనస్సును ఉన్నదున్నట్టుగా స్వీకరించగలగటమే గుణాతీత లక్షణము.

శ్లో. 23 **ఉదాసీనవదాసీనో గుణైర్యో న విచాల్యతే ।**
**గుణా వర్తంత ఇత్యేవ యోఽవతిష్ఠతి నేంగతే ॥**
ఉదాసీనవత్, ఆసీనః, గుణైః, యః, న, విచాల్యతే,
గుణాః, వర్తంతే, ఇతి, ఏవ, యః, అవతిష్ఠతి, న, ఇంగతే ॥

| | | | |
|---|---|---|---|
| యః | = ఎవడైతే | వర్తంతే | = గుణములందు ప్రవర్తించుచున్నవి |
| ఉదాసీనవత్ | = ఉదాసీనునివలె | ఇతి | = అని భావించి |
| ఆసీనః | = ఉంటాడో | యః | = ఎవడు పరమాత్మయందు ఏకీభావముతో |
| గుణైః | = త్రిగుణములచే | అవతిష్ఠతి | = స్థితుడైయుండునో ఇంకా |
| న, విచాల్యతే | = చలింపజేయబడడో ఇంకా | న, ఇంగతే | = ఆ స్థితినుంచి ఎన్నడును చలింపడో |
| గుణాః, ఏవ | = గుణములే | | |

**యః ఉదాసీనవత్ ఆసీనః గుణైః న విచాల్యతే, యః (చ) గుణాః**
**వర్తన్తే ఇతి (మత్వా) ఏవమ్ అవతిష్ఠతి, (చ) న ఇంగతే ॥**

తా: ఎవడైతే ఉదాసీనునివలె ఉంటాడో, త్రిగుణములచే చలింపజేయబడడో ఇంకా గుణములే గుణములందు ప్రవర్తించుచున్నవి అని భావించి ఎవడు పరమాత్మయందు ఏకీభావముతో స్థితుడైయుండునో ఇంకా ఆ స్థితినుంచి ఎన్నడును చలింపడో,

ఇదే భావనను కొనసాగిస్తున్నాడు కృష్ణపరమాత్మ. తన మనశ్శరీరాలను ఉన్నదున్నట్టుగా స్వీకరిస్తాడు అంటే అర్థం ఏమిటి? ఆరోగ్యకరంగా ప్రవర్తిస్తాడు అంటే అర్థం ఏమిటి? మామూలుగా అజ్ఞాని ఎలా ప్రవర్తిస్తాడు? ఏ సంఘటన ఎదురైనా, అజ్ఞాని రెండు భిన్నదృక్పథాలు చూపిస్తాడు. అయితే పూర్తిగా నిర్లక్ష్యంగా ఉంటాడు లేదా చాలా ఖంగారు పడిపోతాడు.

ఉదాహరణకు శరీరానికి ఏదైనా అనారోగ్యం కలిగితే, తమోగుణం ఎక్కువ ఉన్నవ్యక్తి అసలేమీ పట్టించుకోడు. డాక్టరు దగ్గరికి వెళ్ళడు, వైద్యం చేయించుకోడు. నిర్లక్ష్యంగా ఉంటాడు. అదే రజోగుణం ఎక్కువగా ఉన్నవ్యక్తి దీనికి పూర్తి భిన్నంగా ప్రవర్తిస్తాడు. వెంటనే డాక్టరు దగ్గరికి వెళతాడు. ఒకవేళ డాక్టరు రక్తపరీక్ష చెయ్యాలంటే చాలు, అతని మనస్సు అనేక ఊహాగానాలు చేస్తుంది. 'ఎందుకు రక్తపరీక్ష అంటాడు? నాకు కాన్సరా, ఎయిడ్సా, ఇంకేదైనా తీవ్రమైన వ్యాధా?' ఇది ఇంకో విపరీతధోరణి. అతను ప్రతిచిన్నదానికీ ఆందోళన, ఖంగారు, భయం, ఒత్తిడి మొదలైన భావాలకు లోనవుతాడు. ఒక విపరీతధోరణి అసలేమి పట్టించుకోకపోవటం; ఇంకొక విపరీతధోరణి విపరీతంగా చలించటం.

ఆరోగ్యకరమైన స్పందన ఏమిటి? పట్టించుకోకపోవటమూ కాదు, అతిగా స్పందించటమూ కాదు; ఆరోగ్యకరమైన స్పందన అంటే ఉన్న పరిస్థితిని మెరుగుపరుచుకోవటం. ఆరోగ్యసమస్య ఏమైనా ఎదురైతే నిశ్చింతగానూ

ఉండకూడదు, అలాగని ఖంగారూ పడిపోకూడదు. ఆ సందర్భంలో ఏంచెయ్యాలో అది చెయ్యాలి. డాక్టరు దగ్గరికి వెళ్ళాల్సివస్తే వెళ్ళాలి.

మనస్సుపరంగా కూడా అంతే. మనస్సు హుషారైన పరికరం. అది ఎప్పుడూ ఒక్కలాగే ఉండదు. మూడుగుణాల మధ్య తిరుగుతూ ఉంటుంది. అందువల్ల చికాకులు తప్పవు. కాని అలాంటప్పుడు కూడా జ్ఞాని చలించడు. కొన్ని సంవత్సరాలపాటు చేసిన గీతాధ్యయనం వృథాపోదు.

మళ్ళీ అజ్ఞాని ప్రవర్తన రెండు విపరీతధోరణుల్లో ఉంటుంది. అయితే అసలు పట్టించుకోడు లేదా విపరీతంగా బాధపడిపోతాడు. చాలా నిరాశానిస్పృహలకు లోనవుతాడు. జ్ఞాని అలాకాదు. అంటే నిర్లక్ష్యమూ చెయ్యడు, అతిగానూ స్పందించడు. మనస్సు ఏవైనా కళాకళలు చూపిస్తే, దాన్ని మెరుగుపరచటానికి ప్రయత్నిస్తాడు. అతను మనస్సును మెరుగుపరస్తున్నప్పుడు కూడా, మనస్సు ఎలా ఉన్నా, అది తన పూర్ణత్వానికి ఏ విధమైన ఆటంకాన్నీ కలిగించలేదని తెలుసుకుంటాడు.

మనస్సును వీలున్నంతవరకు మెరుగుపరచగలడు కాని పూర్తిగా నూటికి నూరుశాతం మెరుగపరచలేడని అతనికి తెలుసు. జ్ఞానం పొంది, జీవన్ముక్తి పొందిన జ్ఞానికి కూడా శరీరం కాని, మనస్సు కాని పరిపూర్ణ ఆరోగ్యంతో ఉండవు. మనస్సును మార్చటానికి ప్రయత్నిస్తూనే ఉండాలి. కాకపోతే జ్ఞాని మోక్షం పొందటంకోసం మనస్సును మార్చటానికి ప్రయత్నించడు, మోక్షం పొందాక మనస్సును మార్చటానికి ప్రయత్నిస్తాడు. ముక్తపురుషునిగా మనస్సును సాక్షీభూతంగా చూసి, దాన్ని మెరుగుపరుచుకోవటానికి ప్రయత్నిస్తాడు జ్ఞాని.

**ఉదాసీనవత్ ఆసీనః** – జ్ఞాని నిర్లక్ష్యంగా ఉన్నట్టు కనిపిస్తాడు. ఎందుకంటే శరీరం అనారోగ్యానికి గురైతే, అతను తీవ్రంగా స్పందించి, ఆవేశపడిపోడు. అందువల్ల అతను తన ఆరోగ్యాన్ని పట్టించుకోనట్టు అనిపిస్తుంది. కాని కృష్ణపరమాత్మ అతను నిజంగా ఉదాసీనంగా లేడు, ఉదాసీనంగా ఉన్నట్టు ఉంటాడు అంటున్నాడు. అంటే అతను ఖంగారు పడిపోయి హడావుడి చెయ్యడు, అలాగని పూర్తి నిర్లక్ష్యంగానూ ఉండడు. ఆ శరీరం బాగుపడటానికి తను ఏంచెయ్యాలో ఆ ప్రయత్నం చేస్తాడు. అందువల్ల ఉదాసీనవత్ అంటే తన మనశ్శరీరాలమీద సమతుల్యత చూపిస్తాడు.

**గుణైః యః న విచాల్యతే** – ఈ మూడుగుణాలూ మారుతూ ఉన్నాకూడా, అతను చలించడు. మనస్సు ఒకసారి సత్త్వప్రధానంగా ఉంటే, ఇంకొకసారి రజోప్రధానంగా ఉంటే, మరొకసారి తమోప్రధానంగా ఉంటుంది. మనస్సు ఏగుణంలో ఉన్నా జ్ఞాని ఖంగారుపడడు. అలాగని మనస్సును దానికి ఇష్టం వచ్చినట్టు ప్రవర్తించమని గాలికి వదిలేయడు. మనస్సును సంస్కరిస్తూనే ఉంటాడు కాని మనస్సుతో ఎన్నడూ సంగత్వం పెంచుకోడు. గుణైః యః న విచాల్యతే అంటే ఈ గుణాలవల్ల అతను చలించడని అర్థం. అయితే అతని దృక్పథం ఎలా ఉంటుంది?

**గుణాః వర్తంతే** – అతనికి ఈ మూడుగుణాలూ అందరిలోనూ ఉంటాయి, తనలోనూ ఉంటాయని తెలుసు. తన సాధనవల్ల దాన్ని సత్త్వగుణప్రధానంగా తీర్చిదిద్దుకున్నాడు కాని, అప్పుడప్పుడూ రజోగుణమో, తమోగుణమో రాజ్యమేలటానికి ప్రయత్నిస్తాయని తెలుసు. కాని అలా రజోగుణం పెరిగి, ఎవరినైనా బాధించాల్సిన పరిస్థితి

ఏర్పడినప్పుడు అతను అది గ్రహించి, ఆ పరిస్థితిని తన అదుపులోకి తీసుకుంటాడు. అంటే వారిని బాధించే మాటలు అనకుండా తగ్గుతాడు. ఆ విధంగా జ్ఞాని తనలో కూడా ఈ గుణాలు ఉంటాయని తెలుసుకుంటాడు.

**ఇత్యేవ** – ఈ జ్ఞానంలో;

**అవతిష్ఠతి** – నెలకొని ఉంటాడు. అంటే తనను తను విమర్శించుకోకుండా, నిరాశానిస్పృహలకు లోనవకుండా సమతుల్యమైన మనస్సుతో ఉంటాడు.

**గుణాతీత లింగమ్ – మనశ్శరీరాలను సాక్షీభూతంగా చూడటం.**

శ్లో. 24 **సమదుఃఖసుఖః స్వస్థః సమలోష్టాశ్మకాంచనః ।**
**తుల్యప్రియాప్రియో ధీరః తుల్యనిందాత్మసంస్తుతిః ॥**
సమదుఃఖసుఖః, స్వస్థః, సమలోష్టాశ్మకాంచనః,
తుల్యప్రియాప్రియః, ధీరః, తుల్యనిందాత్మసంస్తుతిః ॥

| | | | |
|---|---|---|---|
| స్వస్థః | = ఎవరు నిరంతరము ఆత్మభావమునందే స్థితుడై | తుల్యప్రియాప్రియః | = ప్రియాప్రియములను సమానముగా చూచువాడును |
| సమదుఃఖసుఖః | = సుఖదుఃఖములను సమానముగా భావించినవాడై | తుల్యనిందాత్మసంస్తుతిః | = నిందాస్తుతులందును సమానభావము గల్గియుండువాడును |
| సమలోష్టాశ్మకాంచనః | = మట్టి, రాయి, బంగారములను సమానముగా భావించునట్టి | | |
| ధీరః | = జ్ఞాని | | |

**(యః) సమ–దుఃఖ–సుఖః, స్వస్థః, సమ–లోష్ట–అశ్మ–కాఞ్చనః,**
**తుల్య–ప్రియ–అప్రియః, ధీరః, తుల్య–నిన్దా–ఆత్మ–సంస్తుతిః ॥**

తా: ఎవరు నిరంతరము ఆత్మభావమునందే స్థితుడై సుఖదుఃఖములను సమానముగా భావించినవాడై, మట్టి, రాయి, బంగారములను సమానముగా భావించునట్టి జ్ఞాని ప్రియాప్రియములను సమానముగా చూచువాడును నిందాస్తుతులందును సమానభావము గల్గియుండువాడును,

బి) **గుణాతీత ఆచారః** – ఈ రెండు శ్లోకాల్లో జ్ఞాని ఎలా స్పందిస్తాడనే ప్రశ్నకు జవాబు చెప్పబోతున్నాడు కృష్ణపరమాత్మ. దీనికి కూడా జవాబు ముందు చెప్పిన జవాబే. ముందేమన్నాడు? మనశ్శరీరాలకు ఈ మూడుగుణాలు ఉండితీరతాయనీ, అవి హెచ్చుతగ్గులు అవుతూ ఉంటాయని అన్నాడు. అదే సూత్రం జగత్తుకు కూడా వర్తిస్తుంది. అంటే జగత్తులో మూడుగుణాలూ ఉంటాయి. అంటే ఎవరైనా మూడుగుణాలూ ఉన్న మనుష్యులతో స్పందించాల్సి వస్తుంది.

సత్త్వగుణం ప్రధానంగా ఉన్నవ్యక్తులతో ఏ సమస్యా ఉండదు. వారితో వ్యవహారం ఆనందంగా ఉంటుంది. కాని రజోగుణం ఎక్కువగా ఉన్నవారు చీటికీమాటికీ చిందులు తొక్కుతూ ఉంటారు; పలకరిస్తే చాలు ఖస్సుమంటారు.

ఇంకొక తరహా మనుష్యులు చాలా మందకొడిగా ఉంటారు. వారు మిన్నువిరిగి మీదపడ్డా చలించరు. వారితో మీరు అరగంటసేపు మాట్లాడినా వారికి ఏమీ అర్థంకాదు, ఏమన్నావు అంటారు. వారికేదైనా పని అప్పచెపితే, అది వారు పూర్తిచేసేసరికి, పుణ్యకాలం కాస్తా వెళ్ళిపోతుంది. ఇలా మూడురకాల మనుష్యులు ఉంటారు. అందరితోనూ వ్యవహారం నడపాల్సివుంటుంది. అంతేకాదు, ఒకే మనిషిలో ఈ మూడుగుణాలు ఎక్కువతక్కువలు అవుతూ ఉంటాయి. మీ కుటుంబంలోని వ్యక్తులే మారిపోతూ ఉంటారు.

అందువల్లనే పెళ్ళిళ్ళ విషయంలో అతని మనస్తత్వాన్నిబట్టి పెళ్ళి నిశ్చయించకండి అంటారు. ఎందుకంటే ఎవరూ కూడా ఇవాళ ఉన్నట్టు రేపు ఉండరు. అందువల్ల వివాహబంధం ధర్మాన్ని అనుసరించి ఏర్పరుస్తారు. అనుకూలమైన భర్త, అనుకూలమైన భార్య అని చూసుకుని లాభంలేదు. ఎందుకు? భార్యాభర్తల్లో ఇద్దరూ కూడా కాలక్రమేణా మారుతూ వస్తారు; వారి అభిరుచులు మారతాయి. వారి సరదాలు మారతాయి. ఇద్దరిలో ఒకరు భగవద్గీత బోధవైపు ఆకర్షితులవుతారు; మరొకరికి ఇలాంటివి నచ్చవు. అంతవరకూ ఎంతో అన్యోన్యంగా ఉన్న జంట కూడా తీవ్రంగా పోట్లాడుకోవచ్చు.

అందువల్ల మనుష్యుల ప్రవర్తన మారుతూ ఉంటుంది; పరిస్థితులు మారుతూ ఉంటాయి. అది ప్రకృతిధర్మం. జ్ఞాని ఈ ప్రకృతిధర్మాన్ని జీర్ణించుకుంటాడు; మనుష్యులూ, పరిస్థితులూ మారకతప్పవనీ, వాటిలో మూడు గుణాలూ మారుతూ ఉంటాయనీ జీర్ణించుకుంటాడు కాబట్టి ఆ మార్పును నవ్వుతూ స్వీకరిస్తాడు. అందువల్ల అతని మనస్సు విపరీతధోరణులు చూపించదు. అతను సమత్వాన్ని పాటిస్తాడు. ప్రశాంతత, సమతుల్యత, చెక్కుచెదరని గంభీరత చూపిస్తాడు.

**ధీరః** – ధీరుడు అంటే జ్ఞాని. అంటే తన ఉన్నతస్వరూపంలో ఎప్పుడూ నెలకొని ఉండేవ్యక్తి.

**స్వస్థః** – స్వ అంటే స్వరూపం. అతని స్వరూపం ఏమిటి? గుణాతీత ఆత్మ. స్థః అంటే నెలకొనివుండటం. స్వస్థః అంటే గుణాతీత ఆత్మస్వరూపంలో ఎప్పుడూ నెలకొని ఉంటాడు ధీరుడు.

ఆత్మస్వరూపంలో నెలకొనివుంటాడు అంటే ఏమిటి అర్థం? ఆత్మమీద కూర్చుంటాడా? నెలకొని ఉండటం అంటే జ్ఞాని తను గుణాతీత ఆత్మను అనే సత్యాన్ని ఎన్నడూ మర్చిపోడు. ఆత్మలో నిలవటం అంటే స్వరూపాన్ని మర్చిపోకపోవటం. ఒక సంగీతవిద్వాంసుడు తను కచేరీ చేస్తున్నంతసేపూ అతని మనస్సులో ఒకమూల తంబూరా శ్రుతి మెదులుతూనే ఉంటుంది. అతను పూర్తిగా దానిమీద ధ్యాసపెడితే అతను పాడే పాటను సరిగ్గా పాడలేడు; అలాగని దాన్ని పట్టించుకోకపోయినా, అపశ్రుతి పలికే ప్రమాదం ఉంది. అంటే అతని మనస్సులో శ్రుతి ఒకపక్క మెదులుతూనే ఉండాలి.

ఇదే సూత్రం జ్ఞానికి కూడా వర్తిస్తుంది. జ్ఞాని శ్రుతి ఏమిటి? శాస్త్రం. శాస్త్రం ఏం నేర్పిస్తుంది?

**గుణాః గుణేషు వర్తంతే** – శరీరానికి గుణాలు ఉండక తప్పదు; మనస్సుకు గుణాలు ఉండక తప్పదు; జగత్తుకు గుణాలు ఉండక తప్పదు; ఇలా గుణాలున్న తను, గుణాలున్న జగత్తుతో వ్యవహారం నడుపుతున్నప్పుడు అనేక సంఘటనలు కలుగకమానవు, కాని తను ఈ సగుణశరీరానికి, సగుణ ప్రపంచానికి భిన్నంగా ఉన్నానని

జ్ఞాని అర్థం చేసుకుంటాడు. ఈ నిరంతర ధ్యానాన్ని స్వస్థః అంటారు. ఈ నిరంతర ధ్యానంవల్ల అతనికి కలిగే ఫలమేమిటి?

**సమదుఃఖసుఖః** – జీవితంలో ఎదురైన సుఖదుఃఖాలను సమానంగా స్వీకరిస్తాడు. మన జీవితాన్ని దేశం, కాలం, మన ప్రారబ్ధకర్మలు నిరంతరం ప్రభావితం చేస్తూనే ఉంటాయి. దేశం అంటే మనం ఉండే ఊరిలోని వాతావరణ ప్రభావం. కొన్నిచోట్ల వేసవికాలంలో ఎండ తీవ్రంగా ఉంటుంది. కాలం అంటే కాలం తన పని తాను నిశ్శబ్దంగా చేసుకుపోతుంది. కాలం గడిచినకొద్దీ, వృద్ధాప్యంమీద పడుతుంది; మనమే కాదు మనవారికి కూడా వయస్సు పెరుగుతుంది. ప్రారబ్ధకర్మ అంటే మన దశ మారుతూ ఉంటుంది. రాహుదశ, కేతుదశ, గురుమహాదశ, శనిదశల్లో ఏదో ఒక దశలో ఉంటూ ఉంటాము. అంటే ఒకసారి మన దశ ఉన్నతస్థాయిలో ఉంటే, ఒకసారి శనిప్రభావంతో అవస్థ పడతాము. వీటన్నిటివల్ల సుఖదుఃఖాలు ఒకదాని తర్వాత ఒకటి కలుగుతూనే ఉంటాయి.

ఆరోగ్యం ఒకసారి బాగుంటుంది, మరోసారి కుంటుబడుతుంది; ధనంలో ఓలలాడుతాము, ఆర్థికసమస్య ఏర్పడుతుంది; అలా మనను ఎన్నో అంశాలు జీవితంలో అనేక ఒడిదుడుకులకు లోనయ్యేలా చేస్తాయి. కాని జ్ఞాని వీటన్నిటినీ సమానంగా తీసుకుంటాడు. ఇంతకుముందు కూడా చూశాము, సమానంగా తీసుకుంటాడు అంటే అటు నిర్లక్ష్యమూ చెయ్యడు, ఇటు తీవ్రంగానూ స్పందించడు. ఆ పరిస్థితిని మెరుగుపరచటానికి ఏం చెయ్యాలో అది చేస్తాడు, కానీ చెక్కుచెదరని మనస్సుతో చేస్తాడు.

**సమలోష్టాశ్మకాంచనః** – మట్టి, రాయి, బంగారాలను సమానంగా చూస్తాడు. లోష్టం అంటే మట్టిముద్ద; అశ్మ అంటే రాయి; కాంచనం అంటే బంగారం. వీటన్నిటినీ సమంగా చూస్తాడు. అంటే వాటిమీద రాగద్వేషాలు చూపడు. ఐశ్వర్యం ఇవాళ వస్తుంది, రేపు పోతుంది; బంగారం ఇవాళ వస్తుంది, రేపు పోతుంది; అందువల్లనే ధనం, యవ్వనం, జనాలు ఉన్నారని విర్రవీగడు అంటారు. లక్ష్మీదేవి అత్యంత చంచలంగా ఉంటుంది. ఎక్కడా స్థిరంగా ఉండదు అంటారు. అందువల్ల ఐశ్వర్యం వస్తుంది, పోతుంది. అయినా జ్ఞాని చలించడు.

**తుల్యప్రియాప్రియో ధీరః** – ప్రియా అంటే సుఖసాధనం; అప్రియా అంటే దుఃఖసాధనం. ఇంతకుముందు సుఖదుఃఖాలకు జ్ఞాని చలించడు అన్నాడు కృష్ణపరమాత్మ. ఇప్పుడు సుఖదుఃఖాలను కలుగజేసే పరిస్థితులకు కూడా చలించడు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**తుల్యనిందాత్మసంస్తుతిః** – నిందా అంటే ఎదుటివారినుంచి వచ్చే విమర్శ; సంస్తుతి అంటే ఎదుటివారు కురిపించే ప్రశంసలు. రెండింటినీ సమానంగా తీసుకుంటాడు జ్ఞాని అంటున్నాడు కృష్ణపరమాత్మ.

మనం ఏపని చేపట్టినా, కొందరు మనని ఆకాశానికెత్తితే, కొందరు కృంగిపోయేలా విమర్శిస్తారు. ప్రతి పనినీ నూటికి నూరుశాతం అందరూ మెచ్చుకోవాలని ఆశించటం అడియాశే అవుతుంది. పైగా అలా ఆశిస్తే, మనం జీవితంలో ఏ పనినీ చేపట్టలేము, ముందుకు సాగలేము. ఎదుటివారు మెచ్చుకోవాలని చూస్తే, మనమీద మనకు నమ్మకం లేనట్టు అవుతుంది.

జ్ఞాని ఏ పని చేపట్టాలన్నా కూడా, ముందు తను చేయబోయే పనియొక్క ముందువెనకలు ఆలోచిస్తాడు; అందులో ఉండే సాధకబాధలను బేరీజు వేసుకుంటాడు; వీలుంటే తెలివైనవారిని సంప్రదిస్తాడు; అవసరమైతే శాస్త్రంలో ఏం చెప్పబడిందో కూడా తెలుసుకుంటాడు. అన్నింటినీ కలగలిపి, ఒక నిర్ణయానికి వచ్చాక, ఆ కార్యక్రమంలోకి దిగుతాడు. చెయ్యాలని నిశ్చయించుకున్నాక, ఇంక ఎవరేమన్నా పట్టించుకోడు.

ఏ పని చేద్దామనుకున్నా విమర్శించేవారు, వెనకకు లాగేవారు, ఉత్సాహంమీద నీరు జల్లేవారు ఉంటూనే ఉంటారని జ్ఞానికి తెలుసు. ఇల్లు కొనాలనుకుంటే భయపెడతారు; ఇల్లు అమ్మాలనుకుంటే నిరుత్సాహపరుస్తారు. పెళ్ళి చేసుకుందామనుకుంటే ఈ వ్యక్తినా అని మనకేసి జాలిగా చూస్తారు. పెళ్ళి చేసుకోవటం లేదు, సన్యాసం స్వీకరించబోతున్నాను అంటే ఇంకా జాలిగా చూస్తారు.

అందువల్ల నిందించినా, స్తుతించినా రెండింటికీ అతిగా స్పందించకూడదు. ఎవరినీ వదిలిపెట్టలేదు మనుష్యులు. రాముణ్ణి విమర్శించారు; కృష్ణుణ్ణి విమర్శించారు; శంకరాచార్యులవారిని విమర్శించారు. ఈ విమర్శల బారినుంచి తప్పించుకోవటం ఎవరికీ సాధ్యం కాదు. అందువల్ల ఎవరో మహానుభావుడు అన్నాడు –

**మన్నిందయా యది జనః పరితోషమేతి**
**నన్వప్రయత్నసులభోఽయమనుగ్రహో మే।**
**శ్రేయోఽర్థినస్తు పురుషాః పరతుష్టి హేతోః**
**దుఃఖార్జితాన్యపి ధనాన్ని పరిత్యజన్తి॥**

నేను ఎదుటివారికి ఆనందాన్ని కలుగజేయాలి. ఇక్కడ నేను ఆ ఆనందాన్ని చాలా తేలికగా కలుగజేస్తున్నాను. నేనేం కష్టపడకుండానే వారిని ఆనందంలో ముంచెత్తుతున్నాను. నన్ను నిందించటంవల్ల వారికి ఆనందం కలుగుతున్నదంటే కలగనీ, నాకేం అభ్యంతరం లేదు అంటాడా కవి. నిజానికి అలా మనం అనగలిగితే, విమర్శించేవారు కూడా వెనక్కి తగ్గుతారు. అందువల్ల నిందాస్తుతులను కూడా సమానంగా తీసుకోవాలి.

శ్లో. 25 **మానావమానయోస్తుల్యః తుల్యో మిత్రారిపక్షయోః ।**
**సర్వారంభపరిత్యాగీ గుణాతీతః స ఉచ్యతే ॥**
మానావమానయోః, తుల్యః, తుల్యః, మిత్రారిపక్షయోః,
సర్వారంభపరిత్యాగీ, గుణాతీతః, సః, ఉచ్యతే ॥

| | | | |
|---|---|---|---|
| మానావమానయోః | = మానావమానములను | సర్వారంభపరిత్యాగీ | = కర్మాచరణములందు |
| తుల్యః | సమానముగా | | కర్తృత్వాభిమానము |
| | తలంచువాడును | | లేనివాడును |
| మిత్రారిపక్షయోః | = మిత్రులపట్ల, శత్రువులపట్ల | సః | = అయిన పురుషుడు |
| తుల్యః | సమానముగా | గుణాతీతః | = త్రిగుణములకు అతీతుడని |
| | ఉండువాడును | ఉచ్యతే | = చెప్పబడును |

**(యః) మాన-అవమానయోః తుల్యః, మిత్ర-అరి-పక్షయోః తుల్యః,**
**సర్వ-ఆరమ్భ-పరిత్యాగీ (చ అస్తి) సః గుణాతీతః ఉచ్యతే ॥**

తా: మానావమానములను సమానముగా తలంచువాడును, మిత్రులపట్ల, శత్రువులపట్ల సమానముగా ఉండువాడును, కర్మాచరణములందు కర్తృత్వాభిమానము లేనివాడును అయిన పురుషుడు త్రిగుణములకు అతీతుడని చెప్పబడును.

ఈ శ్లోకంలో కూడా సమత్వాన్ని వివరిస్తున్నాడు కృష్ణపరమాత్మ.

**మానావమానయోస్తుల్యః** – మానం, అవమానాలను కూడా సమానంగా తీసుకుంటాడు జ్ఞాని అంటున్నాడు కృష్ణపరమాత్మ.

ఇంట్లో మనుష్యులే అవమానించవచ్చు. మనమేమీ చెయ్యలేము. నిందాస్తుతికీ, మానావమానాలకూ మధ్యనున్న భేదాన్ని అంతకుముందు కూడా చూశాము. నిందాస్తుతి వాక్కుపరంగా చేస్తే, మానావమానాలను కర్మపరంగా చేస్తారు. అంటే మనను ఎవరైనా మాటలతో హింసిస్తే అది నింద; మనను ఎవరైనా వారి చేతలతో బాధపెడితే అది అవమానం. జ్ఞాని మానావమానాలను రెండింటినీ సమానంగా తీసుకుంటాడు.

**తుల్యో మిత్రారిపక్షయోః** – మిత్రులను, శత్రువులను సమానంగా చూస్తాడు జ్ఞాని అంటున్నాడు కృష్ణపరమాత్మ.

జ్ఞానికి శత్రువులు ఉంటారా అని అడగకూడదు. జ్ఞానికి శత్రువులుండరు కాని అతనిని శత్రువుగా భావించేవారు ఉంటారు. వారిని తప్పించుకోలేడు జ్ఞాని. అందువల్ల జ్ఞాని మిత్రులనూ, శత్రువులనూ కూడా సమానంగా చూస్తాడు. దీన్నే **సమత్వం** అంటారు.

**సర్వారంభపరిత్యాగీ** – బంధించే కర్మలనుంచి విముక్తి చెందుతాడు జ్ఞాని అంటున్నాడు కృష్ణపరమాత్మ.

ఆరంభః అంటే బంధించే కర్మలు; పరిత్యాగి అంటే వాటినుంచి విముక్తి పొందినవ్యక్తి. బంధించే కర్మ అంటే ఏమిటి? ఏ కర్మ చేస్తే మనం పూర్ణత్వం పొందుతామని భావిస్తామో, అది బంధించే కర్మ. ఆ కర్మనుంచి మంచి ఫలం ఆశిస్తాము కాబట్టి అది బంధిస్తుంది. కాని జ్ఞాని పూర్ణత్వభావనతో కర్మ చేస్తాడు కాబట్టి, ఆ కర్మ అతన్ని బంధించదు. అంటే అతను చేపట్టిన ఆ కర్మ విజయాన్ని చేకూర్చినా, విఫలాన్ని కలుగజేసినా, అతని పూర్ణత్వం చెక్కుచెదరదు. అనాత్మస్థాయిలో కర్మలు నిరంతరం చేస్తూనే ఉండాలి; కాని ఆత్మస్థాయిలో –

**పూర్ణమదః పూర్ణమిదమ్ – అహం పూర్ణః అస్మి**

మనశ్శరీరాలను మెరుగుపరుచుకునేందుకు చేసే కర్మ కూడా మనను బంధించకూడదు. నేను వాటిని మెరుగుపరచటానికి ప్రయత్నిస్తున్నాను కాని, దానివల్ల నా పూర్ణత్వం చెక్కుచెదరదు అని గుర్తుంచుకోవాలి మనము. మనశ్శరీరాలు ఏ స్థితిలో ఉన్నా నేను పూర్ణుడను. నేను వాటిని మెరుగుపరచటానికి ప్రయత్నిస్తున్నానని అర్థం చేసుకుంటే ఆ కర్మను కూడా ఆనందిస్తాము. అటువంటి జీవితం ఆటలాగా సాగుతుంది.

అంతకుముందు కూడా ఈ ఉదాహరణను చూశాము. ఇండియా ఆడే అనేక టెస్ట్‌మాచెస్‌లో ఐదింటిలో వరుసగా మొదటిమూడూ గెలిచిందనుకోండి. ఆ సీరీస్‌లో ఇండియానే గెలిచినట్టు. అయినా ఆ క్రికెట్‌టీమ్, తక్కిన రెండు మ్యాచ్‌లు కూడా ఆడాలి. కాని ఎటువంటి ఒత్తిడి లేకుండా, నిశ్చింతగా ఆడతారు. అలాగని ఆటను నిర్లక్ష్యం చెయ్యరు. వాటిల్లో కూడా గెలవటానికే ప్రయత్నిస్తారు. కాని ఓటమి ఎదురైనా కూడా పట్టించుకోరు. అటువంటి నిశ్చింతభావనతో ఉంటాడు జీవన్ముక్తుడు. అతనికి జీవితమే ఒక ఆట. జీవితంలో గెలుపు, ఓటములు వస్తుంటాయి, పోతుంటాయి, అవేమీ నా పూర్ణత్వాన్ని పోగొట్టలేవు అనుకుంటాడు. ఈ విధంగా జ్ఞానాతీతుని ఆచారానికి రెండు మాటలు చెప్పాడు కృష్ణపరమాత్మ. అవి సమత్వం, బంధవిముక్తి.

**గుణాతీత ఆచారః – సమత్వం, బంధవిముక్తి.**

శ్లో. 26 **మాం చ యోఽవ్యభిచారేణ భక్తియోగేన సేవతే ।**
**స గుణాన్ సమతీత్యైతాన్ బ్రహ్మభూయాయ కల్పతే ॥**
మామ్, చ, యః, అవ్యభిచారేణ, భక్తియోగేన, సేవతే,
సః, గుణాన్, సమతీత్య, ఏతాన్, బ్రహ్మభూయాయ, కల్పతే ॥

| | | | |
|---|---|---|---|
| చ | = ఇంకా | సః | = అతడు కూడా |
| యః | = ఏ పురుషుడు | ఏతాన్, గుణాన్ | = ఈ మూడు గుణములను |
| అవ్యభిచారేణ భక్తియోగేన | = అనన్య భక్తియోగము ద్వారా | సమతీత్య | = పూర్తిగా అధిగమించి |
| | | బ్రహ్మభూయాయ | = పరమాత్మ ప్రాప్తికై |
| మామ్, సేవతే | = నన్ను నిరంతరము భజించునో | కల్పతే | = అర్హుడగును |

**యః మామ్ చ అవ్యభిచారేణ భక్తి–యోగేన సేవతే, సః ఏతాన్**
**గుణాన్ సమతీత్య, బ్రహ్మ–భూయాయ కల్పతే ॥**

తా: ఇంకా ఏ పురుషుడు అనన్య భక్తియోగముద్వారా నన్ను నిరంతరము భజించునో అతడు కూడా ఈ మూడు గుణములను పూర్తిగా అధిగమించి పరమాత్మ ప్రాప్తికై అర్హుడగును.

సి) **గుణాతీతస్య సాధనమ్** – గుణాతీతునిగా అవటానికి కావాల్సిన సాధన ఏమిటో వివరిస్తున్నాడు కృష్ణపరమాత్మ. 'అవటానికి' మార్గం ఏమిటి?

నిజానికి అర్జునుడు ఈ ప్రశ్నను అడగాల్సిన పనిలేదు. ఎందుకంటే కృష్ణపరమాత్మే స్వయంగా గుణాతీతంగా ఎదగటానికి కావాల్సిన సాధనను వివరించేశాడు 19, 20 శ్లోకాలలో. ఆ జవాబు – జ్ఞానం పొందటం ఒక్కటే మార్గం, గుణాతీతునిగా 'అవటానికి.' అవటానికి అంటే నిజంగా శారీరకంగా మార్పు ఉండదని చూశాము.

అందువల్ల అర్జునుడు అడిగిన ప్రశ్నను కొంచెంగా మార్చుకోవాలి. అర్జునుడు ఈ మూడుగుణాలను జ్ఞాని ఎలా అధిగమిస్తాడు అని అడిగాడు. కాని గుణాతీతంగా ఎదగటానికి జ్ఞానం ఒక్కటే మార్గమని అర్జునునికి అర్థమయింది. అందువల్ల అర్జునుడు అడిగిన ప్రశ్నను ఇలా మార్చుకోవాలి. అది ఇలా ఉంటుంది.

ఈ మూడుగుణాలను జ్ఞానంతో అధిగమించటానికి ఏ సాధన చెయ్యాలి జ్ఞాని? కృష్ణపరమాత్మ జ్ఞానానికి సాధన, భక్తి అంటున్నాడు. భక్తి అంటే ఏమిటో భక్తియోగంలో వివరంగా చూశాము. ఐదుదశల భక్తియోగాన్ని చూశాము. రెండుదశల కర్మయోగం, రెండుదశల ఉపాసన, ఒకదశ జ్ఞానం – మూడూ కలిసి భక్తి అని నిర్వచించాడు కృష్ణపరమాత్మ అక్కడ.

**భక్తియోగేన సేవతే** – జ్ఞానం ద్వారా గుణాతీతునిగా ఎదగటానికి చెయ్యాల్సిన సాధన–భక్తి; ఇంకా చెప్పాలంటే పన్నెండవ అధ్యాయంలో వివరించిన ఐదుస్థాయిల భక్తి. ఆ భక్తి కూడా ఎలా ఉండాలి?

**అవ్యభిచారేణ** – అనన్యభక్తి ఉండాలి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

ఈ అనన్యభక్తి ఎలా ఉండాలి? దీనికి ఏడవ అధ్యాయానికి వెళ్ళాలి మనం. అక్కడ భక్తిలో నాలుగు రకాలను వివరించాడు. అవి ఆర్తభక్తి, అర్థార్థీభక్తి, జిజ్ఞాసుభక్తి (ముముక్షుభక్తి), జ్ఞానీభక్తి. అక్కడ చెప్పిన జిజ్ఞాసుభక్తినే ఇక్కడ అవ్యభిచారిభక్తి అంటున్నాడు కృష్ణపరమాత్మ. అంటే ఈ భక్తిలో సాధకుడు భగవంతుణ్ణి, ఇంకా చెప్పాలంటే భగవంతుణ్ణి మాత్రమే, లక్ష్యంగా పెట్టుకుంటాడు. అటువంటి భక్తితో కొలుస్తాడు.

**సః ఏతాన్ గుణాన్ సమతీత్య** – అటువంటి భక్తుడు తప్పకుండా గుణాలకు అతీతునిగా ఎదుగుతాడు. ఎందుకంటే అతను కర్మయోగంలో రెండుదశలూ, ఉపాసనలో రెండుదశలూ దాటి ఆఖరిదశ అయిన జ్ఞానయోగానికి వస్తాడు. జ్ఞానయోగంలో సాధన – శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చెయ్యాలి. జ్ఞానం పొందాలంటే ఏంచెయ్యాలి అంటే శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చెయ్యాలి. ఈ ఐదుదశల స్థాయినీ మర్చిపోకూడదు.

**బ్రహ్మభూయాయ కల్పతే** – ఈ ఐదుదశలూ దాటుకుంటూ వస్తే, అతను బ్రహ్మతో ఐక్యం చెందటానికి అర్హుడు అవుతాడు. బ్రహ్మభూయ అంటే బ్రహ్మభావన; బ్రహ్మభావన అంటే బ్రహ్మస్వరూపం; బ్రహ్మస్వరూపం అంటే నిర్గుణస్వరూపం; నిర్గుణస్వరూపం అంటే గుణాతీతత్వం. ఎవరైతే ఈ ఐదుదశల భక్తీ దాటుకుంటూ వస్తారో అతను గుణాతీతునిగా ఎదుగుతాడు.

### గుణాతీతుని సాధన – అవ్యభిచారభక్తి

శ్లో. 27 **బ్రహ్మణో హి ప్రతిష్ఠాహమ్ అమృతస్యావ్యయస్య చ ।**
**శాశ్వతస్య చ ధర్మస్య సుఖస్యైకాంతికస్య చ ॥**

బ్రహ్మణః, హి, ప్రతిష్ఠా, అహమ్, అమృతస్య, అవ్యయస్య, చ,
శాశ్వతస్య, చ, ధర్మస్య, సుఖస్య, ఐకాంతికస్య, చ ॥

| | | | |
|---|---|---|---|
| హి | = ఎందుకంటే | శాశ్వతస్య, ధర్మస్య, చ | = సనాతనమైన ధర్మమునకును |
| అవ్యయస్య | = నాశరహితుడైనట్టి | ఐకాంతికస్య, సుఖస్య | = అఖండానందమునకును |
| బ్రహ్మణః, చ | = పరబ్రహ్మకును | అహమ్, ప్రతిష్ఠా | = నేనే ఆధారమును |
| అమృతస్య, చ | = అమృతత్వమునకును | | |

**అమృతస్య అవ్యయస్య చ బ్రహ్మణః, శాశ్వతస్య చ ధర్మస్య,**
**ఏకాన్తికస్య సుఖస్య చ హి అహమ్ ప్రతిష్ఠా (అస్మి) ॥**

తా: ఎందుకంటే నాశరహితుడైనట్టి పరబ్రహ్మకును, అమృతత్వమునకును, సనాతనమైన ధర్మమునకును, అఖండానందమునకును నేనే ఆధారమును.

ఇంతకుముందు శ్లోకంతో అర్జునుడు అడిగిన మూడు ప్రశ్నలకు జవాబులు చెప్పేశాడు కృష్ణపరమాత్మ. ఈ శ్లోకంతో తన బోధకు ముగింపు పలుకుతున్నాడు. ఓ అర్జునా, నువ్వు పొందాలనుకున్న బ్రహ్మ, గుణాతీతుడు. ఆ గుణాతీతుడైన బ్రహ్మను నేనే అంటున్నాడు కృష్ణపరమాత్మ. కృష్ణపరమాత్మ మామూలు దేవకీనందన కృష్ణుడు కాదు; సాక్షాత్తూ నిర్గుణబ్రహ్మయొక్క సవికారరూపం.

**అహం హి బ్రహ్మణః ప్రతిష్ఠా** – నేనే ఆ నిర్గుణబ్రహ్మను. సగుణబ్రహ్మగా కనిపిస్తున్న నిర్గుణబ్రహ్మను. నిర్గుణబ్రహ్మ స్వరూపాన్ని వర్ణిస్తున్నాడు ఇక్కడ.

**అమృతస్య** – అమృతం; సత్యం.

**అవ్యయస్య** – నాశరహితం, అపక్షీయరహితం. అంటే జరావ్యాధులు లేవు.

**శాశ్వతస్య** – ఎన్నటికీ మార్పులేదు. ఈ మూడుపదాలనూ అంటే అమృతస్య, అవ్యయస్య, శాశ్వతస్య పదాలను కలిపితే, వాటి అర్థం నిర్గుణబ్రహ్మ షడ్వికారరహితం. అంటే కాలాతీతం అని అర్థం.

**ధర్మస్య** – ఇక్కడ ధర్మం అంటే ధర్మంద్వారా పొందే బ్రహ్మ; ధర్మంయొక్క లక్ష్యం. ధర్మం అంటే వేదాలు బోధించే బోధ. అందువల్ల ధర్మస్య అంటే వైదికధర్మ ప్రాపకస్య – వైదికధర్మాలు పాటించటంద్వారా, శాస్త్ర అధ్యయనం ద్వారా పొందాల్సిన లక్ష్యం నిర్గుణబ్రహ్మ.

**ఐకాంతికస్య సుఖస్య** – ఆనందస్వరూపం; దుఃఖమిశ్రితత్వం కాని ఆనందస్వరూపం. ఐకాంతకస్య సుఖం అంటే దుఃఖరహితసుఖం; కలుషితం లేని ఆనందం. లౌకికసుఖాల్లో దుఃఖమిశ్రితత్వం ఉంటుంది.

మార్పులేని, ఆనందస్వరూపమైన బ్రహ్మను నేను. అటువంటి నన్ను నువ్వు పొందగలవు. భక్తిలోని ఐదుదశల సాధనద్వారా పొందగలవు. దీనితో మూడుగుణాలైన సత్త్వ, రజ, తమోగుణాల వివరణ, వాటికి అతీతంగా ఎదిగే మార్గవిశ్లేషణ ముగిసింది. ఈ అధ్యాయాన్ని గుణత్రయ, గుణాతీత విభాగయోగము అనవచ్చు, కాని మూడు గుణాల గురించిన వివరం కాబట్టి ఇది గుణత్రయ విభాగయోగము అయింది.

**ఓం తత్సదితి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే**
**శ్రీకృష్ణార్జునసంవాదే గుణత్రయవిభాగయోగో నామ చతుర్దశోఽధ్యాయః**

హరి ఓం తత్సత్

ఇది శ్రీమద్భగవద్గీతయందు, ఉపనిషత్తులయందు, బ్రహ్మవిద్యయందు, యోగశాస్త్రమునందు, శ్రీకృష్ణార్జున సంవాదమునందు గుణత్రయవిభాగయోగము అనే పదునాల్గవ అధ్యాయము.

# త్రైగుణ్య విశ్లేషణ

| క్ర.సంఖ్య | అంశము | సత్త్వగుణము | రజోగుణము | తమోగుణము |
|---|---|---|---|---|
| 1. | లక్షణమ్<br>నిర్వచనం | ప్రకాశాత్మకము<br>మనస్సు ప్రకాశవంతంగా ఉంటుంది (6) | రాగాత్మకము<br>బంధించే స్వభావం (7) | మోహనాత్మకము<br>స్పష్టమైన ఆలోచన లేకపోవటం (8) |
| 2. | బంధన ప్రకారః<br>బంధించే స్వభావము | జ్ఞానసంగము<br>జ్ఞానతృష్ణ ఉంటుంది (6, 9) | కర్మసంగము<br>కర్మ చెయ్యాలనే తపన (7, 9) | ప్రమాదసంగము<br>నిర్లక్ష్యం, బద్ధకం, నిద్రకు లోనవటం (8, 9) |
| 3. | లింగమ్<br>ఏ గుణం ఎక్కువ ఉంటుంది | జ్ఞానవృద్ధి<br>జ్ఞానం వృద్ధి చెందుతుంది (11) | కర్మవృద్ధి<br>కర్మలు ఎక్కువ చేస్తాడు (12) | ప్రమాదావృద్ధి<br>నిర్లక్ష్యం ఎక్కువగా ఉంటుంది (13) |
| 4. | గతి<br>మరణాంతర ప్రయాణం | ఊర్ధ్వగతి<br>ఊర్ధ్వలోకాలకు వెళతాడు (14, 18) | మధ్యమగతి<br>మధ్యలోకంలో పుడతాడు (15, 18) | అధోగతి<br>అధోలోకాలకు వెళతాడు (15, 18) |
| 5. | ఫలమ్<br>ఈ జన్మలో కలిగే ఫలితం | పుణ్యం, జ్ఞానం<br>పుణ్యం, జ్ఞానం పొందుతాడు<br>(16, 17) | దుఃఖం, లోభం<br>దుఃఖం, అత్యాశ కలుగుతాయి<br>(16, 17) | అజ్ఞానం, మోహం<br>అజ్ఞానం, సంఘర్షణ కలుగుతాయి<br>(16, 17) |

# అధ్యాయము 14 – గుణత్రయవిభాగయోగము సారాంశము

ఈ పద్నాలుగవ అధ్యాయము, ముందు అధ్యాయములాగ మూడవషట్కములోకి వస్తుంది. ఆరు అధ్యాయాలు ఉన్న ఈ షట్కములో కృష్ణపరమాత్మ జ్ఞానయోగాన్ని బోధిస్తున్నాడు. అందువల్ల ఈ షట్కములో, ఇంకా ప్రత్యేకించి చెప్పాలంటే 13, 14, 15 అధ్యాయాల్లో ఉపనిషత్తుల్లోని ముఖ్యమైన బోధయొక్క సారాన్ని వివరిస్తున్నాడు కృష్ణపరమాత్మ. 16, 17 అధ్యాయాల్లో జ్ఞానయోగసాధనలను వివరిస్తాడు. జ్ఞానయోగం ఆత్మజ్ఞానం పొందటానికి దోహదం చేస్తుంది. 13,14,15 అధ్యాయాలు చూడటానికి చిన్నవిగా ఉన్నా అవి ఆత్మజ్ఞానాన్ని బోధిస్తాయి కాబట్టి చాలా ముఖ్యమైన అధ్యాయాలు.

ఈ అధ్యాయము పేరు గుణత్రయవిభాగయోగము. ఇందులో కృష్ణపరమాత్మ మూడుగుణాల గురించి విశ్లేషణ చేసి, ఈ మూడుగుణాలకూ అతీతంగా ఎదగటమెలాగో వివరించాడు. గుణత్రయంనుంచి గుణాతీత ఆత్మకు ఎదగటం విషయవస్తువు కాబట్టి, ఈ అధ్యాయాన్ని గుణత్రయవిభాగయోగము అంటారు.

ఈ అధ్యాయాన్ని ప్రధానంగా నాలుగు అంశాలుగా విభజించవచ్చు. అవి –

| | |
|---|---|
| **1. ఉపోద్ఘాతం** | **– శ్లోకాలు: 1-4** |
| **2. త్రైగుణ్యవిశ్లేషణ** | **– శ్లోకాలు: 5-18** |
| **3. గుణాతీతంగా ఎదగటం** | **– శ్లోకాలు: 19, 20** |
| **4. గుణాతీత లక్షణం, సాధన** | **– శ్లోకాలు: 21-27** |

**1. ఉపోద్ఘాతం – శ్లోకాలు: 1-4**

ఈ అధ్యాయములోని మొదటి నాలుగు శ్లోకాల్లో కృష్ణపరమాత్మ తను చెప్పబోయే అంశానికి ఉపోద్ఘాతం చెప్పాడు. ఈ అధ్యాయాలు ఆత్మజ్ఞానాన్ని బోధిస్తాయని చూశాము. ఆత్మజ్ఞానం మోక్షాన్ని కలుగజేస్తుంది కాబట్టి, అది గొప్ప జ్ఞానము. ఉపనిషత్తులు లౌకికవిద్యను అపరావిద్య అనీ, ఆత్మజ్ఞానాన్ని పరావిద్య అనీ అంటాయి.

తొమ్మిదవ అధ్యాయంలో ఈ పరావిద్యనే రాజవిద్య అన్నాడు కృష్ణపరమాత్మ. పరావిద్యను రాజవిద్య అని ఎందుకన్నాడు? ఈ ఒక్క విద్యే సాధకుణ్ణి సంసారంనుంచి ముక్తి పొందించి, మోక్షాన్ని కలుగజేస్తుంది. తక్కిన లౌకికవిద్యలు ఎంత నేర్చుకున్నా, నేర్చుకున్నది చాలా తక్కువ అనే పరిమితి ఉన్న భావనను కలుగజేస్తాయి. కాని రాజవిద్యలో నేను శాశ్వతమైన, పూర్ణమైన బ్రహ్మను అని నేర్చుకుంటాడు కాబట్టి పూర్ణత్వభావన ఏర్పడుతుంది. అందువల్ల సాధకుడు జీవించివుండగానే, అంటే ఇప్పుడే, ఇక్కడే మోక్షాన్ని పొందుతాడు; మరణించాక విదేహముక్తి పొందుతాడు. విదేహముక్తి అంటే ఇంక మరుజన్మ ఉండదు. పునరపి జననం, పునరపి మరణం అనే వృత్తంలో పడి కొట్టుమిట్టాడడు.

**సర్గేఽపి నోపజాయంతే ప్రలయే న వ్యథంతి చ** - 14.2

ఈ జ్ఞానాన్ని పొందినవారు మళ్ళీ జన్మించరు, మళ్ళీ మరణించరు.

ఈ విధంగా తను చెప్పబోయే అంశం ఉత్తమమైన జ్ఞానమనీ, ఫలం ఉత్తమఫలమైన మోక్షమనీ పరిచయం చేశాక కృష్ణపరమాత్మ తన బోధకు పునాదిరాయి కింద సృష్టిప్రక్రియను టూకీగా వివరించాడు.

భగవంతుడు జగత్కారణం అని చెప్పి, భగవంతునిలో రెండు అంశాలు ఉన్నాయని చెప్పాడు. అవి చేతనతత్త్వం, జడతత్త్వం.

**చేతన అచేతన తత్త్వద్వయ మిలితః ఈశ్వరః**

ఈ చేతన అచేతన తత్త్వాలను రకరకాలుగా పిలుస్తారు.

అధ్యాయం 7 - పరాప్రకృతి, అపరాప్రకృతి

అధ్యాయం 13 - పురుషుడు, ప్రకృతి

ఉపనిషత్తులు - బ్రహ్మ, మాయ

బ్రహ్మ + మాయ = ఈశ్వరుడు అంటాయి ఉపనిషత్తులు. ఇటువంటి చేతన, అచేతన మిశ్రమంనుంచి ఈ సమష్టి జగత్తు, వ్యష్టిజీవి వచ్చాయి. ఈ వివరణ ప్రకారం ప్రతి ఒక్క జీవికూడా చేతన, అచేతన తత్త్వాల మిశ్రమం అవ్వాలి. ఎందుకు? ప్రకృతిసూత్రం ప్రకారం కారణం ఏదైతే, కార్యంలో కారణగుణం ఉంటుంది. తల్లిదండ్రులు ఎలావుంటే, పిల్లలు అలా ఉంటారు. ఇది ఒక్కో సందర్భంలో జీర్ణించుకోవటం కష్టమైనా, అది సూత్రం. అందువల్లనే చూడండి, పిల్లలు ప్రవర్తించిన తీరును విమర్శించేటప్పుడు వీరు ఎవరిపిల్లలు అంటారు?

ఈ సూత్రం ప్రకారం నేను అనే వ్యష్టి కూడా ప్రకృతి, పురుషుల మేలుకలయికను. వీటికి ఉన్న భిన్నమైన పేర్లు చూశాము. ఆ పేర్లపరంగా చూస్తే నేను బ్రహ్మ-మాయల మేలుకలయికను; చేతన-అచేతన తత్త్వాల మేలుకలయికను. సాంకేతిక పరిభాషలో చెప్పాలంటే ఆత్మ-అనాత్మల మేలుకలయికను. అంటే అనాత్మభాగం ప్రకృతినుంచి వచ్చింది.

ఈ సూత్రాన్నిబట్టి ఇంకొక ఉపసిద్ధాంతాన్ని చెప్పవచ్చు. ప్రకృతికి మూడుగుణాలు ఉన్నాయి; ప్రకృతినుంచి అనాత్మ వచ్చింది; కాబట్టి నా అనాత్మకు కూడా మూడుగుణాలు ఉన్నాయి. ముందు, ఆత్మ అంటే ఏమిటో, అనాత్మ అంటే ఏమిటో, తెలుసుకోవాలి. అనాత్మ అంటే కార్యకరణసంఘాతం అయిన ఈ మనశ్శరీరాలు. ఈ అనాత్మ భాగాన్ని అహంకారం అంటారు. ఇది సగుణం. అంటే ప్రకృతిలో ఉన్న మూడుగుణాలతో కూడినది.

అనాత్మకాక ఆత్మ ఉంది. ఈ ఆత్మకు పర్యాయపదాలు పురుషుడు, చేతనతత్త్వం, నిర్గుణబ్రహ్మ, సాక్షిచైతన్యం అంటారు.

**నేను = సగుణ అహంకారం + నిర్గుణసాక్షి**

అహంకారం మాత్రమే ప్రపంచంలో వ్యవహారం నడపలేదు; అలాగే సాక్షిచైతన్యం మాత్రమే ప్రపంచంలో వ్యవహారం నడపలేదు. సాక్షి, అహంకారాల మేలుకలయికతోనే నేను ప్రపంచంలో వ్యవహారం నడుపుతాను.

ఈ రెండింటిలో నేను ఎవరు? నేను సాక్షిచైతన్యాన్ని. ఈ బోధయొక్క ముఖ్య ఉద్దేశమే ఉన్నతస్థాయికి చెందిన ఈ సాక్షిచైతన్యానికి ఎదిగేలాగా చెయ్యటం. సాక్షి శాశ్వతం, పరిపూర్ణం. అది నా స్వరూపం. అహంకారం అశాశ్వతం, పరిచ్ఛిన్నం, అది నా స్వరూపం కాదు. అలాగని అహంకారాన్ని పూర్తిగా నిర్లక్ష్యం కూడా చెయ్యకూడదు. ఎందుకంటే అహంకారం లేకుండా శుద్ధసాక్షి వ్యవహారం నడుపలేదు. అందువల్ల అహంకారానికి విలువ ఇవ్వాలి నిజమే, కాని మితిమీరిన ప్రాముఖ్యతను ఇవ్వకూడదు. అహంకారంమీద మమకారం పెంచుకుంటే అది అనేక సమస్యలకు దారితీస్తుంది. అందువల్ల నేను అహంకారాన్ని కాను, నేను సాక్షిని, అహంకారం అనే కవచం ధరించాను నేను అని అర్థం చేసుకోవాలి. ఈ విషయం అర్థం కావటానికి కృష్ణపరమాత్మ ప్రకృతి-పురుషులనుంచి సృష్టి ఎలా వచ్చిందో వివరించాడు. అదే విధంగా నేను కూడా ప్రకృతి అంశ-పురుష అంశల మేలుకలయికను అని అర్థం చేసుకోవాలి.

## 2. త్రైగుణ్యవిశ్లేషణ - శ్లోకాలు: 5-18

ఈ శ్లోకాల్లో కృష్ణపరమాత్మ అహంకారానికి ఎలా మూడుగుణాలు ఉన్నాయో విశ్లేషించుకుంటూ వచ్చాడు. ఈ గుణాలను సరిగ్గా అర్థం చేసుకోకపోతే, అవి మనను బంధించివేసే ప్రమాదం ఉంది. ఆమాటకొస్తే, సృష్టిలో ఏ విషయం తీసుకున్నా కూడా, దాన్ని సరిగ్గా వినియోగించుకోకపోతే అది హానిచేసే ప్రమాదం ఉంది. అగ్ని వరమా, శాపమా? మనం వాడే విధానాన్నిబట్టి ఉంటుంది. విద్యుచ్ఛక్తి వరమా, శాపమా? అదే జవాబు మళ్ళీ. ఈ రెండూ వాటంతట అవి వరమూ కాదు, శాపమూ కాదు. వాటిని మనం అర్థం చేసుకుని వాడే విధానంలో ఉంటుంది. ఇప్పుడు ఈ మూడుగుణాల విషయానికి వస్తే, అవి వరమా, శాపమా? అదే జవాబు మళ్ళీ. మనం వాటిని వాడే విధానాన్నిబట్టి ఉంటుంది. వాటిని సరిగ్గా వాడుకోవాలి అంటే వాటి గురించిన సరియైన జ్ఞానం ఉండాలి. గుణం పదానికి ఇంకో అర్థం ఉంది. 'తాడు' లాగా, గుణానికి మనను బంధించే గుణం ఉంది. అందువల్ల గుణాలయొక్క గుణాలను వివరంగా విశ్లేషించుకొచ్చాడు కృష్ణపరమాత్మ. మనం తేలికగా వాటిని అర్థం చేసుకోవటానికి కృష్ణపరమాత్మ వాటిని ఐదు అంశాలుగా విభజించాడు. గుణవిశ్లేషణ అంటే అహంకార విశ్లేషణగా తీసుకోవచ్చు. ఎందుకంటే ఈ గుణాలు అహంకారానికే ఉంటాయని చూశాము.

అహంకారం = ప్రకృతి + చిదాభాస

ఆ ఐదు అంశాలు లక్షణమ్,బంధన ప్రకారః, లింగమ్, గతి, ఫలమ్.

ఎ) **లక్షణమ్** - లక్షణం అంటే నిర్వచనం. సత్త్వగుణం లక్షణం ప్రకాశాత్మకము, రజోగుణం లక్షణం రాగాత్మకము, తమోగుణం లక్షణం మోహనాత్మకము.

సత్త్వగుణం జ్ఞానంమీద మక్కువను కలుగుజేస్తుంది. అటువంటి వ్యక్తిలో జ్ఞానేంద్రియాలు, బుద్ధి చాలా హుషారుగా పనిచేస్తాయి. రజోగుణం కర్మమీద మక్కువను కలుగజేస్తుంది. ఇతనిలో కర్మేంద్రియాలు బాగా హుషారుగా ఉంటాయి. సత్త్వగుణం ఉన్నవ్యక్తి జ్ఞానప్రధానంగా ఉంటే, రజోగుణం ఉన్నవ్యక్తి కర్మప్రధానంగా ఉంటాడు. తమోగుణం ఉన్నవ్యక్తి ఈ ఇద్దరికీ పూర్తిభిన్నంగా ఉంటాడు. ఇతను బద్ధకంగా ఉంటాడు.

బి) **బంధన ప్రకారః** – బంధనం అంటే బంధకత్వం. ప్రకారః అంటే పద్ధతి. ఏ గుణం ఏ ప్రకారంగా బంధిస్తుందో చెబుతుంది. జ్ఞానసంగేన సత్త్వం బధ్నాతి; కర్మసంగేన రజః బధ్నాతి; నిద్రాసంగేన తమః బధ్నాతి. అంటే సత్త్వగుణానికి జ్ఞానసంగము, రజోగుణానికి కర్మసంగము, తమోగుణానికి ప్రమాదసంగము ఉంటాయి.

జ్ఞానసంగం ఉన్నవ్యక్తికి నేర్చుకోవాలనే తపన ఉంటుంది. అతను పుస్తకాలు ఎక్కువగా ఉండేచోటు, దేదీప్యమానంగా వెలిగే కాంతి కోరుకుంటాడు. అటువంటి వ్యక్తిని పుస్తకాలపురుగు అంటారు. కాని ఇప్పటి ఆధునికయుగంలో ఏ ఒక్క ఇంట్లో పుస్తకాలు ఎక్కువగా కనబడవు. లైటువెలుగు గురించి చెప్పనే అవసరం లేదు. చిన్నచిన్న లైట్లు ఎక్కడో మిణుకుమిణుకుమంటూ వెలుగుతాయి. అదేమిటి ట్యూబులైటు లేదా అంటే ఇదేమన్నా  సభా! అంత అదిరిపోయే వెలుగు రావటానికి అని, ఎదురు మననే ప్రశ్నిస్తారు. అంతేకాదు, అటువంటి ఇళ్ళలో చదువుకునేందుకు అవసరమైన బల్ల, కుర్చీలు కూడా ఉండవు. పెన్ను, పేపరు, రబ్బరు, పెన్సిలులాంటివి వెతికిచూసినా కనబడవు. చదువులు అయిపోయాక, వారు పెన్ను వాడేది ఏ టెలిఫోను నంబరో రాసుకోవటానికి. ఆ పెన్ను కూడా తీరా అవసరం వచ్చేసరికి రాయదు, ఎండిపోయి ఉంటుంది. జ్ఞానసంగం ఉన్న సత్త్వగుణం ఉన్న వ్యక్తి అటువంటి వాతావరణంలో క్షణంకూడా ఇమడలేడు. అతను తన జ్ఞానాన్ని పెంపొందించుకోవటానికి అనువైన వాతావరణం లేకపోతే చిరాకుగా, అశాంతిగా ఉంటాడు. జ్ఞానసంగేన సత్త్వం బధ్నాతి.

దానికి పూర్తి విరుద్ధం రజోగుణం. రజోగుణం ఉన్నవ్యక్తికి లైబ్రరీ పడదు. అతను క్షణం ఖాళీగా కూర్చోలేడు. పనిరాక్షసుడు, వర్క్‌హాలిక్ అంటారు అటువంటివారిని. అందువల్ల అతను పనిచెయ్యటానికి వీలైన వాతావరణం ఉండాలి అతనికి. అటువంటి వాతావరణం లేకపోతే అతనికి తోచదు. అతన్ని తీసుకువెళ్ళి ప్రశాంతంగా ఉండే ఏ ఆశ్రమంలోనో మూడురోజులు ఉంచితే, అతనికి పిచ్చెక్కటమే కాక, పక్కవారికి కూడా పిచ్చెక్కిస్తాడు. కర్మసంగేన రజః బధ్నాతి. తమోగుణం ఉన్నవ్యక్తి అటు జ్ఞానమూ పొందటానికి ప్రయత్నించడు; ఇటు కర్మమీదా ఆసక్తి చూపించడు. నిద్రాసంగేన తమః బధ్నాతి.

సి) **లింగమ్** – ఒకవ్యక్తిలో ఏగుణం ఎక్కువగా ఉందో తెలుసుకునే మార్గాన్ని లింగం అంటారు. సత్త్వగుణం ఉన్నవ్యక్తిలో జ్ఞానవృద్ధి; రజోగుణం ఉన్నవ్యక్తిలో కర్మవృద్ధి; తమోగుణం ఉన్నవ్యక్తిలో ప్రమాదవృద్ధి అధికంగా కనిపిస్తాయి.

సత్త్వగుణం ఉన్నవ్యక్తి ఎక్కువగా చదువుతూ, ఆలోచనల్లో తార్కికంగా విచారణ చేస్తూ, బుద్ధికి పదును పెడుతూ ఉంటాడు. ఇతను అంతర్ముఖుడవుతాడు. రజోగుణం ఉన్నవ్యక్తి ప్రవృత్తి ప్రధానంగా ఉంటాడు. ఇతను బహిర్ముఖంగా ఉంటాడు. తమోగుణం ఉన్నవ్యక్తికి ప్రవృత్తీ ఉండదు, నివృత్తీ ఉండదు. అన్నింటిలోనూ నిరాసక్తితో ఉంటాడు.

డి) **గతి** – దీన్ని మరణాంతర ప్రయాణం అంటారు. సత్త్వగుణం ఉన్నవ్యక్తి గతి ఊర్ధ్వగతి; రజోగుణం ఉన్నవ్యక్తి గతి మధ్యమగతి; తమోగుణం ఉన్నవ్యక్తి గతి అధోగతి అవుతాయి. సత్త్వగుణం ఉన్నవ్యక్తి మరణించాక ఊర్ధ్వలోకాలకు వెళతాడు; రజోగుణం ఉన్నవ్యక్తి మరణించాక మళ్ళీ మనుష్యలోకంలోనే పుడతాడు. మనుష్యలోకం ఒక్కటే కర్మభూమి.

**కర్మానుబంధీని మనుష్యలోకే** – 15.2

తమోగుణం ఉన్నవ్యక్తి అధోలోకాలకు వెళతాడు.

ఇ) **ఫలమ్** – గతి అంటే మరణించాక అతను వెళ్ళే లోకం; ఫలం అంటే జీవించివుండగానే అతను పొందే ఫలితం. సత్త్వగుణం ఉన్నవ్యక్తి పుణ్యం, జ్ఞానం పొందుతాడు; రజోగుణం ఉన్నవ్యక్తికి దుఃఖం, అత్యాశ కలుగుతాయి; తమోగుణం ఉన్నవ్యక్తికి అజ్ఞానం, సంఘర్షణ కలుగుతాయి.

సత్త్వగుణప్రధానంగా ఉన్న వ్యక్తికి ఇంద్రియాలు చురుకుగా ఉంటాయి కాబట్టి అంతులేని జ్ఞానసంపదను పొందుతాడు; రజోగుణప్రధానం ఉన్నవ్యక్తికి లోభం ఏర్పడుతుంది. అందువల్ల కర్మవృద్ధి జరిగినా, దుఃఖం కలుగుతుంది. తమోగుణప్రధానంగా ఉన్నవ్యక్తి ప్రమాద (అశ్రద్ధ), మోహాల్లో పడతాడు. దేనిమీదా శ్రద్ధ ఉండదు కాబట్టి అజ్ఞానం పోదు.

### 3. గుణాతీతంగా ఎదగటం – శ్లోకాలు: 19, 20

ఈ శ్లోకాల్లో ఈ మూడుగుణాలకు అతీతంగా ఎదగటమెలాగో చూపించాడు కృష్ణపరమాత్మ. ఈ మూడు గుణాలకు అతీతంగా ఎదగాలంటే, ఈ మూడుగుణాలను వాడాలి. ఒక అరటిపండు పక్వానికి రావాలంటే దానికి బయట తొక్క ఉండితీరాలి. పండు పక్వానికి వచ్చాక తొక్క తేలికగా ఊడుతుంది. అంటే ఒక పండు పరిపక్వం చెందేవరకూ తొక్క అవసరం. అది ఒకసారి పరిపక్వం చెందాక, దాని అవసరం లేదు. కాని అయ్యో అది పండటానికి తొక్క తోడ్పడింది, నేను తొక్కను పారేస్తే అది కృతఘ్నత చూపినట్టు అవుతుందని అరటిపండును తొక్కతోసహా తింటామా? లేదు. తొక్కను తిననంతమాత్రాన దాన్ని అగౌరవపరిచినట్టు కాదు.

అదేవిధంగా మనం గుణాతీతంగా ఎదిగేదాకా, గుణత్రయం అవసరం. మన ఆధ్యాత్మిక సాధన తమోగుణం నుంచి రజోగుణానికి, రజోగుణంనుంచి సత్త్వగుణానికి సాగాలి. సత్త్వగుణానికి ఎదిగాక, గుణాతీతంగా ఎదగాలి. అలా కిందనుంచి మొదలుపెట్టి గుణాతీతంగా ఎదగటానికి శాస్త్రం ఏ విధంగా తోడ్పడుతుంది?

ఎ) **సకామకర్మ** – కిందిస్థాయి తమోగుణం; అతనికి ఏ పనిమీదా శ్రద్ధ ఉండదని చూశాము. అటువంటి వ్యక్తిని మేలుకొలపటానికి శాస్త్రం అనేక కర్మలను సూచిస్తుంది. ఎటువంటి కర్మలు అవి? సకామకర్మలు. అతను జీవితంలో కోరుకున్న లౌకికఫలాలను పొందటానికి చేసే స్వార్థపూరితకర్మలు అవి.

నేటి ప్రకటనలు ఎలాగైతే మనలో కోరికలు పెంపొందించటానికి తోడ్పడతాయో, అలా ఎప్పుడో నే వేదపూర్వభాగం కోరికలు పెంపొందించటానికి తోడ్పడింది. ఎందుకు? తమోగుణం ఉన్నవ్యక్తిని మేలుకొలపటానికి. తమోగుణం ఉన్నవ్యక్తి నిద్రమత్తుతో బద్ధకంగా ఉంటాడు. ఏ పనిమీదా ఆసక్తి ఉండదు. అటువంటి వ్యక్తికి కొన్ని ఆశలు చూపి, స్వార్థంకోసం కర్మలు చేసేలాగా ప్రలోభపెడుతుంది.

బి) **నిష్కామకర్మ** – కొన్నాళ్ళు తమోగుణం ఉన్నవ్యక్తి సకామకర్మలు చేసి, వాటికి అటువాటుపడ్డాక, నెమ్మదిగా అతన్ని ఇంకొకమెట్టు పైకెక్కిస్తుంది.

రజోగుణంలో మళ్ళీ రెండురకాలు ఉంటాయి. రెండురకాల్లోనూ రజోగుణం ఎక్కువగానే ఉంటుంది కాని తక్కిన రెండుగుణాల నిష్పత్తిలో భేదం ఉంటుంది. మొదటిరకంలో తమోగుణం ఎక్కువ ఉండి, సత్త్వగుణం తక్కువ ఉంటుంది. దీన్ని **రతస** అంటారని చూశాము. రెండవరకంలో తమోగుణం వెనక్కివెళ్ళి సత్త్వగుణం కొంచెం ముందుకు వస్తుంది. దీని **రసత** అంటారని చూశాము.

సకామకర్మ చేసేవ్యక్తిని **రతస** అనవచ్చు. రతస స్థాయినుంచి అతను నెమ్మదిగా **రసత** స్థాయికి ఎదగాలి. రతసను శంకరులవారు తమః ఉపసర్జన రజః అనీ, రసతను సత్త్వ ఉపసర్జన రజః అనీ పేర్కొన్నారు. ఈ రెండింటిలోనూ రజోగుణం ప్రధానంగా ఉంటుంది కాబట్టి, రెండింటిలోనూ ఒకవ్యక్తి కర్మలు హుషారుగా చేస్తాడు, కాకపోతే అతను కోరే ఫలాల్లో భేదం ఉంటుంది. రజోగుణంతో పాటు తమోగుణం దగ్గరగా ఉన్నవ్యక్తి తను, తన కుటుంబంకోసం కోరిక కోరితే, రజోగుణంతో పాటు సత్త్వగుణం దగ్గరగా ఉన్నవ్యక్తి సమాజశ్రేయస్సుకోసం కర్మలు చేస్తాడు. ఒక్కముక్కలో చెప్పాలంటే మొదటిరకం వ్యక్తి స్వార్థపూరితమైన కర్మలు చేస్తే, రెండవరకం వ్యక్తి స్వార్థరహితమైన కర్మలు చేస్తాడు. సాంకేతికంగా చెప్పాలంటే మొదటివి సకామకర్మలు, రెండవరకంవి నిష్కామకర్మలు. దీన్నే నాలుగవ అధ్యాయంలోని భాషలో చెప్పాలంటే గుణశూద్రుడు, గుణవైశ్యుని స్థాయికి, గుణవైశ్యుడు గుణక్షత్రియుని స్థాయికి ఎదగటం. గుణక్షత్రియుడు దేశసేవ చేస్తాడు; సమాజంకోసం పాటుపడతాడు.

ఈ రెండుదశలనూ కలిపి కర్మయోగము అంటారు. సకామకర్మ, నిష్కామకర్మలు పన్నెండవ అధ్యాయంలో కర్మయోగానికి చూసిన రెండుదశలు.

సి) **ఉపాసనయోగము** – కర్మయోగం ప్రకారం జీవితం గడిపాక, ఉపాసనయోగానికి రమ్మంటుంది శాస్త్రం. అంటే గుణక్షత్రియునిగా జీవితం గడిపాక, గుణబ్రాహ్మణునిగా జీవించాలి అంటుంది. గుణబ్రాహ్మణుని జీవితం సత్త్వగుణప్రధానంగా ఉంటుంది. అంటే చాలా హుషారుగా అనేక కర్మలు చేశాక, నిదానంగా బాహ్యాముఖంగా ఉన్న స్థాయినుంచి అంతర్ముఖులవ్వాలి. మనకు వర్ణాశ్రమధర్మాలు ఉన్నాయి. గృహస్థాశ్రమంలో కర్మలు చేస్తారు. గృహస్థాశ్రమంనుంచి వానప్రస్థ ఆశ్రమానికి వెళ్ళాలి. శారీరకంగా ఇల్లువదిలి ఎక్కడికో వెళ్ళనవసరంలేదు, జీవనవిధానం మారాలి. అంతర్ముఖులవ్వాలి. కర్మలు తగ్గించి, ఉపాసన చెయ్యాలి. ఉపాసన సాధన చేస్తే సత్త్వగుణం ప్రధానంగా ఉండేలా మారవచ్చు.

కర్మయోగం చేసి ఉపాసనయోగానికి వస్తే, అతనికి ఏ బాధా ఉండదు. ఎందుకంటే సమాజానికి చెయ్యాల్సిన సేవ ఏదో చేసే వచ్చాడు. అలా చెయ్యకుండా, సరాసరి ఉపాసనకు వస్తే, సమాజానికి ఏమీ చెయ్యలేదనే అపరాధభావన మిగిలిపోతుంది. అందువల్ల కర్మచేసి, ఉపాసనకు రావాలి.

అంతేకాదు, వానప్రస్థ ఆశ్రమానికి వచ్చేసరికి, శరీరం కూడా సహకరించదు. ఆ వయస్సులో లేచి కూర్చోవటమే చాలా కష్టం. అలాంటివ్యక్తి ఏ కర్మ చెయ్యగలడు? అతని పని అతను స్వంతంగా చేసుకోలేడు. అతను లేవటానికే ఇంకొకరు చెయ్యి అందించాల్సి ఉంటుంది. అందువల్ల కూడా అతను హుషారుగా కర్మలు చెయ్యలేడు.

ఇంతవరకూ జరిగిన ప్రయాణాన్ని టూకీగా చూస్తే ఒక సాధకుడు తమోగుణంనుంచి రజోగుణానికి వచ్చి, రజోగుణంనుంచి సత్త్వగుణానికి ఎదిగాడు. అలా ఎదగటానికి అతనికి కర్మయోగం, ఉపాసనయోగం పాటుపడ్డాయి. ఈ ఉపాసనయోగాన్ని కూడా రెండు స్థాయిల్లో పన్నెండవ అధ్యాయంలో చూశాము.

డి) **జ్ఞానయోగం** – ఇంతవరకూ ప్రయాణం సాఫీగా సాగిపోయింది. తమోగుణంనుంచి రజోగుణానికి, రజోగుణంనుంచి సత్త్వగుణానికి ఎదగటం తేలికే. కాని ఇప్పుడు సత్త్వగుణంనుంచి గుణాతీతునిగా ఎదిగే ప్రయాణమే కష్టం. ఆ ప్రయాణం పూర్తిగా భిన్నమైన ప్రయాణం.

సత్త్వగుణాన్ని నిర్గుణంగా మార్చలేము. సత్త్వగుణాన్ని మార్చాలంటే అది మళ్ళీ తమోగుణంగానో, రజోగుణంగానో మారుతుంది. గుణత్రయంనుంచి నిర్గుణానికి లేదా గుణాతీతానికి ఎదగటానికి ఈ రెండింటినీ కలిపే రహదారి ఏమీలేదు. దీనికి భిన్నమార్గం ఉందని చూశాము. ఆ మార్గం పేరు **జ్ఞానయోగం**.

అందువల్ల ఒకవ్యక్తి సత్త్వగుణాన్ని పెంపొందించుకున్నాక, కర్మయోగాన్ని వదిలివేస్తాడు; ఉపాసనయోగాన్ని వదిలివేస్తాడు. ఎందుకంటే అవి అతనిలో సత్త్వగుణాన్ని పెంచటానికి దోహదం చేశాయి. సత్త్వగుణప్రధానవ్యక్తిని సాధనచతుష్టయ సంపన్న అధికారి అంటారు. అతను అధికారిత్వం సంపాదించుకున్నాడు కాబట్టి కర్మయోగం, ఉపాసనయోగాలను వదిలి ముందుకుసాగాలి. ఏంచెయ్యాలి? జ్ఞానయోగానికి రావాలి. ఆ విషయం కృష్ణపరమాత్మ చాలా స్పష్టంగా చెప్పాడు.

**నాన్యం గుణేభ్యః కర్తారం యదా ద్రష్టానుపశ్యతి ।**

**గుణేభ్యశ్చ పరం వేత్తి మద్భావం సోఽధిగచ్ఛతి ॥** – 14.19

ముందే చూసినట్టుగా ఈ శ్లోకంలో ముఖ్యమైన పదం **వేత్తి**. వేత్తి అంటే అర్థం చేసుకున్న అని వస్తుంది. దేన్ని అర్థం చేసుకున్న? పూర్ణత్వాన్ని అర్థం చేసుకున్నవ్యక్తి. పూర్ణత్వాన్ని జ్ఞానంద్వారా పొందుతాడు. జ్ఞానం ఎలా పొందాలో ఈ శ్లోకంలో చెప్పలేదు కృష్ణపరమాత్మ. ఎందుకంటే నాలుగవ అధ్యాయంలో దానిగురించి చెప్పాడు. మీలో తామసికగుణం ఉన్నా, రాజసికగుణం ఉన్నా, అజ్ఞానంతో ఉన్న మనస్సు అజ్ఞానంతోనే ఉంటుంది. జ్ఞానం దానంతట అది రాదు. ఆమాటకొస్తే ఏ జ్ఞానం కూడా దానంతట అది రాదు.

దయానందస్వామీజీ దీన్ని అద్భుతంగా చెబుతారు: ధ్యానంలో నిశ్శబ్దంగా కూర్చుంటే జరిగేది ఏమిటి? అంతకుముందు అల్లకల్లోలంగా ఉండి, అజ్ఞానంతో ఉన్న మనస్సు ఇప్పుడు ప్రశాంతంగా ఉండి, అజ్ఞానంతో ఉంటుంది. అంతే. ధ్యానంలో జ్ఞానం రాదు. దానికోసం ప్రయత్నం చెయ్యాలి.

**తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా ।**

**ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానినస్తత్త్వదర్శినః ॥** – 4.34

జ్ఞానయోగం అంటే ఎప్పుడో బుద్ధిపుట్టినప్పుడు ఇక్కడ కొంచెం, అక్కడ కొంచెం వినటం కాదు. అలా చెదురుమదురుగా విన్నవి మిమ్మల్ని ప్రేరేపిస్తాయి కాని, బోధ చెయ్యవు. దయానందస్వామీజీ అంటారు, ప్రసంగం ఇవ్వటం వేరు, బోధచెయ్యటం వేరు. అందువల్ల జ్ఞానయోగం అంటే శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ అయిన గురువు

దగ్గరికి వెళ్ళి వేదాంతాన్ని ఒక క్రమపద్ధతిలో అధ్యయనం చెయ్యటం. క్రమపద్ధతిలో శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చెయ్యటం.

శ్రవణం అంటేనే క్రమం తప్పకుండా, ఒక క్రమపద్ధతిలో కొన్ని సంవత్సరాలపాటు శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ అయిన గురువు దగ్గర వేదాంతశాస్త్ర అధ్యయనం చెయ్యటం. అది అజ్ఞాననివృత్తి చేస్తుంది. మననం – ఆ బోధలో కలిగిన సంశయాలను పారద్రోలి, నిస్సంశయజ్ఞానాన్ని కలుగజేస్తుంది. అంటే మననం సంశయనివృత్తి చేస్తుంది. నిదిధ్యాసనం – నేర్చుకున్న జ్ఞానాన్ని జీర్ణించుకోవటానికి తోడ్పడుతుంది. అంటే ఎన్నో సంవత్సరాలుగా పాతుకుపోయిన రాగద్వేషాలలాంటి విపరీతభావనలను పారద్రోలి జ్ఞాననిష్ఠలో నిలబడేందుకు తోడ్పడుతుంది. అంటే నిదిధ్యాసనం విపరీతభావనల నివృత్తి చేస్తుంది. అలా శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేస్తే గుణాతీతునిగా ఎదుగుతాడు.

శ్రవణం ద్వారా గుణాతీతునిగా ఎదగటమెలా? ముందే చూసినట్టుగా, మనశ్శరీరాలు ఎప్పటికీ సగుణమే; అవి ఎన్నటికీ నిర్గుణం కాలేవు. సాక్షి ఎప్పటికీ నిర్గుణమే; దాన్ని నిర్గుణంగా మార్చనవసరం లేదు. అయితే ఏంచెయ్యాలి? నేను శరీరం అనే దేహాభిమానాన్ని వదులుకుని, నేను సాక్షిని, ఈ శరీరం నేను వ్యవహారం నడపటానికి వాడుకునే పరికరం అని అర్థం చేసుకోవాలి. సాక్షిచైతన్యం నా అసలు స్వరూపం, మనశ్శరీరాలు ఆగంతుక స్వరూపం.

కళ్ళజోడుతో నేను ప్రపంచాన్ని చూస్తాను. కళ్ళజోడు తీసేస్తే ఏమవుతుంది? నేను మాయమవను గాని, ఆ కళ్ళజోడుద్వారా నేను చూసే ప్రపంచం మాయమవుతుంది. అంటే నాకు సరిగ్గా కనపడదు. అదేవిధంగా మనశ్శరీరాలను నిషేధిస్తే, నేను మాయమవను కాని, అవి లేకుండా నేను ప్రపంచంతో, తోటి మనుష్యులతో వ్యవహారం నడపలేను. ఇటువంటి అనుభవం నాకు ప్రతిరోజూ, సరిగ్గా చెప్పాలంటే ప్రతిరాత్రీ అవుతుంది. ఎప్పుడు? సుషుప్తిలో. సుషుప్తిలో మనశ్శరీరాలు పడుకుంటాయి. అవి లేనప్పుడు బాహ్యప్రపంచం కూడా మాయమవుతుంది; వ్యవహారం నడవదు. అంటే ఒకకాలంలో ఉండి, ఇంకొకకాలంలో లేని కార్యకరణ సంఘాతాన్ని కాను నేను. నేను కార్యకరణ సంఘాతాన్ని కాకపోతే, నేనెవరు?

**క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి సర్వక్షేత్రేషు భారత ।**
**క్షేత్రక్షేత్రజ్ఞయోః జ్ఞానం యత్తద్ జ్ఞానం మతం మమ ॥** – 13.3

నేను శరీరాన్ని కాను, నేను శరీరాన్ని పరికరంగా వాడుతాను; నేను మనస్సును కాను, నేను మనస్సును పరికరంగా వాడుతాను. అంటే మనకు తెలిసిన గుణాలన్నీ కార్యకరణసంఘాతానికి చెందుతాయి కాని సాక్షికి చెందవు.

మనకు అనుభవంలోకి వచ్చే ఏ గుణమైనా, మనం అనుభవించే వస్తువుకు చెందుతుంది. ఇదొక ముఖ్యమైన ప్రకృతిసూత్రం. దీన్ని బాగా గుర్తుపెట్టుకోవాలి. నేను ఆకుపచ్చరంగును చూస్తే, ఆ రంగు వస్తువుదా, కన్నుదా? చూడబడే రంగు, చూడబడే వస్తువుకు చెందుతుంది కాని చూసే కన్నుకు చెందదు. అలాగే గుండ్రటి ఆకారం

నేను చూసే గుండ్రటి వస్తువుకు చెందుతుంది. అంటే గుణాలు చూడబడే వస్తువుకు చెందుతాయి కాని చూసే కన్నుకు చెందవు. ఈ సూత్రం ప్రకారం, త్రిగుణాలు చూడబడే మనశ్శరీరాలకు చెందుతాయి కాని, చూసే సాక్షికి చెందవు. సాక్షినైన నేను గుణాతీతుణ్ణి. సాక్షి అన్నా, ఆత్మ అన్నా ఒకటే. నేను ఎప్పుడు గుణాతీతుణ్ణి? ఎళ్ళవేళలా గుణాతీతుణ్ణి. నేను అంతకుముందు, ఇప్పుడు, ఇకముందు కూడా గుణాతీతుడ్నే. నేను సగుణం అవలేను. గుణాతీతంగా ఎదగటమంటే మన దృష్టిని సగుణాత్మకమైన మనశ్శరీరాలనుంచి, నిర్గుణసాక్షి వైపుకు మరల్చటమే. ఆ మార్పు జ్ఞానంవల్లనే కలుగుతుంది. దీన్ని జీవన్ముక్తి అంటారు. ఆ జీవన్ముక్తి ఫలాన్ని ఈ క్రింద శ్లోకంలో చూస్తాము.

**గుణానేతానతీత్య త్రీన్ దేహీ దేహసముద్భవాన్ ।**

**జన్మమృత్యుజరాదుఃఖైః విముక్తోఽ మృతమశ్నుతే ॥** – 14.20

త్రిగుణాలు ఉన్న మనశ్శరీరాలకు గతి ఉందని చూశాము. అవి వరుసగా ఊర్ధ్వగతి, మధ్యమగతి, అధోగతి. నిర్గుణ ఆత్మకు ఏగతి ఉంటుంది? **అహం అగతిమ్ అస్మి.** నేను సర్వవ్యాపక చైతన్యాన్ని. నానుంచే సగుణ మనశ్శరీరాలు చైతన్యం పొందుతాయి; నాలోనే లయమవుతాయి. కాని వాటి గుణాలు నాకు అంటవు. నేను అసంగ సాక్షిచైతన్యాన్ని. ఈ జ్ఞాననిష్ఠలో నిలబడితే దాన్ని మోక్షం అంటారు.

### 4. గుణాతీతలక్షణం, సాధన – శ్లోకాలు: 21–27

సగుణ అహంకారంనుంచి నిర్గుణ సాక్షికి ఎదగాలని వినగానే, సహజంగానే అర్జునునిలో కుతూహలం కలిగింది. అందువల్ల అతను మూడు ప్రశ్నలను అడిగాడు.

**అర్జున ఉవాచ**

**కైర్లింగైః త్రీన్ గుణానేతాన్ అతీతో భవతి ప్రభో ।**

**కిమాచారః కథం చైతాన్ త్రీన్ గుణానతివర్తతే ॥** – 14.21

ఆ మూడుప్రశ్నలూ ఇవి –

ఎ) **గుణాతీత లింగమ్** – గుణాతీతుని లక్షణాలు

బి) **గుణాతీత ఆచారః** – గుణాతీతుడు ప్రవర్తించే తీరు

సి) **గుణాతీతస్య సాధనమ్** – గుణాతీతునిగా ఎదగటానికి అవసరమైన సాధనలు

వీటన్నిటికీ కృష్ణపరమాత్మ తర్వాత వచ్చిన శ్లోకాల్లో జవాబు చెప్పాడు.

ఎ) **గుణాతీత లింగమ్** – గుణాతీతుడు అంటే కార్యకరణసంఘాతంమీద అభిమానం లేనివాడు. జగత్తునే కాకుండా, తన మనశ్శరీరాలను కూడా తనకు భిన్నంగా చూస్తాడు. తను మనశ్శరీరాలకు భిన్నంగా ఉన్నాడని తెలుసుకోవటంవల్ల వాటికి వచ్చే సమస్యలకు, జ్ఞాని తీవ్రంగా స్పందించడు. అంటే అతను ఏదైనా సమస్య వస్తే ఖంగారుపడిపోయి, హడావుడి చెయ్యడు; అలాగని పూర్తి నిర్లక్ష్యంగానూ ఉండడు. ఆ సందర్భంలో ఏది చేయాలో అది చేస్తాడు.

జ్ఞానికి తన శరీరానికి మూడుగుణాలు ఉంటాయనీ, అవి హెచ్చుతగ్గులు అవుతూ ఉంటాయనీ తెలుసని చూశాము. ఇప్పుడు జగత్తులో కూడా మూడుగుణాలు ఉంటాయని, అవి కూడా హెచ్చుతగ్గులు అవుతూ ఉంటాయని తెలుసు అతనికి.

ఇద్దరు మనుష్యుల మధ్య అభిప్రాయాలు కలవాలని చూడటంలో అర్థంలేదు. ఒకవేళ వారి అభిప్రాయాలు ఇప్పుడు బాగా కలిసినా, ఇద్దరూ కూడా కాలక్రమేణా మారుతూ వస్తారు; వారి అభిరుచులు మారతాయి; వారి సరదాలు మారతాయి. అందువల్ల అనాత్మలో మార్పులు సహజం; అనుబంధం పెంచుకోవటం, బంధం వీగిపోవటం సహజం; జన్మ, మరణ, జరాదుఃఖాలు సహజం. వీటిలో వేటినీ నేను మార్చలేను. నేను చేయగలిగిందల్లా ఒకటే. నా దృక్పథాన్ని మార్చుకోవటం. అది ఒక్కటే మార్గం. నాలో ఈ మార్పు కూడా క్షణాలమీద రాదు. కొన్ని సంవత్సరాలుగా పేరుకుపోయిన అలవాట్లు త్వరగా మారవు.

నేర్చుకున్న జ్ఞానంలో నిలబడి, విపరీతభావనలు పోవటానికి తోడ్పడుతుంది నిదిధ్యాసనం. రాగద్వేషాలలాంటి విపరీతభావనలు తగ్గుతూ వచ్చేసరికి, జ్ఞానం కొత్తగా పెరగదు కాని జ్ఞానం ప్రకాశవంతంగా తెలుస్తుంది. నిండుపున్నమిరోజు చంద్రుడు చాలా ప్రకాశవంతంగా కనిపిస్తాడు కాని, మనకు విజ్ఞానశాస్త్రపరంగా అది చంద్రుడు పౌర్ణమికి పెరుగుతూ రావటం కాదు, చంద్రుని కాంతికి అడ్డుపడుతున్న సూర్యకాంతి తొలుగుతూ వస్తుందని తెలుసు. అదే విధంగా బయట జరిగే సంఘటనలకు నా ప్రతిస్పందన తగ్గుతూ వస్తునకొద్దీ, జ్ఞానం పెరుగుతున్నట్టు అనిపిస్తుంది.

మనం ప్రయత్నపూర్వకంగా నిదిధ్యాసన చేస్తే, మనం అంతకుముందులాగే దేనికైనా స్పందించే తీవ్రతను తగ్గించుకుంటూ రావచ్చు. అది ఎంతమేరకు తగ్గిందో మనను మనమే పరీక్షించుకోవటానికి ఒక పరీక్ష ఉంది. దాన్ని FIR test అనవచ్చు. ఇది పోలీస్‌స్టేషన్‌లో రాసుకునే ఎఫ్.ఐ.ఆర్. కాదు. ఇక్కడ FIR test అంటే –

F - Frequency – ఎంత తరుచు కోపం వస్తోంది?
I - Intensity – ఎంత తీవ్రంగా ఉంటుంది?
R - Recovery Period – ఎంత త్వరగా తగ్గుతోంది?

**Frequency** – ఎంత తరచు కోపం వస్తోంది? ఏదైనా అనుకోని సంఘటన జరిగితే కోపం ముంచుకొస్తుంది మామూలుగా. కోపం ఒక ఉదాహరణ మాత్రమే. కోపం, చిరాకు, భయం, అభద్రతాభావన మొదలైన అనారోగ్యకరమైన భావాలు ముంచుకొస్తాయి. జ్ఞానం పొందినకొద్దీ ఈ భావాలు తగ్గుతూ వస్తాయి. జ్ఞానం పొందగానే రాత్రికి రాత్రి మంచిరత్నాలలాగా మారిపోము. గీతాబోధ విన్నాక కూడా, మనలో ఉన్న రాగద్వేషాలు అంటిపెట్టుకునే ఉంటాయి. ఎందుకంటే అవి మన అలవాట్లు, మన చిరకాలనేస్తాలు. అందువల్ల మెరుపులా మెరిసిపోతుంది మార్పు అని మాత్రం ఆశించకూడదు. ఆ మార్పు కాలక్రమేణా రావాలి. అది మూడుస్థాయిల్లో వస్తుంది. మొదటిస్థాయిలో ప్రతిచిన్నదానికీ ఖస్సుమనకుండా, కొన్నింటిని ఓర్చుకునే స్థాయికి వస్తాము. అంటే అంతకుముందు తరచు కోపం వస్తే, ఇప్పుడు వెనువెంటనే రాదు.

**Intensity** – ఎంత తీవ్రంగా ఉంటుంది? కోపం ఎలా వెనువెంటనే రాదో, ఆ కోపంయొక్క తీవ్రత కూడా తగ్గుతూ వస్తుంది. ఎలా తెలుసు? ప్రతిస్పందనయొక్క తీవ్రత మూడుస్థాయిల్లో ఉంటుంది. అవి మానసం, వాచికం, కాయికం. అందువల్లనే పరీక్ష రాసేముందు మానసికంగా ఖంగారుపడితే, కడుపులో అజీర్ణం చేస్తుంది.

**సీదంతి మమ గాత్రాణి ముఖం చ పరిశుష్యతి** – 1.29

అన్నాడు అర్జునుడు. అతని మనస్సులో రాగం శరీరస్థాయికి పాకింది. దాన్ని మాటల్లో వెలిబుచ్చాడు.

ఈ తీవ్రత రెండుస్థాయిల్లో తగ్గుతూ వస్తుంది. కాయికంగా పోతుంది. అంటే చేతల్లో చూపించటం తగ్గుతుంది కాని మాటల్లో, ఆలోచనల్లో ఇంకా ఉంటుంది. కొంతమంది పరుషంగా మాట్లాడి, ఇతరులని బాధిస్తూనే ఉంటారు. కాని జ్ఞానం పెరిగినకొద్దీ మాటల్లో కూడా మార్పువస్తుంది. కాని ఆలోచనల్లో మార్పు అంత త్వరగా రాదు. వేదాంతం నేర్చుకున్నా కూడా అంత త్వరగా ఆలోచనల్లో భావోద్రేకం పోదు. అది చూసేవారికి తెలియకపోవచ్చు కాని, అనుభవిస్తున్నతనికి తెలుసు. అది కూడా పరీక్ష చేసుకుని తగ్గించుకుంటూ రావాలి.

**Recovery Period** – ఎంత త్వరగా తగ్గుతోంది? అంతకుముందు కోపం వస్తే ఆ కోపం రోజుల తరబడి ఉంటుంది. రానురాను ఆ కోపం రోజులనుంచి గంటలకు తగ్గుతుంది; ఇంకా గంటలనుంచి నిముషాలకు, నిముషాలనుంచి క్షణాలకు తగ్గుతూ వస్తుంది. జ్ఞాని ఏదైనా వినగానే 'ఏమిటి?' అన్నా కూడా వెంటనే సర్దుకుని 'అయితే ఏమిటి?' అనే స్థితికి ఎదుగుతాడని చాలాసార్లు చూశాము.

ఇలా తరచు వచ్చే కోపాన్ని తగ్గించటానికి, తీవ్రతను తగ్గించటానికి, వేగంగా తగ్గించటానికి నిదిధ్యాసనం తోడ్పడుతుంది. ఆ విధంగా నిదిధ్యాసనం భావోద్రేకాలను తగ్గించటంద్వారా జ్ఞానాన్ని జ్ఞాననిష్ఠగా మలుచుకోవటానికి తోడ్పడుతుంది.

కాని ఒక విషయం గుర్తుంచుకోవాలి. ప్రతిస్పందనలు అసలు లేకుండా సున్నాకు పడిపోవు. ప్రతిస్పందన సున్నాగా ఉండేది బల్ల, కుర్చీవంటి జడపదార్థాలకే! మన మనస్సు జీవమున్న మనస్సు. కాని దాన్ని నిదిధ్యాసనం ద్వారా మనస్సుతో అతిగా మమకారం పెంచుకోకుండా, దానితోపాటు తీవ్రంగా స్పందించకుండా ఉండటం నేర్చుకోవాలి. మనస్సుమీద మమకారం పెంచుకుంటే, అది అహంకారం అవుతుంది.

నేను గీతాబోధలో నేర్చుకున్నది ఏమిటి? నేను అహంకారాన్ని కాను, నేను దాన్ని సాక్షిగా చూసే చైతన్యాన్ని. అది జీర్ణించుకుంటే అప్పుడు అంతగా స్పందించను. అంటే స్పందించే మనస్సుమీద నేను స్పందన చూపాలి. ముందు ఏదైనా సంఘటన జరిగితే మనస్సు వెంటనే స్పందిస్తుంది. తర్వాత నేను గీతాబోధ నేర్చుకుంటున్న విద్యార్థిని, నేను ఇలా స్పందించకూడదని గుర్తుతెచ్చుకోవాలి.

ప్రతి గీతావిద్యార్థి కూడా ఈ రెండురకాల స్పందనలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. మొదటిది పరిస్థితికి సహజమైన స్పందన. అంటే ఏదైనా నచ్చనిది జరిగితే, కోపం చూపించటం. వెంటనే ఆత్మవిమర్శ ప్రారంభమవుతుంది. అందరిలాగా నేను కూడా వెంటనే కోపం చూపించాను. నేను ఇన్నాళ్ళూ గీత నేర్చుకుని ఏమిటి లాభం? నాలో

ఇంతకూడా మార్పు రాలేదనే నిరాశకు లోనయ్యే ప్రమాదం ఉంది. ఒకవేళ మనం నిరాశ చెందకపోయినా, మన కుటుంబసభ్యులు మనను కించపరుస్తారు. గీతకు వెళ్ళికూడా నీ కోపం ఏమాత్రం తగ్గలేదు. గీత నేర్చుకుని మాత్రం ఏంలాభం? హాయిగా అది మానేసి ఇంట్లో కూర్చోమని విమర్శిస్తారు. అది మన అహాన్ని దెబ్బతీస్తుంది. ఇది రెండవ స్పందన.

కాని నెమ్మదిగా ఈ రెండవ స్పందన తగ్గుతూ వస్తుంది. అది తగ్గకుంటే నేను సాక్షిచైతన్యం అనే జ్ఞాననిష్ఠలో నిలబడగలగాలి. దానికి కొంతసమయం పడుతుంది. అందువల్ల దాని జోలికి పోకుండా, అంటే నేనెందుకిలా ప్రవర్తించాను అని ఆత్మవిమర్శ చేస్తూ కూర్చోకుండా, ప్రతిచిన్నదానికీ విరుచుకుపడటం తగ్గించుకుంటూ రావాలి. అంటే ముందు ప్రతిస్పందనను తగ్గించి, దాని తర్వాత ఆ ప్రతిస్పందనమీద చూపే స్పందనను తగ్గించుకు రావాలి. దీన్ని జ్ఞాననిష్ఠ అంటారు.

కృష్ణపరమాత్మ ఈ జ్ఞాననిష్ఠను అద్భుతంగా 22-27 శ్లోకాల్లో వర్ణించాడు. జ్ఞాని మూడుగుణాలనూ అనుభవిస్తాడు. మూడుగుణాల్లో ఏది ఎప్పుడు ఎక్కువ ఉన్నా, తన మనస్సును తను ద్వేషించడు; ఇంకా వివరంగా చెప్పాలంటే తమోరజోగుణాలు ఎక్కువైనప్పుడు వాటిని ద్వేషించడు, సత్త్వగుణం తగ్గినప్పుడు బాధపడడు. తన మనశ్శరీరాలను ఉన్నదున్నట్టుగా స్వీకరించగలగటమే గుణాతీతలక్షణము.నేనే ఎందుకు ఇలా స్పందించాను అనుకుంటే అది ఇంకా గొప్ప సంసారం అవుతుంది; జ్ఞాని ఆ స్పందనను సాక్షిగా చూస్తాడు. ఇది జ్ఞానిని తెలుసుకునే లక్షణం.

**గుణాతీత లింగమ్ – మనశ్శరీరాలను సాక్షీభూతంగా చూడటం.**

బి) **గుణాతీత ఆచారః** – గుణాతీతుడు ప్రవర్తించేతీరు. గుణాతీతుడు ద్వంద్వాలకు అతీతంగా ఎదుగుతాడు. జ్ఞానికి జగత్తులో కూడా ఈ మూడుగుణాలు ఉండకతప్పవని తెలుసు. అందువల్ల అన్నిరకాల పరిస్థితుల్లోనూ సమత్వాన్ని పాటిస్తాడు.

**సమదుఃఖసుఖః స్వస్థః సమలోష్టాశ్మకాంచనః ।**
**తుల్యప్రియాప్రియో ధీరః తుల్యనిందాత్మసంస్తుతిః ॥** – 14.24

సుఖదుఃఖాలను, ప్రియాప్రియాలను, నిందాస్తుతులను, మానావమానాలను, శత్రుమిత్రులను సమానంగా తీసుకుంటాడు. దీన్ని సమత్వం అంటారు. ఒకవేళ మనస్సు స్పందించినా, తను మళ్ళీ స్పందించడు. మనస్సుతో బంధం పెట్టుకోడు.

**గుణాతీత ఆచారః – సమత్వం, బంధవిముక్తి.**

సి) **గుణాతీతస్య సాధనమ్** – గుణాతీతునిగా ఎదగటానికి కావాల్సిన సాధన ఏమిటని అడిగాడు అర్జునుడు. నిజానికి గుణాతీతంగా ఎదగటానికి జ్ఞానం ఒక్కటే మార్గమని కృష్ణపరమాత్మ ముందే చెప్పేశాడు. కాబట్టి ఈ ప్రశ్నను ఇలా మలుచుకోవాలి – ఈ మూడుగుణాలను జ్ఞానంతో అధిగమించటానికి ఏ సాధన చెయ్యాలి?

కృష్ణపరమాత్మ జ్ఞానానికి సాధన – భక్తి అన్నాడు. భక్తి అంటే ఐదుదశల భక్తి అని పన్నెండవ అధ్యాయంలో చూశాము. అవి –

రెండుదశల కర్మ + రెండుదశల ఉపాసన + ఒకదశ జ్ఞానం = భక్తి.

**మాం చ యోఽవ్యభిచారేణ భక్తియోగేన సేవతే ।**
**స గుణాన్ సమతీత్యైతాన్ బ్రహ్మభూయాయ కల్పతే ॥** – 14.26

ఆ భక్తిని **అవ్యభిచారేణ** అన్నాడు కృష్ణపరమాత్మ. అంటే అనన్యభక్తి ఉండాలి. ఈ ఐదుదశల భక్తిలో జ్ఞానయోగ్యతా ప్రాప్తి పొంది, జ్ఞానం పొందితే, మోక్షం పొందుతాడు. అంటే అతను గుణాతీతునిగా ఎదుగుతాడు.

**గుణాతీతస్య సాధనమ్ – అవ్యభిచారభక్తి.**

చివరిశ్లోకంలో తన బోధను ముగించాడు కృష్ణపరమాత్మ. నేనే ఆ నిర్గుణబ్రహ్మను; నా స్వరూపం అమృతం, అవ్యయం, శాశ్వతం, ధర్మం, ఆనందం అని వివరించాడు కృష్ణపరమాత్మ. అటువంటి నిర్గుణబ్రహ్మజ్ఞానాన్ని ఐదుదశల సాధనద్వారా పొందగలవు అన్నాడు. ఆ విధంగా గుణత్రయాలను, గుణాతీతలక్షణాలను వివరించాడు కృష్ణపరమాత్మ.

## స్వామీజీ ఆణిముత్యాలు

**వేత్తి** – ఈ పూర్ణత్వాన్ని జ్ఞానంవల్ల మాత్రమే పొందగలవు అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఈ విషయాన్ని బాగా గమనించాలి. వేత్తిని గుర్తు పెట్టుకోవాలి. వేత్తి అంటే అర్థం చేసుకున్న అని వస్తుంది. దేన్ని అర్థం చేసుకున్న? పూర్ణత్వాన్ని అర్థం చేసుకున్న వ్యక్తి. మోక్షానికి ఎన్ని మార్గాలు ఉన్నాయి? కర్మయోగం, భక్తియోగం, రాజయోగం, హఠయోగం, కుండలినీయోగం మొదలైనవి మోక్షానికి దారితీస్తాయా? ఇవేవీ మోక్షానికి దారితీయవు అని ఈ శ్లోకంద్వారా అర్థమవుతుంది. అలాగని ఈ యోగాలవల్ల ప్రయోజనం లేదనటం లేదు, కాని ఇవన్నీ జ్ఞానయోగ్యతాప్రాప్తిని కలుగజేస్తాయి. కాని అంతిమలక్ష్యమైన పూర్ణత్వాన్ని కనుగొనాలంటే మాత్రం వేదాంత శ్రవణ, మనన, నిదిధ్యాసనలతో కూడిన జ్ఞానయోగానికి రావటమొక్కటే మార్గము.

అందువల్ల ఈ శ్లోకం చాలా ముఖ్యమైన శ్లోకం. ఈ అధ్యాయంలో మాత్రమే కాదు, భగవద్గీతలోనే ముఖ్యమైన శ్లోకాల్లో ఇది ఒకటి.